

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-2-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 15 పేజీలు: 10+4 వెల: 8.00



నేతలతో మంత్రి లోకేష్ ఆత్మీయ సమ్మేళనం 2లో

దేశంలో తొలిహైవే ఎమర్జెన్సీ ల్యాండింగ్ 5లో


# ప్రగతి బాటల పద్దు

## అభివృద్ధి, సంక్షేమాల జోడెద్దులతో పరుగు

### ఏ రంగానికి ఎంత?
(రూ.వేల కోట్లు)

అమరావతి నిర్మాణం: 6,000
విద్యుత్ 13,934
రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు: 13,546
విబిరామ్‌జీ: 8,365
గృహ నిర్మాణం: 5,451
పరిశ్రమలు: 3,161
స్వచ్ఛభారత్ మిషన్: 1,037
ఎన్టీఆర్ వైద్యసేవ: 4,000
జల్‌జీవన్: 4,000
మేజర్ ఇరిగేషన్: 9,906
అన్నదాత సుఖీభవ: 6,600
పోలవరం ప్రాజెక్టు: 6,105
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: 1,927
ధరల స్థిరీకరణ నిధి: 500
ఎన్టీఆర్‌భరోసా: 27,719
దీపం(2.0): 2,601
స్త్రీశక్తి: 1420
ఉచిత విద్యుత్: 600
సాంఘిక సంక్షేమం: 11,118
ఇంధనశాఖ: 13,934

## 2026-27 రాష్ట్ర మొత్తం బడ్జెట్- రూ.3,32,205 కోట్లు

రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు ❖ మూలధనవ్యయం: రూ.53,915 కోట్లు

రెవెన్యూలోటు: రూ. 22,002కోట్లు ❖ ద్రవ్యలోటు: రూ.75,868 కోట్లు

### వివిధ సంక్షేమ పథకాలకు భారీగా కేటాయింపులు జరిపిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విధ్వంసం నుంచి వికాస దిశగా 2024 జూన్‌నుంచి ఏపీ చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పాలనసాగు తుందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యవుల కేశవ్ స్పష్టం చేసారు.2019-24 మధ్య 10.3శాతం ఆర్థికవృద్ధిని 2024-25లో 11,75శాతానికి పెంచామన్నారు. శాసనసభలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు. బడ్జెట్‌లో రూ. 3,32,205 కోట్లు అంచనా వ్యయం, రూ.2,56,143 కోట్లు, రెవెన్యూ వ్యయంగా,రూ.53,915 కోట్లు మూలధన వ్యయంగా ప్రతిపాదించారు. రెవెన్యూ లోటుగా రూ.22,002 కోట్లు, ద్రవ్య లోటుగా రూ.75,868 కోట్లు చూపించారు.బడ్జెట్‌లో ఏ రంగాలకుఎంత కేటాయించింది మంత్రి వివరించారు.ఆర్థిక ప్రణాళికను సభకు సమర్పించే క్రమంలో పయ్యావుల ప్రసంగిస్తూ తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగుల పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్ లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు.12.3 శాతం గా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని >>2


శనివారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు


శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌ను సమర్పిస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

## ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్

### మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో పోలీసు శాఖలో తీసుకువచ్చిన ఆధునీకరణ, సంక్షేమ చర్యల గురించి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. గత పాలనలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మంచివారు భయపడనప్పుడు చెడు శక్తులు బలహీనమవుతాయి అని అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ వ్యాఖ్యను ప్రస్తావించారు. పోలీసుశాఖకు 3000కొత్త వాహనాలను >>2

# సాగుకు చేయూత

### రూ.53,752 కోట్లతో వ్యవసాయ, అనుబంధశాఖల బడ్జెట్

వ్యవసాయం: రూ.12,152 కోట్లు
సాగునీటిపారుదల: రూ.14,276 కోట్లు
ఉద్యానశాఖ: రూ.1,123 కోట్లు
మార్కెటింగ్: రూ.515 కోట్లు
పశుసంవర్ధకశాఖ: రూ.1121 కోట్లు
మత్స్యశాఖ: రూ.523 కోట్లు


శనివారం అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఏపీ వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు.తద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా రైతన్న మీ కోసంఖి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్ ను రూ.53,752 కోట్ల రూపాయల అంచనాలతో మంత్రి అచ్చెన్నాయుడు శాసన సభలో ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయ శాఖకు రూ.12,152 కోట్లు, సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణకు రూ.14,276 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.1,123 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ.515 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,121 కోట్లు, మత్స్యశాఖకు రూ.523 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. బడ్జెట్‌లో వ్యవసాయంనీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణనిధి రూ.500కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. వీబీ జీ రామ్ జీ రూ.8,365 కోట్లు,గృహనిర్మాణం (పట్టణగ్రామీణ) రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ రూ.4,000 కోట్లు, జల జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, రీ ప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ రూ.2,144 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ రూ.955 కోట్లు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.838 కోట్లు కేటాయించారు. స్వేదంతో భూమిని సేద్యం చేసే ప్రజల జీవనానికి అన్నం ప్రసాదించే రైతన్నలకు వందనాలు అంటూ మంత్రి అచ్చెన్నాయుడు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రైతును రాజుగా నిలబెట్టాలనే సంకల్పంతో వ్యవసాయ, అనుబంధ శాఖలు పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర2047 సాధన కోసం వ్యవసాయ రంగానికి సంబంధించి ఫార్మర్స్ అగ్రిటెక్ ప్రధాన సూత్రంగా ఉందని అన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అధిక ఆదాయ రంగంగా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేధ, డీప్ టెక్నాలజీ, డ్రోన్లు, రోబోటిక్స్, ఉపగ్రహ ఆధారిత వ్యవస్థలువంటి సాంకేతికతను ఉపయోగించుకుంటామని మంత్రి అచ్చెన్న తెలిపారు.

**రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా పంచసూత్రాల అమలు:** రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ >>2

### ఎపిపిఎస్సీలో అక్రమాలపై
## దర్యాప్తునకు సిట్
### చీఫ్‌గా సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యనార్

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ హయాంలో చేపట్టిన గ్రూప్1 నియామకాల్లో అక్రమాల దర్యాప్తుకు సిట్ ను ఏపీ ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సిట్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఏడీజీ, ఆపై అధికారి నేతృత్వంలో సిట్ నియమించాలని హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వానికి జారీ చేసింది. ఈ నెల 11న విచారించి ప్రత్యేక సిట్ నియామకానికి హైకోర్టుఆదేశాలిచ్చింది.దాంతో సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.సిట్ సభ్యుడిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి నియామకం అవసరమైతే దర్యాప్తు కోసం ఏ అధికారినైనా తీసు కోవచ్చున్న ప్రభుత్వం మార్చి16 లోగా సిట్ దర్యాప్తు తుది నివేదిక >>2

### 'సీమ' ఉద్యానహబ్‌కు
## రూ. 30వేల కోట్లు
### గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి
### క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి ప్రాధాన్యం

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేలకోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారని సీఎం అన్నారు. శనివారం సీఎం చంద్రబాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిపైనా, ప్రకాశం, రాయలసీమ అభివృద్ధి మీద కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రం ఇంకా వైసీపీ పాలనలో వచ్చిన విధ్వంసం నుంచి పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందన్న చంద్రబాబు.. ప్రస్తుత బడ్జెట్ మెరుగైనది అయినప్పటికీ సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ అనే వారసత్వ సమస్యను కేంద్ర సహకారంతో మేనేజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతి విషయంలో చంద్రబాబు మాట్లాడుతూ, రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని, రాజధానిని జాతీయ రహదారులకు అనుసంధానిస్తున్నామని చెప్పారు. దీంతో రాకపోకలు పెరిగి ఆదా యం వస్తుందని వివరించారు. రాజధాని అమరావతికి పశ్చిమ >>2




# ప్రగతి బాటల పద్దు

>> సంప్రదింపులు జరిపా మన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ. 37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**2026-27 ఆర్థిక ప్రణాళికలో కేటాయింపులు**

202627 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు. వ్యవసాయం, నీటి భద్రత కేటాయింపులు 202627 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయంనీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.

**మూలధన వ్యయం పెంపు:** మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025- 26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 202627 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.

**పన్నుల ద్వారా ఆదాయం:** 2026- 27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం - 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు - 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా - 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ - 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం - 17 శాతం, విద్య - 11 శాతం, ఆర్థికం - 8 శాతం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి -7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం - 6 శాతం, జలవనరులు - 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ - 4 శాతం, విద్యుత్ రంగం - 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు -4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) - 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు - 18 శాతంగా పేర్కొన్నారు.

**రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు:** రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025 26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 202627 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 202526 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 202627 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం - 38 శాతం, పన్నేతర ఆదాయం - 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు - 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా - 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ - 10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య - 11 శాతం, ఆర్థికం - 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి - 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం - 6 శాతం, జలవనరులు - 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ - 4 శాతం, విద్యుత్ రంగం - 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు - 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) - 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు - 18 శాతం జరుగనున్నాయి.

**ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం**

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్ లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**స్కీంల పునరుద్ధరణకు రూ.18,701 కోట్లు ఖర్చు**

గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్ధరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కి కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కి నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు.

సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్ తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్ లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్లు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.



శనివారం బడ్జెట్ పత్రాలను సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌కు అందచేస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



బడ్జెట్ ప్రతులను చదువుతున్న మంత్రులు, శాసనసభ్యులు

## ఏ రంగానికి ఎంత? (రూ.వేల కోట్లు)

తల్లికి వందనం: 9,668

స్త్రీ, శిశు సంక్షేమం: 4,581

ఉపకార వేతనాలు: 3,836

సమగ్రశిక్ష : 2,946

ఉన్నత విద్య: రూ.2,566

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం:2,161

మన బడి మన భవిష్యత్: 1,500

నైపుణ్యాభివృద్ధి: 1,232

పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా: 707

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర: 654

యువత, క్రీడలు: 438

వ్యవసాయ అనుబంధ రంగాలు: 13,598

పంచాయతీరాజ్ శాఖ : 22,942

మున్సిపల్‌శాఖ :14,539

జల వనరుల శాఖ : 18,224

పాఠశాలవిద్యాశాఖ: 32,308

ఇంధనశాఖ: 13,934

సాంఘిక సంక్షేమ శాఖ:11,118

కార్మిక శాఖ: 735

గృహ నిర్మాణశాఖ రూ.6357

హోంశాఖ రూ.9,165

విశాఖ ఆర్థిక ప్రాంతానికి: 28,000

విశాఖ ఆర్థిక ప్రాంతం పరిధిలోకి పది జిల్లాలు



## సిఎం చంద్రబాబును కలిసిన శివతత్వ చీరలు ధరించిన మహిళా ప్రజాప్రతినిధులు

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని, కూటమి ప్రభుత్వానికి చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు శివతత్వానికి ప్రతీకగా ఉన్న చీరలను ధరించి సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.శివుని వలే సమస్త ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబును వారు ఈ సందర్భంగా అభినందించారు.ఆడబిడ్డలకు ఎప్పుడు అండగా ఉంటానని సీఎంకే రకమైన వస్త్రధారణతో అసెంబ్లీకి విచ్చేసిన మహిళా ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మహిళా నేతలు ఈ విధంగా ప్రత్యేకతను చాట డంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం, అసెంబ్లీ లాబీల్లో ఈ మహిళా ప్రజాప్రతినిధులు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యేనందమూరి బాలకృష్ణలను కూడా కలిసి మాట్లాడారు.

## ప్రజలకు సిఎం చంద్రబాబు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:**మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం కొలువై ఉన్న పవిత్ర భూమి మన రాష్ట్రం. భక్త సులభుడైన శివుడు ఈ రోజే లింగాకారంలో ఆవిర్భవించాడని శివపురాణం చెబుతోంది. ఈ పర్వదినాన శివారాధనతో మహాశివుని అనుగ్రహం కలిగి అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను.

శివార్చన, జాగరణలతో మహా శివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం. పరమశివుని అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను.

# రేపు బిల్ గేట్స్ అమరావతి రాక

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** బిల్ గేట్స్ ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్ కు రానున్నారు. మొదట ఈ పర్యటన ఈనెల 18వ తేదీన ఉంటుందని అందరు భావించినా 2రోజుల ముందుగానే ఆయన రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ పర్యటన రాష్ట్రంలో ఒక్క రోజే ఉంటుందా? లేక రెండు రోజులు? ఉంటారా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో భాగంగా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమీక్షలో పాల్గొంటారని సమాచారం. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలకు తి। పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఓ ఒప్పందాన్ని సైతం కుదుర్చుకుంది. అదేవిధంగా అత్యుత్తమ సాంకేతికత ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షి ంచేలా ప్రాజెక్టును కూడా చేపట్టింది. అంతేగాక బిల్ గేట్స్ ఫౌండేషన్ చేయూతతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనుంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలాంటి విషయాలతో పాటు మరికొన్నివాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చర్చిస్తారని సమాచారం.

అలాగే రాజధాని అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టే పెట్టుబడులపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఫిబ్రవరి 19వ తేదీన దిల్లీలో జరిగే ఏఐ సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొంటారు. సీఎం చంద్రబాబు సైతం ఈ సదస్సుకు హాజరవుతారు.

# సాగుకు చేయూత

>> ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, 62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో రైతును "రాజు"గా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత:** 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 33.20 శాతంతో రూ.5,39,454 కోట్లు సాధించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలోని 8,357 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించారు. 2026-27 నాటికి పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 50 వేల గోకులాలను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా ఏపీ రూ.21,246 కోట్ల ఆదాయం పొందుతోందని దీన్ని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందిచామని వివరించారు.

**కర్షకుల అభివృద్ధికి కృషి**

ఆక్వా కల్చర్ అభివృద్ధి, మంచినీటి చేపల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్న చెప్పారు. ఎన్టీఆర్ జలసిరి కింద 2026-27లో రైతులకు ఉచితంగా బోర్లు వేయడంతో పాటు, మోటర్లు పంపిణీ చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. నేల, నీరు, రైతు భద్రతే రాష్ట్ర భవిష్యత్తుగా భావిస్తున్నామని ఇదే కోవలో కర్షకుల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేస్తూ వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీ ముందుంచారు.

# నేతలతో మంత్రి లోకేష్ ఆత్మీయ సమ్మేళనం

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:**రాజకీయ వ్యూహాలు, అసెంబ్లీ బడ్జెట్ చర్చల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని.. ఆయన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వనభోజనాల తరహాలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయ చర్చలకు తావులేకుండా, కేవలం కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, వారికి గల క్రీడాభిలాషపై మాట్లాడుకున్నారు. సమావేశానికి వచ్చిన చిన్నపిల్లలతో లోకేష్ సరదాగా కబుర్లు చెబుతూ గడిపారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదు.. పిల్లలు క్రీడలను కూడా కెరీర్‌గా ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలిఖి అని లోకేష్ ఈ సందర్భంగా సూచించారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు లోకేష్ ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు.

ఈ సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసి తన నియోజకవర్గ బ్రాండింగ్‌ను చాటుకున్నారు.



విజయవాడ,గుంటూరు నేతలతో కలిసి భోజనం చేస్తున్న లోకేశ్

## అన్ని రంగాలకు ప్రాధాన్యం: బిటి నాయుడు

**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ,శాసనమండలి ప్రివిలేజ్‌కమిటీ ఛైర్మన్ బి.టి. నాయుడు అన్నారు.బడ్జెట్ సందర్భంగా బిటి నాయుడు మీడియాతో మాట్లాడారు.ప్రధానంగా విద్య,వ్యవసాయ రంగాలకు అత్యధికంగా కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు.

## బడ్జెట్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయ్యింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రతులను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అందజేశారు. 2026-27 వార్షిక బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్

>> త్వరలో అందించనున్నాం. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి ఆధునిక నేరాలను ఎదుర్కొనేందుకు ప్రతిజిల్లాల ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏర్పాటు. స్మార్ట్ పోలీసింగ్ ల్యాబ్‌ల స్థాపన, కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాజెక్టులు, ఆధునిక కమ్యూనికేషన్, భద్రతా పరికరాలు, సీసీటీవీ, డ్రోన్ వినియోగంతో సాంకేతికంగా దృడమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం. కొత్త ఏపీ పోలీసు అకాడమీ స్థాపన కోసం 94 ఎకరాలు కేటాయించాలమని మంత్రి చెప్పారు. నిర్మాణ పనుల ప్రారంభానికి ఈ సంవత్సరంలో రూ.15 కోట్ల కేటాయింపులను ప్రభుత్వం ప్రతిపాదించింది. శ్రీకాకుళం, రాజమంత్రి, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో 4 కొత్త ఇండియా రిజర్వ్ ఏపీఎస్పీ బెటాలియన్‌లను ప్రారంభించి 3920 పోస్టులను మంజూరు చేశాం. పౌర-పోలీసు నిష్పత్తిని మెరుగుపర్చేందుకు 5757 స్టైపెండరీ కేడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లను నియమించాం. శిక్షణ సమయంలో వారికి ఆర్థిక మద్దతుగా నెలవారీ భత్యం రూ.4500 నుంచి 12000కు పెంపు. పోలీసు సిబ్బందికి బకాయి ఉన్న టీఏ, డీఏలు, సెలవు సంబంధిత బకాయిలు, వైద్య రీయింబర్స్‌మెంట్ తదితర చెల్లింపుల కోసం దాదాపు రూ.500 కోట్ల విడుదల. పోలీసు కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఉచిత బీమా కవరేజీ కల్పించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథక పునరుద్ధరణ. గత ఐదేళ్లుగా విస్తరించిన గంజాయి సమస్యకు ప్రత్యేక విభాగం ఈగల్ ద్వారా, డ్రోన్ల వినియోగంతో కట్టడి. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. దీనిద్వారా 7 నిమిషాల్లోనే స్పందన లభిస్తుంది. వేధింపులకు పాల్పడేవారిపై కఠినచర్యలు ఉంటాయన్నారు.

## 'సీమ' ఉద్యానహబ్‌కు రూ. 30వేల కోట్లు

>> బైపాస్‌వల్ల యాక్సెస్ పెరిగిందని, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌లతో మరింత యాక్సెస్ మెరుగుపడుతుందని సీఎం పేర్కొన్నారు. ఇది అమరావతిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఉంటుంది. ఇది కేవలం రాజధాని నగర అభివృద్ధి మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకంఖి. అని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దుతోందని సీఎం తెలిపారు. ఇటీవల క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన చేసి, అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రకటించామని.. ఇది హైదరాబాద్ ఐటీ రివల్యూషన్‌తో పోల్చదగిన మరో విప్లవం అవుతుందని ఆయన అన్నారు.ప్రపంచంలో టాప్3 క్వాంటం వ్యాలీల్లో అమరావతి ఒకటిగా నిలవాలనేది మన దీర్ఘకాలిక దృష్టి అని చంద్రబాబు తెలిపారు. అదే సమయంలో, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరకని రాయలసీమలో ఇప్పుడు దేశంలోనే ఉత్తమ పండ్లు (ముఖ్యంగా దానిమ్మ) పండుతున్నాయని, అప్పుడు తెచ్చిన హంద్రీనీవా ప్రాజెక్టు ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని చెప్పారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు.. 500 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. వచ్చే 23 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. వైఎస్సార్సీపీ విధ్వంసం నుంచి కోలుకోవాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు.ఇబ్బందులు అధిగమించిఇప్పుడిప్పుడే ట్రాక్ఎక్కుతున్నామన్నారు.

## దర్యాప్తునకు సిట్

>> సమర్పించాలని ప్రభుత్వం ఆదేశం సహకారం అందించాలని హోంశాఖ ముఖ్య కార్య దర్శి, డీజీపీకి ప్రభుత్వం ఆదేశం సిట్‌కు సహకారం అందించాలని అన్ని విభాగాధిపతులకు ప్రభుత్వం ఆదేశం తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేసారు.

## వారం - వర్జ్యం

15-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
త్రయోదశి సా.5.01
ఉత్తరాషాఢ రా.7.44
వర్జ్యం : రా.11.54-1.34
దు.సా.4.36-6.11
శుభసమయం : ఉ.5.30-6.30,సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** మీ పలుకుబడి అన్ని విధాలుగా ఉపయోగించి ఉద్యోగపరమైన ఒత్తిళ్లను తట్టుకుంటారు. చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**వృషభం:** అధిక శ్రమవలన ఆరోగ్యపరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఉంటాయి. అన్ని విషయాలలో పురోగతి వుంటుంది.

**మిథునం:** లాభాలు మాత్రం చేతికందవు. సమయం పడుతుంది. సర్దుబాటు చేసే కొద్ది మరికొన్ని పుట్టుకొస్తాయి.

**కర్కాటకం:** ఉద్యోగపరంగా మీస్థాయి తగ్గనున్నదని శత్రువర్గం ప్రచారం అధికం అవుతుంది. ఆర్థికపరమైన ఒత్తిళ్ళు.

**సింహం:** సంతాన పురోగతిపై పునః పరిశీలన చేసి కొన్ని కొత్త నిర్ణయాలు అమలు చేస్తారు. వాహనయోగం.

**కన్య :** కుటుంబ గౌరవానికి హాని ఉండదు. ఎంతో కృషిచేసినా నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**తుల :** ఉద్యోగములో కొందరు స్వార్థపరులు మీపై చేసే దుష్ప్రచారము వలన మానసిక ప్రశాంతతను కోల్పోతారు.

**వృశ్చికం:** వాహనముల మరమ్మతులకు గాను అధిక ధనవ్యయము సంభవము. మిత్రులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** కోర్టు సంబంధమైన వ్యవహారములలో మధ్యవర్తుల సహాయ సహకారములను పొందుతారు.

**మకరం:** వ్యక్తిగత విషయములలో సంయమనము పాటించండి. ఇంటియందు శుభకార్యాలు జరుగుతాయి.

**కుంభం:** ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు. వ్యాపారాలకు సంబంధించిన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** మీ ఆస్తుల సంపూర్ణ వివరాలు మీ సన్నిహితులకు కూడా తెలియకుండా జాగ్రత్తపడతారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మద్యం కుంభకోణంలో మరో కేసు నమోదు చేసిన సిఐడి

**విజయవాడ, ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణంలో మరో కేసు సీఐడీ నమోదు చేసింది.ఈ కేసు దర్యాప్తు బాధ్యత సిట్‌కు అప్పగించింది. ఈ కేసుపై హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సూత్ర ధారుల నిగ్గు తేల్చాలని సిట్ ఆదేశింది.మద్యం రవాణాలో మహా దోపిడీ జరిగిందని కేసు నమోదు ఒక్కో బాక్స్ రవాణా ఛార్జి రూ.13 నుంచి రూ.34కు పెంపు రూ.200 నుంచి రూ.400 కోట్లు కొల్లగొట్టినట్లు అభియోగం టెండర్ దక్కించుకున్న కెసిరెడ్డి బినామీ కంపెనీ 10న కేసు నమోదు చేసిన సీఐడీ ఐపీసీలోని 420, 409, 468, 471, 120(బి) సెక్షన్లతో కేసు నమోదు బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111, 212, 217, 317 కింద పలువురిపై సీఐడీ కేసు సిట్‌కు విచారణ బాధ్యత అప్పగిస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రభుత్వం తరపున శివయ్యకు పట్టువస్త్రాలు



శివయ్యకు పట్టు వస్త్రాలను అందిస్తున్న మంత్రి ఆనం తదితరులు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరునికి శనివారం ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి అందించారు. శాసనసభ సమావేశాలు, బడ్జెట్‌సమావేశం ఉన్నా ధార్మికతకు ప్రాధాన్యత ఇచ్చే నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో అందించినట్లు మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు. ఆలయం వద్దకు మంత్రి రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ప్రోటోకాల్ ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం ఏర్పాటు చేసారు.అక్కడ నుంచి మేళ తాళాలు మంగళవాయిద్యాలతో నాయకులు స్వామి వారికి పట్టు వస్త్రాలను అందించేందుకు కదలిలారు. ఊరేగింపుగా రాగా అలంకార మండపం వద్ద మంత్రి నుంచి ఆలయప్రధానార్చకులు కరుణా కర్ గురుకుల్ పట్టు వస్త్రాలను స్వీకరించారు.ఈ కార్యక్రమాల్లో అభిషేక ప్రధాన గురుకుల్, డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్ డాక్టర్ అచ్చితా గురుకుల్,నిరంజన్ రాజేష్,సురేష్‌లు తట్టలను తీసుకున్నారు. మంత్రితోపాటు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి సుబ్బరాయుడు,ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్,ధర్మకర్తల మండలి సభ్యులు,తెలుగుదేశం పార్టీనాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమం, ఉపాధి, ఉద్యోగ, పారిశ్రామికీకరణ మహిళాభివృద్ధికి పెద్దపీట

### - హోంమంత్రి వంగలపూడి అనిత

**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** సంక్షేమం ఉద్యోగ ఉపాధి పారిశ్రామికీకరణ మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రంలో కొనసాగు తుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం కౌన్సిల్ చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను మంత్రి అనిత సభలో వివరించారు. ఉదయం 11.30గంటలకు బడ్జెట్ విషయాలను 50నిమిషాల పాటు చదివి వివరాలు వెల్లడించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టి బడ్జెట్ సారాంశాన్ని సభ్యులకు వివరించారు.అనంతరం శాసనమండలిని వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

# దేశాభివృద్ధిలో భాగస్వాములుకండి

## విద్యార్థులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు



విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఘంటా శ్రీనివాసరావు

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** చట్ట సభలు ఎలా పనిచేస్తాయి? ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి? అనే అంశాలపై విద్యార్థులు శుక్రవారం అసెంబ్లీలో స్వయంగా వీక్షించారు. సుమారు 200 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించి, సభా వ్యవహారాలను ప్రత్యక్షంగా తిలకించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి. ఎమ్మెల్యే ఘంటా శ్రీనివాస రావు విరామం సమయంలో విద్యార్థుల వద్దకు వెళ్లి వారిని పలకరించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు అనంతరం వారితో గ్రూప్ ఫోటోలు దిగారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకునేందుకు ఈ పర్యటన ఎంతగానో దోహదపడిందని విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ చొరవ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యామంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రేరణతో ఈ బడ్జెట్ సమావేశాలను వీక్షించ డానికివిద్యార్థులకు అను మతిని ఇచ్చామని ఏపీ స్పీకరు అయ్యన్న పాత్రు డు వెల్లడించారు, ఈ విషయంలో భారీ స్థాయి లో పాఠశాలల నుంచి స్పందన లభిస్తుందన్నారు. ఒక్కో స్కూల్ నుంచి 20 మంది విద్యార్థులకు అసెంబ్లీ గ్యాలరీలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. వారు అసెంబ్లీ సమావేశాలు పరిశీలించిన తరువాత వారితో తాను డిప్యూటీ స్పీకర్ రఘురామ ఫోటో దిగుతున్నామని వివరించారు. అయితే అంత బాగుందిగాని. పెద్ద అయ్యాక ఏమవుతారని వారిని ప్రశ్నిస్తే రాజకీయ నాయకులు అవుతా మంటున్నారు.వారి నుంచి ఫోటోకి సిద్ధంగా ఉండాలని స్పీకర్ చలోక్తులు విసిరారు. సీఎం చంద్ర బాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ పడి,పడి నవ్వారు తరువాత స్పీకరు అసెంబ్లీని 17కి వాయిదా వేసినట్లు వెల్లడించారు.

## 'అప్పన్న' వాంగ్మూలమే నిజాలు వెల్లడించిందా?

### - ఇడి ఫోకస్ ఆర్థికలావాదేవీలపైనేనా! - ప్రీమియర్ అగ్రిపుడ్స్ముడుపులు ఎవరి ఖాతాలో?



**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** సిబిఐ సిట్ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా కేసులో ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ (ఇడి)అప్పన్న వాంగ్మూలమే కీలకంగా ఆధారాలు పట్టించే దిశగా కదులుతున్నారనేది సమాచారం. ఈ వ్యవహారంలో 2022లోనే ప్రీమియర్ అగ్రిపుడ్స్ నిర్వాహకుల నుండి భారీ మొత్తంలో ముడుపులు అప్పన్న ఖాతాకు చేరాయనేది ప్రస్తుతం సంచలనంగా మారింది. ఇడి ఆ కోణంలో ప్రధానంగా ఆర్థికలావాదేవీలపైనే దృష్టి సారించి ఎవరెవరి ఖాతాల్లోకి నగదు లావాదేవీలు చేరాయనేది తేల్చేపనిలో నిమగ్నమవడంతో దోషుల గుండెల్లో రైళ్ళుపరిగెడుతున్నాయి. ఇంకా ఒక్కోరకంగా కొందరు తమ వాదనలు వినిపిస్తుండటంతో చివరగా ఇడి లెక్కలు తేల్చితే అసలు దోషులు ఎవరనేది గుట్టువీడనుందని టిటిడి వర్గాల్లో జోరుగా చర్చ మొదలైంది. తిరుమల లడ్డూల తయారీకి సంబంధించి నెయ్యిసరఫరాలో 2019 నుండి 2024 సంవత్సరం వరకు భారీగా కుట్రలు జరిగాయనేది ఇప్పటికే సిఐబి సిట్ అధికారులు తేల్చిన ఆధారాలు.అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఉత్తరప్రదేశ్ ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీ కంపెనీ నెయ్యిసరఫరా చేసేందుకు 2022లో కూడా సిద్ధమైందని, అయితే టిటిడికి నెయ్యి సరఫరాచేసే ఆ డైరీ నుండి కిలోకు 25రూపాయలు కమీషన్ ఇవ్వాలని చిన్నఅప్పన్న డిమాండ్ చేసినట్లు సిట్ నివేదికలు. అప్పట్లో ఈ వ్యవహారం బెడిసికొట్టడంతో ఆ డైరీపై అనర్హత వేటువేసేలా అరెస్టయిన జిఎంపై అప్పన్న ఒత్తిడి చేశాడనేది సిట్ కీలకంగా రాబట్టిన సమాచారం. ఆయన ఒత్తిడితోనే బోలేబాబా కాంట్రాక్ట్ రద్దయ్యి నెల్లూరుజిల్లాలోని ప్రీమియర్ అగ్రిపుడ్స్ యాజమాన్యం తెరపైకి వచ్చిందని సమాచారం. దీంతో కిలో నెయ్యి సరఫరాకు 138 రూపాయలు ఎక్కువగా టెండర్ దక్కించుకుని అప్పన్నకు 50లక్షలు రూపాయలు ముడుపులుగా ఇచ్చిందని సిట్ అధికారులు ఆధారాలతో తేల్చారు. 50లక్షలు ఆయన నుండి ఎవరికి చేరిందనేది ఇప్పుడు ఇడి తేల్చాల్సిన సంగతి. ఒక పథకం ప్రకారమే నెయ్యిసరఫరాలో కల్తీకూడా జరిగిందనేది సిట్ ఆధారాలు రాబట్టి నివేదిక అందించింది. టిటిడికి కల్తీనెయ్యి సరఫరా చేసిన పాపంలో 36మంది దోషుల్లో కొందరు పాత్రధారులను అరెస్ట్ చేసిన సిబిఐ సిట్ టిటిడి అధికారులవైపు కూడా నేరాన్ని పేర్కొంది. ఇడి తేల్చే గుట్టుతో సూత్రధారుల్ని వెల్లడించనుందనేది హాట్‌టాఫిక్‌గా ఉంది. 2024లో 10లక్షల కిలోల నెయ్యిసరషరాకు ఏఆర్ డైరీకి 2024 మే 15న ఆర్డర్ ఇచ్చామని, జూన్ 12,20, 25తేదీలతోబాటు జులై 6వతేదీ 4ట్యాంకర్ల కల్తీ నెయ్యి సరఫరా జరిగిందనేది గతంలోనే టిటిడి అధికారులు సిట్‌కు అందించిన సమాచారం. ఈ పాపంలో ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒఅపూర్వ వినయ్‌కాంత్‌చావ్డాలతో బాటు కొందరు ఉద్యోగులను అరెస్టుచేసిన విషయం విదితమే. కల్తీనెయ్యికి సహకరించిన సూత్రధారులను తేల్చాలని సిబిఐ ఆదేశించడంతో ఇడి రంగప్రవేశం చేసింది.

## ఎర్రచందనం ముద్దాయిలపై పిడి

**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవినుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వారిపై టాస్క్ ఫోర్స్ విభాగం ఉక్కుపాదం మోపుతోంది. ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ముద్దాయిలు కర్నాటక కు చెందిన సయ్యద్ ఫైరోజ్ అనేఫైరోజ్ ఎలియాస్ సయ్యద్ (38), చిత్తూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ అనే రాజా బాబు (33)లపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బారాయుడు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో అదనపు ఎస్పీ జె. కులశేఖర్ ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ ముద్దాయిలపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. పీడీ యాక్ట్ అమలుతో నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

# తిరుమల సమాచారం

## కల్పవృక్ష వాహనంపై కపిలేశ్వరుడు



**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న ప్రముఖ శైవాలయం తిరుపతి కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం కపిలేశ్వర స్వామి కల్పవృక్ష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు.స్వామివారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.అనంతరం అర్చకులు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షి అమ్మకి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.రాత్రి అశ్వవాహనంపై ఆదిదేవుడు ఊరేగారు.

## 'తిరుమలగిరి' రాయునకు శోభారాజు సంకీర్తనా సేవ



**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో అపరభక్తురాలు, గాయని పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు బృందం శనివారం సాయంత్రం శ్రీవారిని వేడుకుంటూ ఆలపించిన సంకీర్తనలు భక్తులను భక్తిభావంలో ఓలలాడించింది. రెండవశనివారం సాయంత్రం "సహస్ర దీపాలంకరణ" సేవా కార్యక్రమంలో డాక్టర్ శోభా రాజు బృందం వేంకటేశ్వర స్వామికి సంకీర్తనా కైంకర్యం చేశారు. తొలుతగా "అన్నమయ్య గాయత్రి" మంత్రంతో ప్రారంభించి "సర్వం విష్ణు మయంబను""తిరుమలగిరి రాయా" రెండు అన్నమయ్య కీర్తనలను ఆమె శిష్యులు వాసంతి, సాయి గాయిత్రి తేజస్విని కలిసి ఆలపించారు. కార్యక్రమానికి వాయిద్య సహకారం కీబోర్డ్ కళ్యాణ్, తబలా మంజూ అందించారు. అనంతరం ఆలయ పండితుల ఆశిర్వచనంతో డాక్టర్ శోభారాజుకి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి



**తిరుమల,పిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు సినీప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో సినీనటుడు నరేశ్, సతీమణి పవిత్ర కుటుంబం, నవాబ్ కేఫ్ చిత్రం బృందం నటుడు శివ కందుకూరి, నటి తేజు అశ్విని, దర్శ కుడు ప్రమోద్ హర్షతో కలిసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భవిష్యత్తుపై నమ్మకం పెంచిన బడ్జెట్

### రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి పార్థసారధి



**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** గత ప్రభుత్వం వారసత్వంగా వదిలిపెట్టిన రూ.10లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమిస్తూ అభివృద్ధి సంక్షేమం,రైతు భరోసాకు ప్రాధాన్యత ఇచ్చిన 2026-27బడ్జెట్‌ను స్వాగతించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ సారథ్యంలో ప్రతి సంవత్సరం ఆర్థిక పరిస్థితి మెరుగు పరచుకుంటూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా భవిషత్తుపై నమ్మకం కల్పిస్తుందని ఆయన తెలిపారు.
ఆర్థిక క్రమశిక్షణ విషయంలో గత వైసీపీ ప్రభుత్వ హాయాంలో 4.41శాతంగా ఉన్న రెవెన్యూ లోటు ఇప్పుడు 1.11శాతానికి తగ్గించడం,ద్రవ్యలోటు 3.84శాతానికి నియంత్రించడం రాష్ట్ర ఆర్థిక పురోగతికి స్పష్టమైన సూచికలని మంత్రి వివరించారు.మూల ధన్య వ్యయం విషయంలో గత ప్రభుత్వం రూ.27,000కోట్లు మాత్రమే ఖర్చు చేయగా,ఈ బడ్జెట్‌లో రూ.48,697కోట్లు ప్రతిపాదించడం రోడ్లు,నీటి పారుదల ప్రాజెక్టులు,పంచాయతీ రాజ్ మరియు ఆర్ అండ్ బి రోడ్లు నిర్మాణానికి పెద్ద ఊతమిస్తుందన్నారు.అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.57,868కోట్లు విలువైన పనులకు పరిపాలన అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు.గృహనిర్మాణ రంగానికి రూ.6,250కోట్లుకేటాయించడం ద్వారా ఇల్లులేని ప్రతి పేదవారికి ఇంటి స్థలంతో సహా ఇల్లు నిర్మించే ముఖ్యమంత్రి లక్ష్యం సాకారమవుతోందని మంత్రి పార్థసారధి వివరించారు.

## ప్రత్యర్థి రాజకీయ పక్షం విమర్శలను అదే రీతిలో తిప్పికొట్టండి : మంత్రి నారా లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** విపక్ష వైకాపా చేస్తున్న అడ్డగోలు విమర్శలపై ఇక ఆత్మరక్షణ ధోరణి వద్దని ఎదురు దాడి చేద్దామని మంత్రి నారా లోకేశ్ సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. శాసనసభలోని తెదేపా శాసనసభాపక్ష కార్యాలయంలో వారితో లోకేశ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. శాసనమండలిలో వైకాపా సభ్యుల వ్యవహారిశైలి, వారికి మంత్రులు దీటుగా బదులివ్వడాన్ని ప్రస్తావిస్తూ ఈసారి మంత్రుల టీమ్‌వర్క్ బాగుంది. ఇప్పటి వరకు విపక్షం మనపై విమర్శలు చేస్తుంటే డిఫెన్స్ ఆడుతూ వాటికి సమాధానమిస్తున్నాం. ఇకపై గేరుమార్చి మనమే అఫెన్స్ ఆడదాం అని సూచించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని వైకాపా ఎంత సర్వనాశనం చేసిందన్నది ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలన్నారు. ఇందులో మంత్రులు కీలకంగా వ్యవహరించాలన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. జిల్లాల్లో ఎక్కువ సమయం వెచ్చిస్తూ ఎమ్మెల్యేలు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచాలి అని పేర్కొన్నారు. ఈసారి పార్టీకి ఎక్కువ సమయం కేటాయిస్తున్నాను. ఎన్నిముఖ్యమైన పనులున్నా ఆ విషయంలో రాజీ పడటం లేదు. మంత్రులూ అదే రీతిలో పనిచేయాలి అని సూచించారు. యలమంచిలి నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ బ్లూజెట్‌కు ఈ నెల 28న శంకుస్థాపన చేస్తున్నట్లు లోకేశ్ చెప్పారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఒక వ్యక్తి ఆ సంస్థలో పనిచేస్తున్నారని, బ్లూజెట్ విస్తరణ ఆలోచనలో ఉందని ఆయన తనకు సందేశం పంపితే వెంటనే ఆ కంపెనీతో మాట్లాడి రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసేలా ఒప్పించామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన తెదేపా మద్దతుదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెలాఖరులోపు సమావేశమవుతారని తెలిపారు.




## హంస, శుకవాహనాలపై సోమస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబ

**(శ్రీకాళహస్తి ప్రభాతవార్త)** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామి అమ్మ వార్లను పురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. రోమాంచితమయ్యే వాయిద్యాల మోతతో ఉత్సవాలు సాగాయి. ఉదయం ఆలయంలోని అలంకార మండపం నుంచి స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేసి ఊరేగింపుకు పంపారు. ఆలయ చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఓ డిబాపిరెడ్డి మొదటి పూజలు జరిపి ఊరేగింపుకు సిద్ధం చేసారు. ముందు నందీశ్వరుడు సాగుతుండగా వెనుక ఎలుకవాహనంపై వినాయకుడు, నెమలి వాహనంపై వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి రాగా, హంసవాహనంపై సోమస్కంద మూర్తి, చిలుక వాహనంపై దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సారి ఉత్సవాలు ప్రత్యేక వాయిద్యాలతో ఆకట్టుకున్నాయి. అక్కడ నుంచి వాహనాల మండపంలోకి తెచ్చి వాహనాలపై ప్రతిష్టించి పట్టణంలోని తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, నగరివీధి, బజారువీధిల గుండా ఊరేగించారు. ఈ ఉత్సవాలతో ఉభయదారులు, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్స్ వెంకటస్వామి, ఆలయపర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, దఫేదార్లు రాజ హాజయ్యారు. ఉత్సవం పట్టణంలో సుమారు రెండు గంటల పాటు సాగింది. స్వామి అమ్మవార్లను చూడడానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో సమయపాలనతో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

# ఎపిని ప్రపంచ పర్యాటక కేంద్రంగా మార్చుతాం

### - మీడియా పాయింట్‌లో మంత్రి కందుల దుర్గేష్

### న- పర్యాటక, సాంస్కృతిక రంగాలకు రూ.439 కోట్లు కేటాయింపుపై హర్షం



**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని ఆ శాఖా మంత్రి కందుల దుర్గష్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రవేశపెట్టిన 202627 ఆర్థిక బడ్జెట్ రాష్ట్ర పురోగతికి బాటలు వేసేలా ఉందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. శనివారం మీడియా పాయింట్‌లో మాట్లాడిన ఆయన, పర్యాటక, సాంస్కృతిక రంగాలకు బడ్జెట్‌లో రూ. 439 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు, వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడుకు, టెక్నాలజీలో అద్భుతాలు సృష్టించిన మంత్రి నారాలోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇది సమగ్రమైన బడ్జెట్ అని రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చి పురోగమన దిశలో వెళ్తున్న బడ్జెట్ గా మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 202429 నూతన పర్యాటక పాలసీ రావడం, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పర్యా టక రంగ ప్రగతికి తాము గడిచిన ఏడాదిన్నర కాలంలో వివిధ రాష్ట్రాల్లో రోడ్ షోలు, రీజినల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లు నిర్వహించి 117 ఎంవో యూల ద్వారా రూ. 20,088 కోట్ల పెట్టుబడు లను ఆకర్షించామన్నారు. తద్వారా సుమారు 1,22, 637 ఉద్యోగ అవకా శాలకు మార్గం సుగమం అయ్యిందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6,681 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ బడ్జెట్ గడిచిన ఏడాదిన్న కాలంలో వస్తోన్న విప్లవాత్మక సంస్కరణలకు ఒక రూపం ఇచ్చే బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ల సహకారం అద్భుతంగా ఉందని.. ఇప్పటికే 8 ప్రాజెక్టులకు రూ. 428 కోట్ల కేంద్ర గ్రాంట్ లభించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని కేంద్ర ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. పర్యాటకాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఆర్థిక మంత్రి నిర్మల సీతారా మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం లో పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా విశాఖ పట్నం, అరకు, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతి ప్రాంతాల్లో 7 యాంకర్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. భక్తులు చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించేలా 25కు పైగా థీమాటిక్ సర్క్యూట్‌లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏపీని ఒక బ్రాండ్ గా మార్చేందుకు, ఇన్ బౌండ్ టూరిస్ట్ ల సంఖ్య పెంచాలన్న ఉద్దేశంతో విశాఖ ఉత్సవ్, అనకాపల్లి ఉత్సవ్, అరకు ఉత్సవ్, గండికోట ఉత్సవ్, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్ వంట ఏడాది పొడవునా నిర్వహిస్తున్నామన్నారు.

## శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఏడవ రోజైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిగాయి.అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేశారు. అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్ర హోమం, చండీహోమం, కార్యక్రమాలు శాస్త్రం ప్రకారంగా జరిపించారు. విధముగా ఈ సాయం కాలం ప్రదోష కాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నాడు రాత్రి శ్రీస్వామిఅమ్మవార్లకు గజవాహనసేవ జరిపించారు. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో గజవాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించిన స్వామి అమ్మవార్లను ఆలయం వెలుపలకు తోడుకొని వచ్చి గంగాధర మండపం నుంచి పురవీధుల్లో వైభవంగా ఊరేగింపు చేశారు.

## అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి

### - ఆర్‌పిఎఫ్ ఐజి అరోమా సింగ్ ఠాకూర్



**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** రైల్వేరక్షకదళం విభాగం విధుల నిర్వహణలో అప్రమత్తత పాటించడంతో పాటు అత్యవసర పరిస్థితులకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆర్‌పిఎఫ్ ఐజి అరోమా సింగ్ ఠాకూర్ సూచించారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని హితవు పలికారు.దక్షిణ మధ్యరైల్వే విభాగం తిరుపతిలోని ఆర్‌పిఎఫ్ బ్యారక్‌లను శనివారం ఆమె సందర్శించారు. ఆర్‌పిఎఫ్ అధికారులు, సిబ్బందితో భద్రతా సమ్మేళనం నిర్వహించారు. అనంతనం ఆమె సిబ్బంది సమస్యలను తెలుసుకుని, రైల్వే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సమ్మేళనం సందర్భంగా ఆమెకు ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ - 2026 లభించిన సందర్భంగా ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సిబ్బంది సేవాభావాన్ని ఆమె అభినందించారు.అనంతరం చైల్డ్‌లైన్ 1098, వన్ స్టాప్ సఖి సెంటర్, బచ్పన్ బచావో ఆందోళన్ ప్రతినిధులతో సమావేశమై, రన్ అవే ,మిస్సింగ్ పిల్లల రక్షణలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.సిబ్బంది సంక్షేమం కోసం డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి సహకారంతో కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. డ్రై క్యాంటీన్‌తో పాటు డాగ్ స్క్వాడ్ పనితీరును ఆమె పరిశీలించి, వాయు ,ప్రిన్స్ సేవలను ప్రశంసించారు. నేర నియంత్రణ కు జాతీయ డిజిటల్ పోర్టల్స్ వినియోగాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ గుంతకల్ ఆకాష్ కుమార్ జైస్వాల్, రేణిగుంట రాజగోపాల రెడ్డి, తిరుపతి సందీప్ కుమార్, ఎస్ఐ రాంబాబు , సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు ప్రతీ ఏటా రైతులను నట్టేట ముంచుతున్నా ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకునేందుకు చేపడుతున్న నిర్మాణాత్మక చర్యలు మృగ్యమయ్యాయి. వానకాలం సీజన్‌లో నకిలీ విత్తనాల బెడద రైతులను పట్టి పీడిస్తున్నది. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో నివారించలేని పరిస్థితి ఉంది. నగర శివారు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు తయారు చేస్తూపేరుమోసిన కంపెనీల బ్రాండ్ కవర్లలో వాటిని రైతులకు అంటగడుతున్నారు. పలు కంపెనీలకుచెందిన డీలర్లు నకిలీ విత్తనాలను గ్రామాల్లో ఎకువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారే తప్పా గ్రామాల వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. రైతులను నకిలీ విత్తన మోసాలనుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో విత్తన చట్టం తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ చట్టం అమలైతే రైతులకు నాణ్యమైన విత్తనం చట్టబద్ధహక్కుగా మారనుంది. నాణ్యమైన విత్తనం రైతులకు అందుబాటులోకివస్తే సాగులో నెలకొన్న సగం సమస్యలు దూరమైనట్టే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం తేబోతున్న కొత్త విత్తన చట్టం రైతులను ఏమేరకు ఆదుకుంటోందో వేచిచూడాలి. అదే సమయంలో రైతులకు సకాలంలో రైతు భరోసాపథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. మరోవైపు ఈ యాసంగి సీజన్‌లో మార్చి మూడో సీజన్‌లో ప్రారంభం కావాల్సిన అధిక ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి మొదటి వారంలోనే మొదలవడంతో యాసంగి పంటలకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. యాప్‌ల వినియోగంలో రైతులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను పరిష్కరించడంపై, వాటి వినియోగంపై తగినంత అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే యాసంగి సాగు రైతులకు లాభసాటిగా మారనుంది.

# యాప్‌లతో అన్నదాతలకు కష్టాలే!

**బోగిని మల్లికార్జున్**

ఇప్పటికే సవాళ్ల మధ్యన సాగును ముందుకు తీసుకెళ్తున్న అన్నదాతలకు కొత్తగా యాప్ కష్టాలు వెంటాడుతున్నాయి. యాప్‌ల వినియోగం అన్నదాతలకు సవాల్‌గా మారుతోంది. ఫలితంగా సాగులో రైతుల సమస్యలు రెట్టింపవుతున్నాయి. ప్రధానంగా పత్తి విక్రయాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిసాన్ కపాస్‌యాప్, రైతులకు సరిపడినంత యూరియాను సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ అన్నదాతల సమస్యలను తగ్గించాల్సింది పోయి మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. రైతులందరి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఇప్పటికీ మెజారిటీ రైతులు నిరక్ష్యరాస్యులు కావడం, ఒకవేళ స్మార్ట్‌ఫోన్ ఉన్నా యాప్‌ల వినియోగంపై అవగాహన లేకపోవడం కర్షకులకు శాపంగా మారుతోంది. మరికొందరికి పట్టాదారు పాస్‌బుక్‌కు మొబైల్ నంబర్ లింక్ చేసుకోకపోవడంతో యాప్‌ల ద్వారా పంటలను అమ్ముకోవాలన్నా, ఎరువులు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కిసాన్‌కపాస్ యాప్‌తో పత్తి విక్రయాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నట్టుగానే యూరియా కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌తో రైతుల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. యూరియా యాప్‌లో రైతు పాస్‌బుక్, ఫోన్ నంబర్ నమోదు చేసుకున్న తర్వాత చాలా షాపుల్లో జీరో స్టాకే దర్శనమిస్తుండడంతో రైతులు తీవ్రఆందోళనలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న వరి సాగును ఖరీఫ్ మాదిరిగానే యాసంగిలోనూ యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. యూరియా కోసం రైతులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయితే ఈ యాసంగిలో అన్నదాతలకు యూరియా కష్టాలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా పంపిణీని చేపట్టింది. ఇందుకు ప్రత్యేకంగా ఫర్టిలైజర్స్ బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను అందుబూటులోకి తీసుకొచ్చినప్పటికీ అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ సాగులో ఎక్కువగా పాతతరం రైతులే ఉండడంతో వారి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవు. ఫలితంగా యాప్‌లో యూరియా బుక్ చేయడం అసాధ్యంగా మారింది. దీంతో యాసంగిలోనూ వరి పంటకు అదనులో యూరియా అందించడం కష్టసాధ్యంగా మారింది. పాత పద్ధతిలోనే యూరియా ఇవ్వాలంటూ పలు జిల్లాల్లో అన్నదాతలు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. యాప్‌లో కొన్నిషాపుల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని చూపిస్తుండడంతో రైతులు ఆ షాపును ఎంచుకుంటున్నారు. తీరా అక్కడికి వెళితే స్టాక్



లేదని, యాప్‌లో లోపాలవల్ల తప్పుడుగా చూపిస్తుందని షాప్ యజమానులు చెబుతుండడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుతిరుగుతున్నారు. డీలర్లు స్టాక్‌ఎంత ఉందో యాప్‌లో అప్‌డేట్ చేయకపోవడంతో ఈసమస్య తలెత్తుతుందని వ్యవసాయ అధికారులను చేతులు దులుపుకుంటుండడంతో రైతుల సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. యూరియా కోసం యాప్‌లో నమోదు చేసుకోవాలని నిబంధన పెట్టడంతో చదువురాని రైతులు, పేదరైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా యాప్ కోసం అప్పు చేసి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్‌లో జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు. యూరియాలోటు, యాప్ బుకింగ్ సిస్టమ్‌తో విసిగిపోయిన రైతులు గోదాం నుంచి నేరుగా జాతీయ రహదారిపైకి వచ్చి రాస్తారోకోకు దిగారు. ఇలా యాప్ విధానంతో చదువురాని, ఆండ్రాయిడ్ ఫోన్లులేని, ఆపరేటింగ్ రాని రైతులు అరిగోస పడుతున్నారు. వరి పైర్లు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా అందక పంట దిగుబడి కోల్పోయే పరిస్థితి నెలకొంది. కరీంనగర్ జిల్లా మాదిరిగానే యాసంగిలో ఇతర జిల్లాల రైతులూ యూరియా కోసంఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో యాప్ ద్వారా యూరియా పంపిణీని నిలిపివేసి సరిపడా యూరియా బస్తాలు అందుబాటులో ఉంచి, పాతపద్ధతిలో సరఫరా చేయాలని డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ 2025-26 ఖరీఫ్‌లో రైతులు పడ్డయూరియా కష్టాలు అన్నీఇన్నీ కావు. రాత్రింబవళ్లు యూరియా కోసం అన్నదాతలు పడిగాపులుగాశారు. నిద్రాహారాలు మాని ఇంటిల్లిపాది అందరూ క్యూలైన్లలో పడిగాపులుగాసినా పంటకు సరిపడినంత యూరియా దొరక్క అవస్థలుపడ్డారు. ఒకటి, రెండుచోట్ల యూరియా కోసం పడిగాపులు గాసే క్రమంలో అన్నదాతలుతీవ్ర అస్వస్థతకు గురై క్యూలైన్లలోనే కుప్పకూలిపోయిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. వరి, పత్తి పంటకు సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో ఆశించినస్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారు. సాధారణంగా వరికి ఎకరాకు మూడు బస్తాల యూరియాను చల్లాలి. కానీ ఖరీఫ్ ఆసాంతం ఒక్కో రైతుకు కనీసం రెండు బస్తాల యూరియా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. దొరికినా ఆ యూరియా కూడా అదను దాటిపోయాక చేతికందడం, పంటకు చల్లడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఇక వరి తర్వాత పత్తి సాగు చేసిన రైతులు ఈఏడాది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పెట్టిన నూతన నిబంధనలతో తీవ్రంగా నష్టపోయారు. తేమ 8 శాతానికి మించకూడదని, కిసాన్ కపాస్ యాప్ ద్వారా బుక్ చేసుకుంటేనే సదరు రైతు పత్తిని కొనుగోలు చేస్తామని, అది కూడా ఎకరాకు 7క్వింటాళ్లు మాత్రమేనని కొత్త కొత్త కొర్రీలు పెట్టడంతో అన్నదాతలు అనివార్య పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన వచ్చింది. ఎకరానికి అనుమతించే పత్తి దిగుబడిని 12 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈనిర్ణయం రైతులపాలిట అశనిపాతంలా మారింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 8111ను మద్దతు ధరగా నిర్ణయించగా తెలంగాణ రైతులు క్వింటాల్‌కు రూ. 6వేలకే అమ్మాల్సి వచ్చింది. మరి 2026-27 ఖరీఫ్ సీజన్‌లోనైనా సీసీఐ రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా పత్తి కొనుగోళ్లను చేపడుతుందా? అన్నది ప్రశ్నార్థకంగానే మారింది. విత్తనం విత్తే సమయం నుండి పంట కోత కోసి మార్కెట్‌కు తరలించే వరకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. సాగు గిట్టుబాటు కాకపోవడంతో వ్యవసాయం చేసే వారి సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోందని వ్యవసాయరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రైతు కుటుంబాల్లో తర్వాతి తరం వారు వ్యవసాయానికి దూరంకావాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మరింత ప్రోత్సహించే విధానాలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో సాగు సంక్షోభం తలెత్తే ప్రమాదం పొంచిఉంది. వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులు ప్రభుత్వరంగ సంస్థల నుంచి సకాలంలో అందడం లేదు. పరిశ్రమలకు కావాల్సిన ప్రోత్సాహకాలు, సబ్సీడీలు అందిస్తున్న ప్రభుత్వాలు అదే సాగు విషయానికి వచ్చే సరికి పంటలకు కావాల్సిన ఆర్థిక వనరులు, సాంకేతిక సాయాన్ని రైతులకు అందుబాటులోఉంచడం లేదు. దీంతో యువత వ్యవసాయానికి దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాల నుంచి పంట గిట్టుబాటు ధరకుహామీ లేకపోవడం, నూతన సాంకేతిక సాగు పద్ధతులను పరిచయం చేయకపోవడంతో నేటి తరం యువత వ్యవసాయానికి క్రమక్రమంగా దూరమవుతోంది. పండించిన పంటలకు గిట్టుబాటుధర రాకపోవడంతో సాగుకుతెచ్చిన అప్పులు తీర్చలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈనేపథ్యంలో రైతులకు మద్దతు ధర, గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ●

మహారాష్ట్ర

# 'మహా' వ్యూహం!

**ఎ.వి.వి ప్రసాద్**

కొన్ని అనుకోని సంఘటనలు అనేక అనూహ్య పరిణామాలకు దారితీస్తుంటాయి. రాజకీయ సమీకరణలు కూడా మారిపోతూంటాయి. మహారాష్ట్రలో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం అదే. డిప్యూటీ సిఎంగా ఉన్న అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత ఆయన ఎన్సీపీ గ్రూపులో సంభవిస్తున్న పరిణామాలు మహారాష్ట్ర భవిష్యత్ రాజకీయ చిత్రానికి ఒక సంకేతమనే చెప్పాలి. మూడు సంవత్సరాల క్రితం అజిత్ ఎన్సీపి బిజెపి నాయకత్వంలోని 'మహాయుతి'లో చేరినా ఆయన బిజెపిలో 'స్థానికేతరుడు' స్థానంలోనే కనిపించారు. శరద్ పవార్‌ను రాజకీయంగా బలహీనపరచాలనే ఏకైక లక్ష్యంతో అజిత్ ఎన్సీపీకి బిజెపి 'ఆశ్రయం' కల్పించిందనే అప్పట్లో చెప్పుకొన్నారు. శరద్ ఎన్సీపీని మహారాష్ట్రలో లేకుండా చేయాలనే ప్రయత్నాలు చాలా జరిగాయి. ఎన్సిపీలో చీలిక రావడానికి కారణం ఎవరైనా, అజిత్ గ్రూపు మహాయుతిలోకి రావడానికి ప్రధాన కారణం ఫడ్నవీస్ అనే చెప్పాలి. అయితే అజిత్ ఎన్సీపీకి తొలుత లభించిన ప్రాధాన్యం తరువాత కొంత తగ్గినట్లు కనిపించింది. ఆ సమయంలోనే అజిత్ తిరిగి తన బాబాయ్ శరద్‌పవార్ వైపు జరగడం మొదలు పెట్టారు. జనవరిలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ పరిణామం స్పష్టంగా కనిపించింది. ఒక మరాఠా నేత పార్టీలో ఉంటేనే ఆ వర్గం ఓట్లు తేలికగా లభిస్తాయనే ఆశతో బిజెపిఅప్పట్లో అజిత్‌కు మహాయుతిలో చోటిచ్చింది. అప్పటికే అజిత్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉండడంతో ఆయన బిజెపి కూటమిలోకి రావడం ప్రధానికి ఇష్టంలేదనీ, అయినా ఫడ్నవీస్ ఒత్తిడితో అంగీకరించారనీ అనుకొన్నారు. శివసేనలో చీలిక తెచ్చి మహాయుతిలోకి వచ్చిన ఏక్‌నాథ్ షిండేపై కూడా బిజెపికి తగినంత 'నమ్మకం' లేదనే చెప్పాలి. మహారాష్ట్రలో అత్యంత శక్తిమంతుడైన నేతగా శరద్‌పవార్‌కు ఉన్న పేరు పలుచబడడానికి అటు బిజెపి ఎంత కారణమో, ఇటు అజిత్ కూడా అంతే కారణం. బిజెపితో సాన్నిహిత్యం పెరిగిన తరువాత శరద్‌ను బలహీ నపరిచే ప్రయత్నం చేసిన అజిత్ తర్వాత పొర బాటును తెలుసుకొన్నారో ఏమో! తిరిగి శరద్ తో పొత్తుకు ప్రయత్నించారు షిండే శివసేనలోకి, అజిత్ తిరిగి ఎన్సీపీలోకి వెళ్తే అధికార కూటమి బలహీనపడుతుందిగనుక, ఆ ప్రమాదం రాకుండా ఫడ్నవీస్ చక్రం తిప్పారు. అజిత్ మరణానికిముందు విలీనయత్నాలుఒకందుకు జరిగితే, అదే ఇప్పుడు మరొకందుకు జరుగుతున్నాయి. అజిత్, శరద్ ఎన్సీపీలు కొద్ది రోజుల్లో విలీనం కాబోతున్నాయనే వార్తలు వ్యాపిస్తున్న సమ యంలో అజిత్‌హఠాత్తుగా విమాన ప్రమాదంలో మరణించారు. ఆ ఘటన నిజంగానే ఫడ్నవీస్‌కు చెమటలు పట్టించింది. శరద్ కంటే ముందే చక్రం తిప్పారు. వ్యూహ నిపుణుడైన ఫడ్నవీస్ తక్షణమే రంగంలోకి దిగి చకచకా పావులు కదిపారు. సంతాప దినాలు కూడా ముగియకుండానే, రెండో రోజునే అజిత్ సతీమణి సునేత్రతో చర్చలు జరిపి డిప్యూటీ సీఎం పదవి స్వీకరించడానికి ఒప్పించారు. ఈ పరిణామం శరద్ పవార్‌కు, ఆయన కుమార్తె సుప్రియా సూలేకు తెలియకుండానే జరిగిపో యింది. సునేత్ర పదవీ స్వీకారం రోజున కొందరు మీడియా ప్రతినిధులు శరద్‌పవార్‌ను ఆ విషయంపై ప్రశ్నిస్తే 'నాకేం తెలీదు, వారిష్టం వారిది' అన్నట్లు మాట్లాడారు. ఆతర్వాత మనశ్శాంతి లేకనో, ఇతర అనారోగ్య కారణాల వల్లనో శరద్ పవార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అజిత్ ఉన్నప్పుడు ఒక కారణంతో విలీనమవ్వా లనుకొంటే, అదే విలీనాన్ని జరిపించి తనకు అను కూలంగా మలచుకోవాలనిఫడ్నవీస్ ఇప్పుడు భావిస్తున్నారు. విలీనం జరగకూడదనే ఉద్దేశం తోనే సునేత్రకు వెంటనే పదవి ఇచ్చి, ఎన్సీపీ మంత్రులను మార్చకుండా కొనసాగిస్తున్నారు. కానీ గత రెండుమూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే



ఫడ్నవీస్

విలీనాన్ని ఫడ్నవీస్ ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తుంది. శరద పవార్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో, ఆయన వర్గం ఎన్సీపీని కూడా అజిత్ వర్గంలో విలీనం చేస్తే మొత్తం ఎన్సీపీ తమ అధీనంలోకి వస్తుందన్నది బిజెపి వ్యూహంగా కనిపిస్తోంది. 2024ఎన్నికల్లో అజిత్ ఎన్సీపీకి 9శాతం ఓట్లురాగా, శరద్ వర్గాని కి 11శాతం ఓట్లువచ్చాయి. అయితే సీట్లుమాత్రం అజిత్‌కే ఎక్కువ. ఆయన ఎన్సీపీకి 41 సీట్లు రాగా, శరద్‌వర్గానికి 10సీట్లు మాత్రమేవచ్చాయి. అంటే రెండు గ్రూపులు కలిస్తే దాదాపు 20 శాతం ఓట్లు, 50 పైగా సీట్లు తమ'కంట్రోల్ ' లోకి వస్తాయన్నది బిజెపి ఆలోచన. అందుకే కాబోలు సుప్రియా సూలేతో ఫడ్నవీస్ దూతలు గతవారం రెండు దఫాలుగా చర్చలు జరిపారనీ, ఈ విలీన యత్నాలకు సునేత్ర కూడా సుముఖంగానే ఉన్నారనీ అంటున్నారు. అజిత్ పెద్ద కుమారుడైన పార్థ్‌ను కూడా ఫడ్నవీస్ ఇప్పటికే ఒప్పించినట్లు తెలుస్తోంది. సునేత్ర, పార్థ్ గతవారం అమిత్ షాతో జరిపిన భేటీలో ఈ విషయాలే ప్రధానంగా చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. శరద్ పవార్ కంటే ఇప్పుడు సూలే ముఖ్యం గనుక ఆమెను కూడా విలీనానికి ఒప్పించినట్లుగా తెలుస్తోంది. విలీనం జరగగానే ఎన్సీపీకి కేంద్రంలో రెండు మంత్రి పదవులు లభించగలవనీ, ప్రఫుల్ పటేల్, సుప్రియకు కేంద్ర కేబినెట్ పదవులు లభిస్తాయనీ అంటున్నారు. అలాగే శరద్ వర్గం నుంచి మహారాష్ట్ర కేబినెట్‌లోకి కూడా ఇద్దరికి చోటు లభించగలదని తెలుస్తోంది. 35శాతం ఉన్న మరాఠా ఓటుబ్యాంకు తమవైపు ఉండాలంటే ఇదేమార్గమని బిజెపి అధిష్ఠానం భావిస్తోంది. కాంగ్రెస్ గాని, శివసేన గాని తిరిగి తలెత్తకుండా ఉండాలంటే ఇదొక్కటే సరైన చర్యగా బిజెపి భావిస్తున్నదనీ, అందుకే ఎన్సీపీ వర్గాల విలీనానికి ఫడ్నవీస్ స్వయంగా నడుం కట్టారనీ చెబుతున్నారు. ఒకప్పుడు ఎన్సీపీలో చీలికకు కారణమైన బిజెపి ఇప్పుడు ఆ రెండు వర్గాల విలీనానికి పావులు కదుపుతున్నదంటే రాజకీయ వ్యూహాలు ఎంత విచిత్రమో! అనిపిస్తుంది. ●

బంగ్లాదేశ్

# డార్క్ ప్రిన్స్‌కే పట్టం!

**గన్ని మోహన్**

ప్రపంచదేశాలన్నింటా అత్యంత ఉత్కంఠ భరితంగా చర్చలు సాగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో మొత్తం రూపురేఖలు మారాయి. అంచనాలకు ఏమాత్రం భిన్నం కాకుండా దివంగత ప్రధాని ఖలీదాజియా కుమారుడు తారిక్ అన్వర్ నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ విజయఢంకా మోగించింది. మొత్తం 299స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 209 స్థానాలు గెలిచిన బిఎన్పీతోపాటు పాక్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న జమాత్ ఇ ఇస్లామీకి 68స్థానాలు లభించాయి. ఇక హసీనాను గద్దెదించేందుకు ఉద్యమం నడిపి పోరుబాటకు శ్రీకారం చుట్టిన నేషనల్ సిటిజన్ పార్టీ ఎన్సీపీ కేవలం ఆరుస్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీని ప్రజలు ఎంతమాత్రం విశ్వసించకపోవడానికి ముస్లిం మూలాలతో పాకిస్థాన్‌లో సన్నిహిత సంబంధాలు నెరపిన జమాతే పార్టీతో పొత్తులతో పోటీకి దిగడమే ఆపార్టీకి శాపంగా మారిందని చెప్పాలి. బంగ్లాదేశ్ చరిత్రలో 35 ఏళ్ల తర్వాత తొలిసారి ఒక పురుష నాయకుడు ప్రధాని పదవిని అధిష్టిస్తున్నారు. అదికూడా దివంగత ప్రధాని ఖలీదా జియా కుమారుడు కావడం విశేషం. 2001లో మాత్రమే అధికారంలోకి వచ్చిన బిఎన్‌పి 2006 తర్వాత ఏర్పడిన రాజకీయపరిణామాలు, తిరుగుబాట్లతో నలిగిపోయింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అవామీలీగ్ ప్రభుత్వమే పాలనచేపట్టింది. సుమారు 17 ఏళ్లపాటు ప్రవాసంలో గడిపిన తారిక్ రెహమాన్ ఎట్టకేలకు తనచిరకాలస్వప్నం నెరవేర్చుకున్నారు. అయితే భారత్‌పై ఆయన అనుసరించే వైఖరిపైనే ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీస్తోంది. తారిక్ పార్టీ ఎన్నికైన వెంటనే భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఆయనకు స్వయంగా ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల పరస్పర సహకారంతో ముందుకు పోవాలని ఆకాంక్షిస్తున్నట్లు కూడా చెప్పారు. మహ్మద్ యూనస్ కేర్‌టేకర్‌గా పగ్గాలు చేపట్టినప్పటినుంచి భారత్‌పట్ల బంగ్లాదేశ్‌లో వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. విముక్తి పోరాటంలో బంగ్లాను వెన్నంటినడిచి యుద్ధంచేసి ప్రత్యేక దేశంగా ఆవిర్భవించేందుకు సహకరించిన భారత్‌ను యూనస్ సర్కారు ఇప్పుడు గడ్డిపోచతో సమానం అన్నట్లుగా చూస్తోంది. అంతేకాకుండా శత్రుదేశమైన పాక్‌తో సాన్నిహిత్యానికి తహతహలాడింది. ఈవిపత్కర పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లోని హిందూమైనార్టీలో అల్లాడిపోయారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం గడుపుతున్నారు. అయినా కూడా 11మందివరకూ మతముష్కరుల చేతుల్లో బలైపోయారు. ఈపరిస్థితుల్లో బంగ్లాదేశ్ ప్రధాని కాబోతున్న బిఎన్పీనేత తారిక్ వైఖరి, ఆయన అనుసరించే విదేశాంగ విధానాలపైనే ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది. పరస్పరం గౌరవించుకునే విధానాన్నే తాము గౌరవిస్తామని భారత్‌తో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని, పరస్పర అవగాహన ముఖ్యమని తారిక్ వ్యాఖ్యలు చేసారు. షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించినందువల్ల భారత్‌ను విభేదిస్తారా అన్న ప్రశ్నలపై స్పందించిన తారిక్ అది భారత్‌పైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల్లో బిఎన్పీ విజయం ప్రజాస్వామ్య విజయం అని అభివర్ణించిన కాబోయే ప్రధాని ప్రజాస్వామ్యంకోసం ప్రాణత్యాగం చేసిన అందరికీ ఈ విజయం అంకితం చేస్తున్నానంటూ ప్రకటించి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించారు. హసీనాకాలంలో ఎంతో సాన్నిహిత్యంతో మెలిగిన భారత్‌తో తారిక్ ఇప్పుడు తన పార్టీ తరపున ప్రభుత్వం సన్నిహిత బాంధవ్యం కోరుకుంటారా అన్నది సందేహాస్పదమే. 2024 ఆగస్టు నుంచి మరింతగా సంబంధాలు క్షీణించడానికి గలకారణం మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం అనుసరించిన విధానాలేనని చెప్పాలి. చైనాకు దగ్గరయ్యేందుకు తహతహలాడిపోవడం, ఈశాన్య రాష్ట్రాలపై అసంబంధ వ్యాఖ్యలు చేయడం, చైనాకు సానుకూలమైన మాటలతో దగ్గరయ్యేందుకు ప్రయత్నించడం వంటివి జరిగాయి. ఈ తరుణంలో భారత్‌కూడా ఎంత మాత్రం తీసిపోకుండా భారత్ సార్వభౌమత్వంపై కుట్రలు, దాడులు చేస్తే చూస్తూ కూర్చోదని గుణపాఠం ముందెన్నడూ చవిచూడనంత స్థాయిలో ఉంటుందని కూడా హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఇలా ఉంటే తాజాగాజరిగిన ఎన్నికల్లో ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించిన బిఎన్పీకి గతంలో నియంతపాలన చేసిందన్న మచ్చకూడా లేకపోలేదు. డార్క్‌ప్రిన్స్‌గా తారిక్‌ను పిలిచిన ఆకాలంలో బిఎన్పీ, జమాతే ఇస్లామితో కలిసి సంకీర్ణ ప్రభుత్వం నడిపారు. హవాభబన్ అనే రెండంతస్తుల భవనం నుంచే ఆనాడు యువరాజుగా రహమాన్ సమాంతర పాలన కూడా నిర్వహించారు. ఒకవిధంగా ఈ భవనాన్ని షాడో పిఎంఒ అని పిలిచేవారు. అటు తర్వాత 2008లోజరిగిన ఎన్నికల్లో తిరిగి ఆవామిలీగ్ రావడం ఆపై రెండేళ్ల క్రితంనుంచి రాజుకున్న ఉద్యమంలో హసీనా గద్దెదిగి భారత్‌లో ఆశ్రయం పొందుతుండటం జరిగిపోయాయి. యూనస్ కాలంలోనే తారిక్‌పై నమోదైన అన్ని కేసులను రద్దుచేసి ఆయనకు శిక్షలనుంచి మినహాయింపు ఇవ్వడంతో లండన్ నుంచి తిరిగొచ్చిన తారిక్ తనదైన శైలిని ప్రదర్శించారు. పార్టీలో అంచలంచెలుగానే ఎదిగిన తారిక్ పార్టీచీఫ్‌గా ఎంపికయినప్పటి నుంచి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే పనిచేసి విజయవంతం అయ్యారు. పార్టీల విజయాలు మారుతుంటాయి. ప్రభుత్వాలు మారుతుంటాయి, పాలకులు సైతం మారుతూనే ఉంటారు. మార్పుకోరే ప్రజలు విచక్షణతో వారిని ఎన్నుకుంటే ఎలాంటి గండాలు ఉండబోవు. కానీ ఇపుడు ఒకప్పుడు డార్క్ ప్రిన్స్‌గా వ్యవహరించిన తారిఖ్ మళ్లీ జమాతే ఇస్లామితో దోస్తీ కడతారా? లేక ఏకైక అతిపెద్ద పార్టీగానే అవతరించి బంగ్లాను శాసించగలుగుతారా అన్నది కాలమే నిర్ణయించాలి. అయితే డార్క్‌ప్రిన్స్ మచ్చ తొలగించుకోడానికి పగ్గాలు చేపట్టిన మరుసటి రోజునుంచే శ్రమించాలి. లేకుండా మళ్లీ లండన్ జీవితాన్ని తారిక్ గుర్తుకు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ●



తారిక్ రెహమాన్

# మెడికల్ మాఫియా మోసాలకు అడ్డుకట్ట వేయలేరా?

**పిల్లా తిరుపతిరావు**

అనాదిగా భారతదేశంలో ఆయుర్వేద వైద్యం ఉంది. అలనాటి వైద్యులు మొక్కలు, మూలికలు, ఖనిజాలు, జంతు ఉత్పత్తుల చూర్ణాలతో ఔషధాలు తయారుచేసి, వివిధ రోగాలను నయం చేసేవారు. ఇది సాంప్రదాయవైద్య చికిత్సా విధానం. ఐతే ఈ వైద్యవిధానాన్ని ఎందరో మహనీయులు వర్గబేధాలకు అతీతంగా సేవయే పరమార్థంగా భావిస్తూ, ఉచితంగానే ప్రజలకు అందించారు. విశ్వంలో అప్పుడప్పుడు అనేక విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి. ఈ అనూహ్య వాతావరణ మార్పుల ఫలితంగానే మానవ జీవన పరిణామ క్రమంలో అనేక మొండిరోగాలు ప్రబలినాయి. వీటికి విరుగుడు దొరకని పక్షంలో ఆధునిక వైద్యం ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఇదే అల్లోపతీ వైద్యం. ఇది మానవుని ఆయుః ప్రమాణాన్ని పెంచింది. ఈ అల్లోపతీ ఔషధాల తయారీలో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిది. వారు తమ ఆస్తులను, జీవితాలను, చివరికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలూ పరిశోధనలు జరిపారు. తద్వారా సమాజ సంక్షేమం కాంక్షించి ఎన్నో ఇంగ్లీష్ మందులను లోకం ముందుంచారు. ఈ క్రమంలోనే అనేక మొండిరోగాలను నిరోధించే యాంటీబయాటిక్స్ వెలుగు చూశాయి. 1928లో అలెగ్జాండర్ ప్లెమింగ్ పెన్సిలిన్ మందును కనుక్కున్నారు. ఇది వైద్యరంగంలో విప్లవాత్మకమైన సందర్భం. ఇది మానవ జీవన గమనాన్నే మార్చివేసింది. అంతవరకు అనేక ప్రాణాంతక రోగాలతో సతమతమవుతున్న మానవుని ఉనికికి గొప్ప భరోసానిచ్చింది. సాంప్రదాయ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య విధానాలకు భిన్నమైనది అల్లోపతీ వైద్యం. పూర్తిగా శాస్త్రీయమైనది. రోగనిర్ధారణ, చికిత్సలలో ప్రామాణికత ఉంటుంది. ఐతే ఈ వైద్యంలో సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఎక్కువే. రోగి ఇళ్లూ, ఒళ్లూ రెండూ గుల్లైపోతాయి. కాకపోతే తక్షణం ఉపశమనాన్నిచ్చే అద్భుతమైన వైద్యమిది. కాబట్టి జనం ఈ రకమైన చికిత్సకే మొగ్గుచూపుతారు. భౌగోళికంగా విభిన్న శీతోష్ణస్థితులు కలిగిన భారత దేశంలో ప్రజల జీవన విధానాలు వేరువేరుగా ఉంటాయి. వివిధ ప్రాంతాల వారీగా నివసిస్తున్న ప్రజల ఆహారవిహారాదులలో అనేక వైవిధ్యాలు చోటుచేసుకుంటాయి. అందువల్ల ఇక్కడ జనం రకరకాల రోగాలతో బాధపడడం చూస్తాం. ఇంకా ఇక్కడి ప్రజల్లో హెచ్చుశాతం పేద, మధ్యతరగతి వర్గాల వారే ఉన్నారు. వీరి ఆర్థిక పరిస్థితిని బట్టిచూస్తే శుభ్రమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సమతుల్య ఆహారం లభించడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న జనం పౌష్టికాహార లోపంతో ఉండడం సహజమే. ఈ లేమితనమే అనేక వ్యాధుల సంక్రమణకు మరొక కారణం. ఆర్థిక వెనుకబాటుతో ఉన్న నేటి సమాజంలో దేశీయ అల్లోపతీ వైద్యవిధానం జనాన్ని మరింత బెంబేలెత్తిస్తున్నది. గ్రామస్థాయి వైద్యుల నుంచి కార్పొరేట్ స్థాయి వైద్యుల వరకు ప్రజల్ని మోసగిస్తున్నారు. వైద్యవిధానమే ఏకంగా వ్యాపారాత్మకమైంది. లాభం పేరిట కాసులను ఏరుకోవడమే ప్రథమ కర్తవ్యమైంది. ఒకప్పటి సేవాదృక్పథం నేడు కొరవడింది. వైద్యులు, ఆసుపత్రి నిర్వాహకులు, మందులు తయారీ కంపెనీలు, మందుల అమ్మకందారులు, మెడికల్ సామాగ్రి తయారీదారులు, రోగ నిర్ధారిత పరీక్షా కేంద్రాల నిర్వాహకులు మెడికల్ మాఫియాగా తయారై ప్రజల్ని పీడించుకు తింటున్నారు. ఐతే ప్రభుత్వాలు దారిద్ర్యరేఖ దిగువనున్న ప్రజలకు పలు వ్యాధుల చికిత్సకై ఉచిత ఆరోగ్యసేవలను అందిస్తున్నాయి. ఐనప్పటికీ పరువుప్రతిష్టల అంశంగా భావిస్తూ, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పి టల్స్‌లోనే ప్రజలు వైద్యం చేయించుకుంటున్నారు. కార్పొ రేట్ హాస్పిటల్స్ నిర్వహణ ఉన్నతంగా ఉంటుంది. శుభ్రతా ప్రమాణాలు పాటిస్తారు. అందువల్లనే కార్పొరేట్ హాస్పిటల్ పట్ల ప్రజల ఆసక్తి చూపుతారు. ఐతే దీన్ని బలహీనతగా చూసి ఆయా యాజమాన్యాలు రోగులనుండి హెచ్చుమొత్తం లో డబ్బులు గుంజేస్తున్నారు. దోచుకున్నోడికి దోచుకున్నం త అన్న చందంగా తయారైంది ప్రైవేటుకార్పొరేట్ వైద్య లోకం. ఈ రంగం హాస్పిటల్లో డాక్టర్ ఫీజుతో పాటు, రోగ నిర్ధారణ పరీక్షల ఖర్చు, మందుల అమ్మకపు ధరలు అధి కంగా




ఉంటాయి. డాక్టర్ రాసే మందులను రోగులు కొనేట ప్పుడు మందుల షాపులవారు నాసిరకం మందులను కొన్ని అంటగడుతుంటారు. వీరికి ఈరకం మందుల్లో వచ్చేమార్జిన్ ఎక్కువ. ఉదా: పావలా ధర గల మందును రూపాయి ధరకు అమ్ముతారు. పైగా హాస్పిటల్ మందుల షాపుల్లో మందులు కొనుగోలుకు ఎటువంటి రాయితీ ఇవ్వరు. ఇవే మందులు బయట మందుల షాపులో కొంటే ఎంతో కొంత శాతం తగ్గింపు ఉంటుంది. ఇంకా రోగనిర్ధారణ పరీక్షల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నిర్ధారణ పరీక్షల్లో నిర్దిష్ట ప్రమాణాలు పాటించరు. ప్రామాణికమైన వస్తుసామగ్రిని వినియోగించరు. వివిధ స్కోపీలు, అల్ట్రాసౌండ్, సిటీ, ఎం.ఆర్.ఐ స్కాన్ పరీక్షలకు పెట్టే ఖర్చు అంతేలేకుండా పోతున్నది. మోసానికి ఒడిగట్టడంలో మెడికల్ మాఫియాకి మించినది లేదు. డాక్టర్స్ అయితే అవసరమున్నా, లేకపోయినా ఎక్కువ వ్యాధి నిర్ధారిత పరీక్షలు రాయడం రివాజయ్యింది. హిస్ట్రాక్టమీ ఆపరేషన్ అవసరం లేకపోయినా చేస్తుండడం చూస్తున్నాం. ఐతే ఈరకమైన చర్యలన్నింటిలోనూ డాక్టర్స్‌కు రావలసిన కమిషన్లు వచ్చిపడతాయి.

అలాగని అందరు డాక్టర్లనీ ఒక గాటన కట్టలేం. 'వైద్యో నారా యణో హరి'అని అంటాం. వైద్యులు ప్రాణదాతలు. సేవా దృక్పథంతో పనిచేసేవారు లేకపోలేదు. ఐతే వీరిలో అతి కొద్దిమంది మాత్రమే పేదారోదా అనే భావనతో వైద్యం చేయడంచూస్తాం. గతంలో ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ వ్యాధి విజృంభించింది. అది కోట్ల మంది ప్రజలను బలితీసు కుంది. ఆ సమయంలో వైద్యులు ప్రాణాలుపణంగా పెట్టి విధులు నిర్వర్తించారు. వారి త్యాగం మరువలేనిది. ఐతే దీన్ని అదనుగా చేసుకొని కార్పొరేట్లు కోట్లకు పడగలెత్తారు. ఆసుపత్రుల నిర్వహణ, మందులు సామగ్రి తయారీ, అమ్మకపు రంగాలలో ఇష్టానుసారంగా ధరలు పెంచి డబ్బులు దోచేశారు. ఉదా: రెండు రూపాయలకు తయారయ్యే మాస్క్‌లకు ఐదారురెట్లు రేట్లు పెంచేశారు. ఇదేపరిస్థితి శానిటైజర్లు, మందుల అమ్మకాలలో కూడా ఉంది. హాస్పిటల్స్‌లో బెడ్స్, ఆక్సిజన్ సిలిండర్స్, కాన్సెంట్రేటర్స్‌కు కృత్రిమ కొరత సృష్టించి విపరీతంగా సొమ్ము చేసుకున్నారు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిఘా పెంచాలి. సక్రమంగా నిర్వహించని ఆసుపత్రుల అనుమతులు రద్దుచేయాలి. నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్న యాజమాన్యాలను శిక్షించాలి. తద్వారా కార్పొరేట్ వైద్యరంగాన్ని ప్రక్షాళన చేయాలి. నేడు ప్రభుత్వ వైద్యమంటే చులకన భావంతో చూసే ప్రజలున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ బాగానేఉంది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఆసుపత్రులలో అధునాతన వైద్య సదుపాయాలున్నాయి. అక్కడ క్రిటికల్ కేర్ ఆపరేషన్స్, ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్స్ జరుగుతున్నాయి. ఐతే గ్రామస్థాయి ప్రభుత్వ వైద్యం ఈ స్థాయిలోనైతే లేదు. ఇది మరింత సమర్థవంతంగా అందాల్సివుంది. క్షేత్రస్థాయిలో వైద్య నిపుణులు కొరతుంది. దీనికి కారణం లేకపోలేదు. వైద్యవిద్య చదివినవారు ప్రభుత్వ వైద్యునిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వ వైద్యునిగా ఉద్యోగాలు చేసేవారికి మరిన్ని ఆర్థికపరమైన సౌలభ్యాలు కల్పించి వృత్తి పట్ల ఆకర్షణ పెంచాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. నర్సెస్ హెల్త్ స్టాప్ భర్తీని చాలినంత చేయాలి. అప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ మరింత బలోపేతమోతుంది. డాక్టర్ పేషెంట్ రేషియో సగటున 1:1000 ఉండాలంటారు. 2025 నాటికి భారతదేశంలో ప్రభుత్వప్రైవేటు వైద్యసేవలలో కలిపి చూస్తే డాక్టర్ పేషెంట్ రేషియో సగటున 1:811 ఉంది. ఈనిష్పత్తి గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉండదు. ఈనిష్పత్తి ప్రాప్తికి ప్రభుత్వ వైద్యమైతే అందదు. ఇండియాలో 2025 నాటికి ప్రభుత్వప్రైవేటు వైద్య సేవలను కలిపి చూస్తే ప్రతి1000మందికి 1.3బెడ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్యరంగం అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేదు. అన్నిప్రాంతాలకు ఒకేలా అందటం లేదు. కొండమీద ఉన్న గిరిజనానికి ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాల్లేవు. రహదారులు లేని గ్రామాలు ఇప్పటికీ ఉన్నాయి. వారు డోలీలు కట్టుకొని కొండ దిగాల్సిన పరిస్థితి ఉంది. వారిని పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అంతేకాదు కార్పొరేట్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం కూడా ఉంది. ●

# మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.15వేల కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** నాలుగు రాష్ట్రాల్లోని 12 జిల్లాలను కవర్‌చేసేవిధంగా కేంద్ర కేబినెట్ రైల్వే మల్టీట్రాకింగ్‌ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 389 కిలోమీటర్ల నిడివి కలిగిన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు అమలుకు తెస్తోంది. ప్రధాని నరేంద్రమోడి అధ్యక్షతన రిగిన ఈ కేబినెట్ భేటీలో మొత్తం ఈప్రాజెక్టు వ్యయం 18,509 కోట్లుగాను పూర్తి ప్రాజెక్టును 2030-31కల్లా పూర్తిచేయాల్సి ఉంటుందని అంచనావేసారు. 265 లక్షల పనిదినాలను కల్పిస్తాయని, ప్రయాణ సౌలభ్యం, రవాణా వ్యయం, ముడిచమురు భారం తగ్గింపు, కర్బన ఉద్గారాలు తక్కువస్థాయిలోనే ఉండటం సుస్థిర, మరింత మెరుగైన రైల్వే కార్యకలాపాలకు ఈప్రాజెక్టు దోహదంచేస్తుందన్నారు. అదేవిధంగా కేబినెట్ ట్విన్‌ట్యూబ్ టిబిఎంరోడ్డును సముద్రగర్భంలోని టన్నెల్‌లో రెండులేన్ల రోడ్డుకు అనుమతులిలిచ్చింది. బ్రహ్మపుత్ర నదీ వెంబడి రైల్వే మౌలికవనరులను పెంచుతామని

## నాలుగు రాష్ట్రాలలో అమలు

### డీప్‌టెక్, టెక్నాలజీ ఆధారిత ఉత్పత్తిరంగ స్టార్టప్‌ల కోసం రూ.10వేల కోట్లతో కార్పస్

### ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అనుమతులు

అస్సాంలో మొత్తం 33.7 కిలోమీటర్లమేర ఈ ట్విన్‌ట్యూబ్ టిబిఎం రోడ్డుప్రాజెక్టుకు అనుమతి మంజూరుచేస్తున్నట్లుప్రకటించింది. ఇందుకోసం మొత్తం రూ.18,662 కోట్ల వ్యయం అవుతుం దని, అస్సాంఇంజినీరింగ్ నిర్మాణ సంస్థ ఇపిసి పద్ధతిలో నిర్మాణంపూర్తిచేస్తుంది. అదేవి ధంగా గుడెబెల్లూరు నుంచి మహబూబ్‌నగర్‌కు నాలుగులేన్ల రహదారిప్రాజెక్టును చేపడుతోంది. 80.01 కిలోమీటర్ల నిడివికలిగినీప్రాజెక్టు వ్యయం రూ.3175.08 కోట్లు అవుతుందని అంచనావేసారు. హైదరాబాద్ పనాజీ ఆర్థిక నడవాలో ఈ రహదారి నిర్మాణం ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల 14.4లక్షల పనిదినాలు కార్మికులకు లభిస్తాయని, 17.9 లక్షల పరోక్ష ఉపాధి కూడా ఉంటుందని కేంద్రం చెపుతోంది. అలాగే ధమాసియా బిటాడా మోవి నర్సపోర్ మాలోథా సెక్షన్లను కూడా అభివృద్ధిచేస్తోంది. నేషనల్ హైవే 56 పరిధిలోని ఈప్రాంతాల్లో నాలుగులేన్ల ప్రమాణాలతో మొత్తం రూ.4583.64 కోట్లు వ్యయంచేసయనున్నది. అలాగే కేబినెట్ ఘోతి ట్రింబర్ జావ్‌హార్; మానోర్ పాల్ఘర్ ఎక్షన్లను కూడా అభివృద్ధిచేసేందుకు ఆమోదించింది. మొత్తం 154.635 కిలోమీటర్ల నిడివిని రూ.3320.38 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు కేంద్రకేబినెట్ సమావేశంలో చర్చించారు. ముంబయినుంచి పూణెవరకూ ఈ ప్రాజెక్టునడుస్తుంది. అలాగే స్టార్టప్ ఇండియా ఫండ్‌ఆఫ్ ఫండ్స్ 2.0కింద వెంచర్‌క్యానిటల్ సమీకరణకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. భారత్ స్టార్టప్ ఎకోసి స్టమ్‌ను పరిరక్షించుకోవాలని, రూ.10వేలకోట్ల డీప్‌టెక్, టెక్నాలజీ ఆధారిత ఉత్పత్తిరంగ స్టార్టప్‌లు, సత్వరమే వృద్ధిచెందుతున్న స్టార్టప్ లకు ఈ నిధులసాయం అందుతుంది. ఇందు కోసం రూ.10వేల కోట్ల కార్పస్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు కేంద్రకేబినెట్ ఆమోదం తెలిపింది. ఈప్రాజెక్టుల్లో భాగంగానే అసోంలో ఉన్న ప్రధాని వివిధ అభివృద్ధిపనులను ప్రారంభించారు.

## ఖప్రి బైపాస్‌పై రోడ్డుప్రమాదం: నలుగురు కోబ్రా కమాండోలు దుర్మరణం



**ఛత్తీస్‌గఢ్, ఫిబ్రవరి 14:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 201వ కోబ్రా బెటాలియన్‌కు చెందిన నలుగురు కమాండోలు ప్రాణాలు కోల్పోయారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ధమ్తరి జిల్లాలోని ఖప్రి బైపాస్‌పై శనివారం ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అర్జుని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కమాండోలు జగదల్‌పూర్ నుంచి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం ట్రక్కు కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, గ్యాస్ కట్టర్ల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో కమాండోను ధమ్తరి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి´ఎక్స్ వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కూలిపడిన నిర్మాణంలోని మెట్రో పిల్లర్

## ఒకరు మృతి, నలుగురికి గాయాలు



**ముంబయి, ఫిబ్రవరి 14:** మహారాష్ట్ర రాజధాని ముంబై నగరంలో దారుణం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఒక మెట్రో పిల్లర్ కూలింది. ఈ ఘనటలో ఒకరు మరణించగా, నలుగురు గాయపడ్డట్లు ప్రాథమిక సమాచారం. స్థానిక ములుండ్ ప్రాంతంలోని, ఎల్బీఎస్ రోడ్, జాన్సన్ అండ్ జాన్సన్ ఫ్యాక్టరీ వద్ద నిర్మాణంలో ఉన్న మెట్రో పిల్లర్ శనివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో కూలిపోయింది. కూలిన మెట్రో పిల్లర్ రోడ్డుపై వెళ్తున్న ఒక ఆటో రిక్షా, ఒక కారుపై పడింది. దీంతో ఈ వాహనాల్లోని ఒకరు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ముంబై మెట్రోపాలిటన్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఎంఆర్డీయే) అధికారులు, బీఎంసీ అధికారులు, మెట్రో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గాయపడ్డవారికి పూర్తిస్థాయి వైద్య సహాయం అందిస్తామని అధికారులు ప్రకటించారు.

## బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజేతలుగా ముగ్గురు హిందూ ఎంపిలు



**ఢాకా, ఫిబ్రవరి 14:** బంగ్లాదేశ్ పార్లమెంటుకు జరి గిన సార్వత్రిక ఎన్నికల్లో ఆరుగురు హిందూమైనార్టీలు పోటీచేస్తే వారిలో నలుగురు గెలిచారు. వారిలో ముగ్గురు హిందువులు గెలిచారు. దీంతో ఆ పార్టీ మైనార్టీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లైంది. బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో హిందువులకు ప్రాతినిధ్యం దక్కింది. 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ, మిత్ర పక్షాలతో కలిసి 209 సీట్లలో విజయం సాధించింది. తారిఖ్ రహమాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుంది. బీఎన్‌పీ తరఫున ఢాకా3 స్థానం నుంచి హిందువు, సీనియర్ లీడర్ అయిన గయేశ్వర్ చంద్ర రాయ్ విజయం సాధించారు. ఆయనకు 99,163 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, జమాత్ పార్టీ అభ్యర్థి ఎండీ షాహినూర్ ఇస్లాంకు 83,264 ఓట్లు వచ్చాయి. ఈయన గతంలో బీఎన్‌పీ తరఫున కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. మరో హిందువు, బీఎన్‌పీ వైస్ ఛైర్మన్ నితాయ్ రాయ్ చౌదురి మగుర2 స్థానం నుంచి భారీ మెజారిటీతో గెలిచారు. ఆయనకు 147,896 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, జమాత్ పార్టీ అభ్యర్థి ముస్తాహిద్ బిల్లాకు 117,018 ఓట్లు వచ్చాయి. రంగమతి అనే మరో స్థానం నుంచి అడ్వకేట్ అయిన దీపెన్ దేవాన్ అనే హిందూ అభ్యర్థి 31,222 ఓట్లతో గెలుపొందారు. ఆయన తన సమీప ఇండిపెండెంట్ అభ్యర్థి పహేల్ చక్మాపై గెలిచారు. చక్మాకు 21,544 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇలా గయేశ్వర్ చంద్ర రాయ్, నితాయ్ రాయ్ చౌదురి, దీపెన్ దేవాన్ అనే ముగ్గురు హిందువులు బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఈ ముగ్గురూ బీఎన్‌పీ నుంచే గెలవడం విశేషం. ఇక ప్రతిపక్షానికే పరిమితమైన జమాతే ఇస్లామీ పార్టీ మొత్తం సీట్లలో ఒకే హిందువును అభ్యర్థిగా నిలిపింది. క్రిష్ణ నంది అనే హిందువు ఖుల్నా1 స్థానం నుంచి పోటీ చేయగా, బీఎన్‌పీ అభ్యర్థి అమీర్ ఎజాజ్ ఖాన్ చేతిలో ఓడిపోయారు. బంగ్లా ఎన్నికల్లో వివిధ పార్టీలు, స్వతంత్రులు మొత్తం కలిపి 79 మంది పోటీ చేశారు.

## మోడీ విదేశీ టూర్ల ఖర్చు రూ.762కోట్లు

### లోక్‌సభలో వెల్లడించిన విదేశాంగశాఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ప్రధాని నరేంద్ర మోదీ గత పదేళ్లలో అంటే 2015 నుంచి 2025 వరకు ప్రధాని మోదీ విదేశీ టూర్ల కోసం సుమారు 762 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. కేంద్ర విదేశాంగ శాఖ ఈ విషయాన్ని శుక్రవారం లోక్‌సభలో వెల్లడించింది. దీనిపై ఆ శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ప్రధాని విదేశీ టూర్లకు అయిన ఖర్చు వివరాలను ఆ సమాధానంలో చెప్పింది. ప్రధాని మోదీతో పాటు వెళ్లిన ప్రతినిధుల సమాచారాన్ని కూడా రిలీజ్ చేసింది. ప్రతి ఏడాది విదేశీ ట్రిప్‌లకు అయిన ఖర్చులో తేడా కనిపించింది. 2020లో కోవిడ్ వల్ల ఆంక్షల కారణంగా ప్రధాని మోదీ ఎక్కువగా విదేశీ టూర్లకు వెళ్లలేదు. కానీ 2021 నుంచి మళ్లీ విదేశీ పర్యటనలకు అయ్యే ఖర్చు పెరుగుతూ పోయింది. 2024 నుంచి సగటున ఏడాది ఖర్చు వందకోట్లు దాటింది. 2025లో సుమారు 175 కోట్లు విదేశీ పర్యటనలకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. యూరోప్, అమెరికా, ఆఫ్రికా, ఈస్ట్ ఆసియా లాంటి ప్రదేశాలకు వెళ్లడం వల్ల ప్రధాని ట్రిప్ ఖర్చులుపెరిగాయి. విదేశీ పర్యటనల సమయంలో ప్రధానిని ఆదేశం ఓ అతిథిగా ఆహ్వానిస్తుంది. ఆదేశమే ఆతిథ్యం ఖర్చులు భరిస్తుంది. అయితేభారతీయ ప్రతినిధులకు, భద్రతా ఏర్పాట్లకు, మీడియా బృందానికి, లాజిస్టిక్ సపోర్టు ఖర్చులన్నీ ఇండియానే భరించాల్సి ఉంటుంది.

## రాహుల్‌తో రైతు సంఘాల నేతల భేటీ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 14:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పలు రైతు సంఘాల నేతలను కలిశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రైతు నేతలతో భేటీ అయ్యారు. భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలపై చర్చించారు. ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖ్‌పాల్ ఎస్ ఖైరా, హర్యానాకు చెందిన భారతీయ కిసాన్ మజ్దోర్ యూనియన్ నేత అశోక్ బల్హారా, బీకేయూ క్రాంతికారి నేత బల్దేవ్ ఎస్ జిరా, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఫ్రంట్‌కు చెందిన ఆర్ నందకుమార్ తదితరులు రాహుల్ గాంధీని కలిసిన వారిలో ఉన్నారు. భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలపై రైతు సంఘాల నేతలతో రాహుల్ గాంధీ చర్చించారు. మరోవైపు రైతు సంఘాల నేతలతో రాహుల్ గాంధీ సమావేశంపై బీజేపీ స్పందించింది. ఇది కల్పిత,కృతిమ భేటీఅని విమర్శించింది.


రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమని, భారత రైతు లను తప్పుదారి పట్టించే ప్రయత్నమని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఆరోపించారు.

## ఉరిశిక్షపడిన ముగ్గురు నేతలు ఎంపిలుగా విజయం



**ఢాకా, ఫిబ్రవరి 14:** బంగ్లాదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఎన్నికల్లో ఒకప్పుడు ఉరిశిక్ష పడి, ఆ తర్వాత నిర్దోషులుగా విడుదలైన ముగ్గురు వివాదాస్పద నేతలు ఎంపీలుగా గెలవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. బీఎన్‌పీకి చెందిన లుత్ఫుజ్జమాన్ బాబర్, అబ్దుస్ సలాం పింటూ, జమాత్‌ఎ ఇస్లామీ నేత ఏటీఎం అజహరుల్ ఇస్లాం తాజాగా జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీలతో గెలుపొందారు. 2004లో అప్పటి ప్రధాని షేక్ హసీనా లక్ష్యంగా జరిగిన గ్రెనేడ్ దాడి కేసులో బాబర్, పింటూలకు మరణశిక్ష పడగా, 1971 విమోచన యుద్ధ సమయంలో 1200 మంది బంగ్లాదేశీయుల మరణాలకు కారణమయ్యాడన్న ఆరోపణలు ఎదుర్కొన్న అజహరుల్ ఇస్లాంకు కూడా ఉరిశిక్ష విధించారు. అయితే, 2024 ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం ప్రజాందోళనలతో కూలిపోయిన తర్వాత నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాత జరిగిన న్యాయ ప్రక్రియలో హైకోర్టు, సుప్రీం కోర్టులు వేర్వేరు కేసుల్లో వీరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పులిచ్చాయి.

## వైద్యవిద్యలో సీటుకోసం తానే వాదనలు వినిపించి గెలిచిన విద్యార్థి



**జబల్‌పూర్, ఫిబ్రవరి 14:** వైద్య విద్యలో ప్రవేశం కోసం రెండుసార్లు నీట్ పరీక్షలో అర్హత సాధించినా, ప్రభుత్వ విధానపరమైన లోపం కారణంగా సీటు కోల్పోయిన ఓ విద్యార్థి దేశ అత్యున్నత న్యాయస్థానంలో స్వయంగా వాదనలు వినిపించి చారిత్రాత్మక విజయం సాధించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అథర్వ చతుర్వేది పోరాటానికి స్పందించిన సుప్రీంకోర్టు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి అతనికి ప్రొవిజనల్ ఎంబీబీఎస్ అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించింది. జబల్‌పూర్‌కు చెందిన అథర్వ చతుర్వేది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యుఎస్) కోటా కింద రెండుసార్లు నీట్‌లో మంచి మార్కులు సాధించాడు. అయితే, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకపోవడంతో అతడికి అడ్మిషన్ లభించలేదు. దీనిపై తొలుత హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో, సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్సెల్పీ) దాఖలు చేశాడు. మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు అథర్వ ఆన్‌లైన్‌లో తన వాదనలను స్వయంగా వినిపించాడు. రాష్ట్ర ప్రభుత్వ విధాన లోపం వల్ల అర్హత ఉన్న విద్యార్థికి అన్యాయం జరగకూడదని స్పష్టం చేసిన ధర్మాసనం కేవలం 10 నిమిషాల్లోనే అతడికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ప్రైవేట్ కాలేజీలు రిజర్వేషన్ విధానాన్ని పాటించకపోతే, వాటికి తాళాలు వేయండి అని ఈ సందర్భంగా సీజేఐ ఘాటుగా వ్యాఖ్యానించారు. వారం రోజుల్లోగా 2025-26 విద్యా సంవత్సరానికి అథర్వకు ప్రొవిజనల్ అడ్మిషన్ కల్పించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి), మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అయితే, ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఫీజుల నిర్మాణంపై ఇంకా స్పష్టత లేకపోవడంతో, అథర్వ కుటుంబానికి ఆర్థికపరమైన ఆందోళనలు కొనసాగుతున్నాయి.

## దేశంలోని తొలి హైవే ఎమర్జెన్సీ ల్యాండింగ్ సౌకర్యం



**గువాహతి, ఫిబ్రవరి 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం అసోం పర్యటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దిబ్రుగఢ్‌లోని దేశంలో మొట్టమొదటి హైవే ఎమర్జెన్సీ ల్యాం డింగ్ ఫెసిలిటీ (ఇఎల్‌ఎఫ్)ను ప్రధాని మోడీ ప్రారంభించారు. వైమానికదళ సైనిక రవాణా విమానం (సి-130జె సూపర్ హెర్క్యులస్)ను సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఎగువ అసోంలోని ఒక హైవే స్ట్రిప్‌లో నిర్మించిన ఈ సౌకర్యం, అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లకు ప్రత్యా మ్నాయ ల్యాండింగ్ సైట్‌గా రక్షణ శాఖ ఉపయోగించనుంది. ఈ అత్యవసర ల్యాండింగ్ సౌకర్యం ఈశాన్య భారతదేశం రక్షణ, వ్యూహాత్మక సంసిద్ధలతో ఒక ముఖ్యమైన దశగా పరిగణిస్తున్నారు. అత్యవసర ల్యాండింగ్ సౌకర్యం అనేది సాధారణంగా వాహనాలకు సేవలందించే హైవే స్ట్రిప్. కానీ అవసరమైతే విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కోసం రన్‌వేగా మార్చవచ్చు. దిబ్రూగఢ్ ఇఎల్‌ఎఫ్ ఎగువ అసోంలోఉంది. ఇది భారతదేశం-చైనా సరిహద్దుకు చాలా దగ్గరగా ఉంటుంది. చైనాతో ఉన్న ఎల్‌ఎసి కేవలం 240కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ నేపథ్యంలోనే మోరన్‌లో అత్యవసర ల్యాండింగ్‌సౌకర్యం (ఇఎల్‌ఎఫ్)ను, రూ. 5,500 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులను ప్రధాని మోడీ ప్రారంభించారు. దాబువా ఎయిర్‌ఫీల్డ్‌లో ప్రధానికి అసోంగవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్వాగతం పలికారు.



## 'డార్క్‌ప్రిన్స్' తారిఖ్ రెహమాన్‌కే బంగ్లా పగ్గాలు

**ఢాకా, ఫిబ్రవరి 14:** ఒకప్పుడు విమర్శకుల చేత 'డార్క్ ప్రిన్స్'గా మాటలు పడిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) నేత తారిఖ్ రెహమాన్ ఇప్పుడు బంగ్లా పగ్గాలు చేపట్టబోతున్నారు. మరి ఆయన గెలుపు భారత్‌కు లాభమేనా? బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహమాన్, మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడే తారిఖ్. 2001-2006 మధ్య అధికారంలో ఉన్న సమయంలో రెహమాన్ కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలోనే ఆయనపై అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో అమెరికా సహా బంగ్లా విపక్షాలు ఆయన్ను 'డార్క్‌ప్రిన్స్'గా అభివర్ణించాయి. హసీనా అధికారంలోకి వచ్చిన తర్వాత రెహమాన్ ఓ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత అనారోగ్యానికి గురై చికిత్స కోసం 2008లో లండన్ వెళ్లారు. గతేడాది డిసెంబరులో తల్లి ఖాలిదా అనారోగ్యానికి గురవడంతో 17 యేళ్ల తర్వాత మళ్లీ సొంతగడ్డపై అడుగుపెట్టారు. తల్లి మరణానంతరం పార్టీ పగ్గాలు అందుకున్నారు. తాజా ఎన్నికల్లో ఘన విజయాన్ని దక్కిం చుకున్నారు.

**సానుకూలమే కానీ..**

ఇటీవల కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. హసీనా గద్దె దిగడం, మైనారిటీలైన హిందువులపై బంగ్లాదేశ్‌లో దాడులు ఇరు దేశాల బంధాన్ని ఊగిసలాటలో పడేశాయి.

రెండు దేశాల మధ్య గత 18 నెలలుగా ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ పరిణామాల వేళ ఎన్నికల్లో రెహమాన్ విజయం కీలకంగా మారింది. గతంలో రెహమాన్ తల్లి ఖాలిదా హయాంలో భారత్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇప్పుడు రెహమాన్ నేతృత్వంలో పరిస్థితి మునుపటిలా ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తామని, తీస్తా నదీ జలాల సమస్యను పరిష్కరించకుంటామని, హిందూ మైనారిటీలకు రక్షణ కల్పిస్తామని ఎన్నికల ముందు ఆయన హామీ ఇచ్చారు. కాబట్టి దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారత్‌తో రెహవాన్ దౌత్య సంబంధాలు నెరిపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## త్వరలో ఇరాన్ పాలనలో మార్పులు: ట్రంప్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 14:** అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో యుఎస్ సైన్యం ఇప్పటికే ఇరాన్‌ను చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై సైనిక చర్య అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఆ దేశంలోని పాలనలో మార్పు జరగడం వల్లే అక్కడి పరిస్థితులు చక్కదిద్దుకుంటాయని అదే ఉత్తమమైన విషయమని అభిప్రాయపడ్డారు. త్వరలోనే అది కూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. 47 యేళ్లుగా చర్చల పేరుతో వారు మాట్లాడుతూనే ఉన్నారని ఈలోగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ అన్నారు. ఇకపై ఈ విషయంలో ఆలస్యం చేయదలచుకోలేదని పేర్కొన్నారు. అయితే నూతన పాలకులను ఇరాన్ ప్రజలే ఎన్నుకుంటారన్నారు. అణు ఒప్పందంపై ప్రస్తుతం ఇరాన్‌తో జరుగు తోన్న చర్చలు విజయవంతమవుతాయని తాను భావిస్తున్నానని కానీ అవి విఫలమైన రోజు ఇరాన్ చరిత్రలో ఓ చెడు రోజుగా నిలిచిపో తుందని ట్రంప్ పేర్కొన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యా హుకు సూచించినట్లు తెలిపారు. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమానవాహక నౌకలను ఇరాన్ వైపు తరలివస్తున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనని పశ్చిమాసియా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**ఆందోళనలు కొనసాగించండి : యువరాజు రెజా పహ్లావి:** ఇరాన్‌లో నిరసనలు మరింత తీవ్రం చేయాలని ప్రవాసంలో తలదాచుకున్న ఆ దేశ యువరాజు రెజా పహ్లావి ప్రజలకు పిలుపునిచ్చారు. నిరసనకారులపై ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అణచివేత చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలన్నారు. ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలు అండగా ఉంటాయని పేర్కొన్నారు.

## సంక్షిప్తంగా..

### సరిహద్దుల్లో హెరాయిన్ జారవిడిచిన పాక్ డ్రోన్లు



**కథువా, ఫిబ్రవరి 14:** భారత్‌పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఆర్‌ఎస్ పురా సెక్టార్ ప్రాంతంలో రూ.40 కోట్లకు పైగా విలువైన 6.5 కిలోల హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అనుమానిస్తున్నారు. రాత్రివేళల్లో అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు స్థానికులు వారికి తెలిపారు. దీంతో పోలీసులు బీఎస్‌ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్ద ఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

### ఐటి కొలువులకు ముప్పు తెస్తున్న కృత్రిమమేధ


**ముంబయి, ఫిబ్రవరి 14:** భారత ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను మార్పులకు కారణమవుతోంది. ఒకవైపు ఉత్పాదకత పెంచడానికి కంపెనీలు ఏఐని వేగంగా అమలు చేస్తుంటే, మరోవైపు సంప్రదాయ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ ఏడాది ఏఐ ఆటోమేషన్ కారణంగా 10,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని తాజా అంచనాలు హెచ్చరిస్తున్నాయి. ఏఐ టూల్స్ వాడకంపై నైపుణ్యం పెంచుకోవాలని, లేదంటే పోటీలో వెనుకబడిపోతారని గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగులకు స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి. పనితీరు సమీక్షల్లో కూడా ఏఐ వినియోగాన్ని ఒక కొలమానంగా పరిగణిస్తున్నట్టుతెలుస్తోంది. ఏఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుండటంతో, తక్కువ మంది సిబ్బందితో ఎక్కువ పని చేయగలుగుతున్నామని కంపెనీలు భావిస్తున్నాయి.

### సమస్తిపూర్‌లో పకడ్వా వివాహ్ సంచలనం



**సమస్తిపూర్; ఫిబ్రవరి 14:** బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో పకడ్వా వివాహ్ (వరుడిని కిడ్నాప్ చేసి చేసే పెళ్లి) మరోసారి కలకలం రేపింది. పోలీసు ఉద్యోగానికి సిద్ధమవుతున్న నితీశ్ కుమార్ (22) అనే యువకుడిని అపహరించి, మత్తు మందు ఇచ్చి బలవంతంగా పెళ్లి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. బాధితుడు రహస్యంగా తీసిన వీడియో వైరల్ కావడంతో, పోలీసులు అతడిని రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పటోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జోడి పోఖర్ గ్రామ నివాసి అయిన నితీశ్ కుమార్, ఫిబ్రవరి 7న లైబ్రరీకి వెళ్తుండగా కిడ్నాప్‌కు గురయ్యాడు. అనంతరం అతడికి మత్తు మందు ఇచ్చి, మొర్వా గ్రామంలోని ఓ ఆలయంలో లక్ష్మీ కుమారి అనే యువతితో బలవంతంగా పెళ్లి జరిపించారు. బందీగా ఉన్న సమయంలో నితీశ్ తీసిన వీడియో అతడి కుటుంబ సభ్యులకు చేరడంతో, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### అమెరికాలో కర్ణాటక విద్యార్థి అదృశ్యం



**బెంగళూరు, ఫిబ్రవరి 14:** అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మరో భారతీయ విద్యార్థి అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. కాలిఫోర్నియాలోని ప్రతిష్ఠాత్మక బర్కిలీ విశ్వవిద్యాలయంలో (యూసీ బర్కిలీ) చదువుతున్న సాకేత్ శ్రీనివాసయ్య (22) అనే విద్యార్థి కనిపించకుండా పోయాడు. కర్ణాటకకు చెందిన సాకేత్, ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని స్థానిక అధికారులు తెలిపారు. ఐఐటీమద్రాస్‌లో బీటెక్ పూర్తి చేసిన సాకేత్, ప్రస్తుతం యూసీ బర్కిలీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నాడు. బర్కిలీ పోలీసులు అతడిని మిస్సింగ్ పర్సన్‌గా ప్రకటించి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. స్థానిక అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఒక ప్రకటనలో తెలిపింది.

### ఖలిస్తానీ వేర్పాటువాది పన్నున్ హత్యకు కుట్ర నిజమే

**మన్‌హాట్టన్, ఫిబ్రవరి 14:** అమెరికాలో ఖలిస్థానీ వేర్పాటువాది గుర్ పత్వంత్ సింగ్ పన్నూన్ హత్యకు కుట్ర పన్నిన కేసులో ప్రధాన నిందితుడు, భారత జాతీయుడైన నిఖిల్ గుప్తా (54) తన నేరాన్ని అంగీకరించాడు. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టులో జరిగిన విచారణలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పన్నూన్‌ను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా లక్ష డాలర్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. 15,000 డాలర్లు అడ్వాన్స్‌గా కూడా చెల్లించాడు. గుప్తా సంప్రదించిన వ్యక్తి అమెరికా అధికారులకు సమాచారం అందించే వ్యక్తి కాగా, హంతకుడిగా నటించింది ఓ అండర్ కవర్ ఏజెంట్ కావడంతో ఈ కుట్ర భగ్నమైంది.

# టిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నీలాద్రిలైన్స్ విజయం



**తిరుమల,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగు తరాలు ఒకచోట కలిసి అందరూ కలుద్దాం...తీపిజ్ఞాపకాలను పంచుకుంటాం అనే సంకల్పంతో తిరుమల స్థానికులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నీలాద్రిలైన్స్ జట్టు విజయం సాధించింది. తిరుపతిలోని తుమ్మలగుంట మైదానంలో మూడురోజులు జరిగిన ఈ పోటీల్లో 14జట్లు పాల్గొన్నాయి. శనివారం మధ్యాహ్నం తిరుమల ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీల ముగింపులో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పాల్గొని విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్గనైజర్ టీమ్‌కు ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నీలాద్రిలైన్స్ టీమ్‌ను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఇలాంటి ఆటవిడుపు తిరుమల వాసుల్లో మరింత ఐక్యతను చాటుతుందన్నారు. మొదటి విజేతకు 25వేల రూపాయలు, రెండవవిజేతకు 10వేలు అందజేశారు. తిరుమలకు చెందిన జెఆర్‌ఫ్యాన్సీ అధినేత రవితేజ విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, కెఎం చంద్ర, ఆవుల బాలసుబ్రమణ్యం, రాజు యాదవ్ పాల్గొన్నారు.

# నేడు శివరాత్రి - భక్తుల కైవల్యానికి మార్గం

**(శ్రీకాళహస్తి ప్రభాతవార్త)** భారతదేశంలోని శైవారామాలు భక్తితో శివ..శివా అంటూ ముక్తిని, మోక్షాన్ని, కైవల్యాన్ని కోరుకొనే శివరాత్రి. దక్షిణభారతదేశంలోని పంచ భూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. కైలాసనాథుడు విభూధీశుడు అంటారు. అయితే శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుడు కోటీశ్వరుడు. ఆది దేవుని రాజసాన్ని నంది వాహనంపై తిలకించి భక్త కోటి పులకించిపోయే పర్వదినం. నాగాలను తలపాగాలుగా చుట్టి శరీరం నుండి నాగాలను ఆభరణాలుగా అలంకరించుకొని కైలాసనాథుడు శ్రీకాళహస్తీశ్వరాలయంలో కన్ను జిగేలు మనే తిరుఆభరణాల్ని ధరించి భక్తులకు దర్శనమిచ్చే పర్వదినం. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు ఆలయంలో మహాశివరాత్రి జన జాగరణకు సర్వం సిద్ధం చేశారు. భక్తజనవల్లభుడు శివుడు నంది వాహనంపై దేవేరి జ్ఞానప్రసూనాంబ దేవి సింహవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చే పర్వదినం కోసం ఎదురు చూశారు. ఆదివారం మహాశివరాత్రి పర్వదినం శివయ్య దర్శనానికి విచ్చేసే భక్తులకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. గతం కన్నా ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరగవచుననే అంచనాలతో అధికారులు ఏర్పాట్లు చేశారు. సామాన్య భక్తులకు సైతం సుదర్శన భాగ్యం కల్పించేందుకు మహాలఘుదర్శనాన్ని ఖరారు చేశారు. సాధారణంగా ఈ ఆలయంలో విఐపిలకు అర్ధమండప దర్శనం అనుమతించేవారు.కానీ రద్దీ దృష్ట్యాఆ దర్శనాలు కూడా రద్దు చేశారు. చక్కటి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకొనేందుకు వీలు కల్పించారు. ఎక్కడా అడ్డదారి దర్శనాలు లేకుండా క్యూ లైనను ఇంజనీరింగ్ అధికారులు రూపకల్పన చేశారు. వేకువ జామున నుంచే భక్తులకు దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతాల నుండి స్థానికంగా వున్న భక్తులు వచ్చినప్పుడు ఒక్కసారిగా లోపలికి అనుమతించకుండా అక్కడక్కడా కంపార్ట్‌మెంట్ల లాగా ఏర్పాటు చేసుకొని తొక్కిసలాట, తోపులాట లేకుండా అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. సాధారణ క్యూలైన్లతో పాటు విఐపి భక్తులకు మరో క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రోటోకాల్ ప్రకారం విఐపిల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది విఐపిల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్‌ను అలాగే అర్చకులు సిబ్బంది వాహనాలకు మరో చోట పార్కింగ్ సదుపాయం కల్పించారు. సన్నిధివీది, దిగువ సన్నిధివీధుల్లో అవకాశం కల్పించారు. సుమారు రెండులక్షల మంది భక్తులు హాజరుకావచ్చునని అంచనాలతో అన్నపూర్ణా నిలయంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. అలాగే భక్తులందరికీ ప్రసాదాలను అందుబాటులో వుంచారు ఏకాదశ రుద్రాభిషేకాలు. స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరునికి మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏకాదశ రుద్రాభిషేకాలు చేయడం ఇక్కడి ఆలయ సంప్రదాయం. మహాశివరాత్రి పర్వదినాన ఉదయం నుండి రాత్రి వరకు పదికాలాల్లో అభిషేకాలను నిర్వహిస్తారు.

# బలహీనతలు తగ్గించుకుని.. బలాలపై దృష్టి సారించాలి

## న- ఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్

## - డి ఆర్ డి ఓ చైర్మన్ డాక్టర్ ఎస్ వీ కామత్ కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

**మంగళగిరి, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** బలహీనతలను తగ్గించుకుని యువత బలాలపై దృష్టి సారిస్తే అన్నింటా విజయం సొంతమవుతుందని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేగ్వాల్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగిన ప్రత్యేక స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిను మేథ వినయోగంలో సవాళ్లు ఉన్నప్పటికీ ఆ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసి సమాజానికి ఉపయుక్తంగా మలుచుకునే ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతం మనం నాలుగో తరం పారిశ్రామిక విధానంలో ఉన్నామనీ, ప్రధాని మోదీ ఆశించిన ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థలోనూ కృత్రిమ మేధ వాడకంపై పరిశీలన జరుగుతుందని మంత్రి అర్జున్ రామ్ పేర్కొన్నారు. గౌరవ అతిథిగా హాజరైన డీఆర్ డీ వో ఛైర్మన్ డాక్టర్ ఎస్ వీ కామత్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయం వెనుక సాంకేతికత వినియోగం ఎంతో ఉందన్నారు. దేశ రక్షణలో భాగంగా డీఆర్డీవో నూతన పరిశోధనలకు పెద్ద పీట వేస్తుందన్నారు. యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారి వేందర్ మాట్లాడుతూ కేవలం ఎనిమిదేళ్ల కాలంలోనే యూనివర్సిటీ మల్టీ డిసిప్లేన్ యూనివర్సిటీ గా గుర్తింపు తెచ్చుకోవడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో యూనివర్సిటీని అన్ని విధాలా అభివృద్ధి పరుస్తామన్నారు. యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ పి సత్యనారాయణన్ మాట్లాడుతూ భారత రక్షణ రంగంలో కీలకమైన వ్యక్తిగా గుర్తింపు పొంది ఎన్నో సేవలందించిన డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ కామత్ కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషకరంగా ఉందన్నారు.

త్వరలో యూనివర్సిటీలో డిఫెన్స్ ఇంజనీరింగ్ను ప్రారంభిస్తున్నానన్నారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ యూనివర్సిటీ సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

ఈ సందర్భంగా ఏడుగురు రీసెర్చ్ స్కాలర్లకు పిహెచ్ డిగ్రీలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ట్రస్టీ మెంబర్ మణిమంగై, రీసెర్చ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి నారాయణరావు, రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ షీలా సింగ్, డాక్టర్ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరు మృతి,మరొకరి పరిస్థితి విషమం

**బిట్రగుంట (నెల్లూరు), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** బోగోలు మండలం కప్పరాల తిప్ప బోగోలు మధ్య శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. బిట్రగుంట ఏఎస్ఐ కోటేశ్వరరావు కథనం మేరకు కప్పరాలతిప్ప కు చెందిన కుంచాల సాల్మన్, మనోహర్ అఖిల్ తో కలిసి బోగోలు నుండి కప్పరాలతిప్పకు బుల్లెట్ వాహనంపై వస్తున్నాడు. అదే క్రమంలో విశ్వనాథరావుపేట కు చెందిన జస్టిస్ ఫ్రాన్సిస్ ప్రైవేట్ ఫ్యాక్టరీలో విధులు ముగించుకుని విశ్వనాథరావుపేటకు వస్తుండగా ఎదురెదురుగా రెండు మోటార్ సైకిల్ ఢీకొని కుంచాల సాల్మన్(23) మృతి చెందగా జస్టిస్ ఫ్రాన్సిస్ కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా కావలి ఏరియా వైద్య శాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో అఖిల్,మనోహర్ స్వల్ప గాయాలతో బయటపడ్డ పేర్కొన్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లూరును దోమలరహిత నగరంగా చేయడమే లక్ష్యం

### - మంత్రి నారాయణ

**నెల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు నగరంలోని 47 వ ములుముడి బస్టాండ్ సెంటర్ హనుమాయమ్మ సందు మరియు 48వ డివిజన్‌లలో మంత్రి నారాయణ శనివారం రాత్రి పర్యటించి, రోడ్డు మరియు ఉయ్యాల కాలువ ఆధునీకరణ పనులను పరిశీలించారు.అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు .ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ నెల్లూరును దోమలరహిత నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, 2017లో ఎదురైన ముంపు ముప్పు పునరావృతం కాకుండా రూ. 50 కోట్లతో 8 ప్రధాన కాలువల పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా డిజైన్లలో మార్పులు చేశామని, ఒకవేళ ఎవరికైనా ఇబ్బంది కలిగితే ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు .నగర అభివృద్ధికి ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. ఖజానా ఖాళీగా ఉన్నా అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్.

# అభివృద్ధి కూటమిసర్కార్‌కే సాధ్యం

## దేవాదాయ మంత్రి ఆనం నారాయణరెడ్డి

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** అభివృద్ధి పారదర్శకత,జవాబుదారి తనం ఒక్కకూటమి ప్రభుత్వానికే సాధ్యమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి అన్నారు.శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారి నుంచి సరాసరి శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరేందుకు వీలుగా అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేదుకు రూ.27కోట్లతో నిర్మించిన శివం టు శివం రోడ్డును మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువ నాయకుడు బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి అభివృద్ధితో పాటు ఆలయాభివృద్ధిని లక్ష్యంగాపని చేస్తున్నారన్నారు. గత శివరాత్రి సందర్భంగా తాము చెప్పిన హామీలను అమలు చేసామన్నారు. ముఖ్యంగా గిరి ప్రదక్షిణ రోడ్డును పూర్తి చేసి ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రారంబించారన్నారు.నేడు తాను శివం టు శివం రోడ్డును ప్రారంభించానన్నారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సుధీర్‌రెడ్డి పట్టుదల పని చేస్తున్నారని మంత్రి వివరించారు. నేడు శివం టు శివం రోడ్డు మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి కల అని దానిని ఆయన తనయుడు సుదీర్‌రెడ్డి పూర్తి చేయటం అభినందించదగ్గ విషయం అన్నారు.అంతేకాక శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ నిధుల కేటాయింపుకు వెనుకాడటం లేదని మంత్రి ఆనం నారాయణ రెడ్డి అన్నారు.ఈ నేపథ్యంలో గిరి ప్రదక్షిణ రోడ్డు ఇంకా 5కిలో మీటర్లు ఉందని అది మున్సిపల్ పరిధిలో ఉందని మంత్రి వివరించారు.కాగా భక్తుల సదుపాయాలకు సంబంధించి దేవాదాయశాఖ నిధుల విడుదలకు వెనుకాడటం లేదని మంత్రి ఆనం నారాయణరెడ్డి వివరించారు.ఈ రోడ్డు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కల అన్నారు.



శివం టు శివం రోడ్డును ప్రారంభించిన మంత్రి ఆనం నారాయణ రెడ్డి

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని తిరుచ్చి ఉత్సవం

**రాపూరు (నెల్లూరు), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం సాయంత్రం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ,పూలాంగి సేవ నిర్వహించారు.ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహా, వెంకట సుబ్బయ్య, పెంచల స్వామి, కోండల రావు,హారీష్, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.




# తిరుపతి 'రుయా'లో గుండెవ్యాధుల చికిత్స కేంద్రం వెంటనే తెరవాలి

## - నిరుపేదల గుండెకు ప్రమాదం

## - కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా ఆందోళన

**తిరుపతి,ఫిబ్రవరి 14ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్‌హబ్‌గా రూపుదిద్దుకుంటున్న తిరుపతి నగరంలో రాయలసీమ జిల్లాలకే తలమానికంగా ఉన్న రుయా ఆస్పత్రిలో గుండెవ్యాధుల(కార్డియాలజీ)విభాగం వెంటనే ప్రారంభించాలని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో పేదల ఆస్పత్రి రుయాలో కార్డియాలజీ విభాగం మూతబడిందన్నారు. నిరుపేదల గుండెకు ప్రమాదం వచ్చిందని, గుండె జబ్బులతో పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రుయాలో గుండె జబ్బుల విభాగాన్ని ప్రారంభించామని, డాక్టర్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో వందల మంది నిరుపేద రోగులు రుయా ఆసుపత్రిలో గుండె జబ్బులను బాగు చేసుకుని వెళ్లారన్నారు. తిరుపతి రుయాలో కార్డియాలజీ విభాగం మూతబడటంపై శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆస్పత్రి ముందు నిరసన తెలిపారు. వైసిపి నేత అంబటి రాంబాబుకు ఏదో జరిగిందని జగన్ పరుగెత్తుకెళ్ళాడని,తిరుపతి రుయా ఆస్పత్రిలో నిరుపేద రోగులకు జరుగుతున్న అన్యాయం గురించి జగన్ మాట్లాడడం లేదని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని,ముఖ్యమంత్రిగా రుయా ఆసుపత్రికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అలిపిరి దగ్గర వెయ్యి పడకల ఆసుపత్రి భవనం ఖాళీగా ఉందని, ఆ భవనాన్ని రుయా ఆసుపత్రికి టిటిడి ఇవ్వాలని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టకముందు ఏడు వేల రూపాయలు కరెంటు బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ఇప్పుడు 70 వేల రూపాయలు కరెంటు చార్జీలు వస్తోందని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని, పాత విధానాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు రవి, రావణ్, ముని శోభ, సమీఉల్లా తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి : ఐక్య వేదిక డిమాండ్

**విజయవాడ, ఫిబ్రవరి14, ప్రభాతవార్త :** ఐక్యవేదిక సభ్య సంఘాల సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయం, విద్యాధరపురం, విజయవాడలో శనివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో గతంలో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసిన సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించారు. 12వ సిఆర్‌సి గడువు పూర్తి అయ్యి 30 నెలలు దాటినా ఇంకా కమీషన్ ను వేయకపోవడం పట్ల ఐక్యవేదిక చైర్మన్ కెఆర్ సూర్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్రిసభ్య కమీషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలపై విధానపరమైన నిర్ణయాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించాలని ప్రభుత్వ బకాయిలకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని తద్వారా అటు ప్రభుత్వానికి ఇటు ఉద్యోగులకు మంచి జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు కేటాయించడం ద్వారా గృహనిర్మాణ కార్మికులకు పూర్తిస్థాయిలో పని దొరుకుతుందవి, తద్వారా ఉద్యోగులు, గృహనిర్మాణ కార్మికులు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 2026 డ్రాఫ్ట ప్రధానంగా సమావేశంలో చర్చించారు. డ్రాఫ్ట్ రూల్స్పై ఉద్యోగుల ఆందోళన అర్థం చేసుకున్నామని, పై డ్రాఫ్ట్ రూల్స్ను మరొక్కసారి పరిశీలించి ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండేలా ప్రాతినిధ్యం చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఐక్యవేదిక తరపున ఇచ్చిన ప్రధాన డిమాండ్లు సిపిఎస్./జిపిఎస్ రద్దు ఓ.పి.ఎస్. పునరుద్ధరణ, 12వ పి.ఆర్.సి. సత్వర అమలు సకాలంలో డి.ఎ.ల చెల్లింపు, ఎన్.ఎమ్.ఆర్. కంటింజెంట్ / కాంట్రాక్టు / ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పెన్షనర్లకు ఎడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అమలు, మెరుగైన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇళ్లస్థలాల కేటాయింపు, టీచర్స్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ సమస్యకి శాశ్వత పరిష్కారం మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటుకు చట్టబద్ధ చర్యలు పై చర్చ జరిగింది. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పనిభారంతో ఉద్యోగులు చనిపోవడంపై సభ్యసంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులపై పనిభారాన్ని తగ్గించాలని, అధికారులు ఉద్యోగులను ఒత్తిడికి గురిచేయకుండా తగు మార్గదర్శకాలు ప్రభుత్వం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి ఐక్యవేదిక సమావేశం మార్చి రెండవ వారంలో ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి తదుపరి కార్యాచరణను ప్రకటిద్దామని తీర్మానించారు. ఈ అంశాలపై సమస్య పరిష్కార మార్గాలపై ఒక అర్థవంతమైన చర్చల ద్వారా సత్వర పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ బాజీపఠాన్, మాగంటి శ్రీనివాసరావు, ఎ.పి.జి.ఇ.ఎ. ప్రధానకార్యదర్శి ఎమ్. రమేష్ కుమార్, ఉపాధ్యక్షులు కేదారేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, కరిమి రాజేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. రామచంద్రారెడ్డి, కె.వి. రమణ, సభ్యసంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పు ఎంత ఉందో చెప్పలేదు, పాత పద్దు చదివారు

## - వైసిపి నేత బుగ్గన రాజేంద్రనాథ్

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ 2026-27 బడ్జెట్ చట్టసభలో విప్పిన అబద్దాల చిట్టా అని ఏపీ మాజీ ఆర్థికమంత్రి,వైసిపి నేత బుగ్గన రాజేంద్రనాథ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ బడ్జెట్ ద్వారా ఏ రంగాన్ని కూటమి అభివృది చేస్తుందో చెప్పాలన్నారు.ఏపీ శాసనసభలో శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్దాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

# ప్రభుత్వం అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనం బడ్జెట్ : మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మూడోసారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ గాడి తప్పిన వ్యవస్థను ఆర్థిక సంక్షోభం నుంచి పురోగతి వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మూలధన వ్యయం విషయంలో గత సంవత్సరం రూ.39,498 కోట్ల నుండి 16 శాతం పెంచి రూ.53,917 కోట్లకు చేర్చడం ప్రభుత్వం అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని నాదెండ్ల మనోహర్ తెలిపారు.అదేవిధంగా పన్నుల ద్వారా రెవెన్యూ వసూళ్ళు గత సంవత్సరం రూ.98,025 కోట్ల నుండి రూ.1,25,846 కోట్లకు పెరగడం రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణలో జరుగుతున్న నిరంతర కృషికి రుజువని ఆయన అన్నారు. సంక్షేమ రంగంలో సూపర్ సిక్స్ పథకాలకు ఎటువంటి రాజీ లేకుండా నిధులు కేటాయించడం, ముఖ్యంగా దీపం పథకం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తున్న తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.10,950 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే 93 శాతం మంది రైతులకు నేరుగా చెల్లింపులు జరపడం భారత దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శవంతంగా నిలిపిందని ఆయన వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.57,000 కోట్లతో 98 ప్రాజెక్టులు వేగంగా సాగుతున్నాయని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 60 శాతం పురోగతి సాధించి గోదావరి పుష్కరాల నాటికి జాతికి అంకితం చేయనున్నారని నాదెండ్ల మనోహర్ తెలిపారు. నీతి ఆయోగ్ సహకారంతో మూడు ఎకనామిక్ గ్రోత్ కారిడార్లు ఏర్పాటు చేయడం, రాయలసీమలో దేశంలోనే తొలిసారి హార్టికల్చర్ హబ్ స్థాపించడం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మిలుపైన అడుగులని ఆయన అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారానికి దోహదపడే ప్రత్యేకమైన సావరిన్ వెల్త్ ఫండ్‌ని రూ.100 కోట్లతో ప్రారంభించడం భారతదేశంలో ఇదే తొలిసారని, ఇది పారిశ్రామికవేత్తలు మరియు పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని ఆయన ప్రశంసించారు. డేటా లేక్ ఏర్పాటు ద్వారా 36 శాఖల నుండి 900 సేవలను మీసేవ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించడం స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ నినాదాన్ని ఆచరణలో చూపిస్తోందని అన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ సిఎం దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

**విజయవాడ, ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళిని అర్పించారు.దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి శనివారం.ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. "ఎక్స్" వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

# ఆర్టీసీ హౌస్‌లో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్ర రెండో ముఖ్యమంత్రి,దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా,అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా విలువైన సేవలందించిన సౌమ్యులు,నిజాయితీపరుడు,పేదల పెన్నిధి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శనివారం ఏపిఎస్ఆర్టీసీ ప్రధాన కార్యాలయం,ఆర్టీసీ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.అప్పలరాజు లు జ్యోతి ప్రజ్వలన గావించి,దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య తెలుగు రాష్ట్ర ప్రజలకు,దేశానికి ఆయన అందించిన సేవల గురించి మాట్లాడారు.డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ జి.పాణి చక్రతేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు స్టేట్ ఫెస్టివల్‌గా జరుపుకునే క్రమంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి

తోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.అప్పల రాజు,బాలస్వామి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ జయశంకర్, డిప్యూటీ సీఎంఈ మధు,పర్సనల్ ఆఫీసర్లు కిషోర్,ఏ. మాణిక్యం,సెక్యూరిటీ తదితర ఉన్నతాధికారులు, అధికారులు,సూపర్‌వైజర్లు,వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు,ఉద్యోగులు పలువురు హాజరయ్యారు.

# బడ్జెట్‌లో బిసిలకు న్యాయం జరిగింది - మంత్రి సవిత

## సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. నూతన బడ్జెట్‌లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్‌లో రూ.51,021 లక్షల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినదుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు.బిసిల పట్ల చంద్రబాబుకు ఉన్న అభిమానానికి బడ్జెట్ నిదర్శనమన్నారు.

# పేదల పక్షపాత బడ్జెట్ :మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రవేశపెట్టిన మూడవ బడ్జెట్ పేదలు, రైతులు, మహిళలు, బీసీ, ఎస్టీ వర్గాలను కేంద్రంగా చేసుకుని వారి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, రహదారులు మరియు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ఈ బడ్జెట్‌ను ఆయన మీడియా పాయింట్ వద్ద ప్రశంసించారు. ఆర్థిక క్రమశిక్షణ విషయంలో 2024-25లో 5.11 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 4.57 శాతానికి తగ్గించిన ప్రభుత్వం ఇప్పుడు దాన్ని మరింత తగ్గించి 3.84 శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవడం ఆర్థిక నిర్వహణలో పరిపక్వతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా రెవెన్యూ లోటును 2.33 శాతం నుండి 1.88 శాతానికి తగ్గించాలని నిర్దేశించుకోవడం రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఆయన వివరించారు.ఈ సమావేశంలో బిజెపి శాసనసభా పక్షనేత కుమార్ రాజు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రంగాలకు ప్రాధాన్యత : ఎమ్మెల్సీ బిటి నాయుడు

**విజయవాడ,ఫిబ్రవరి 14.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ బీటీ నాయుడు అన్నారు. బడ్జెట్ సందర్భంగా బీటీ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధికంగా కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు. బడ్జెట్ లో విద్యారంగానికి 23 వేల 363 కోట్ల రూపాయలు కేటాయించడం మంచి పరిణామమన్నారు. తల్లికి వందనం పథకానికి 9668 కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు స్కాలర్ షిప్ లు, ఉన్నతవిద్య, సమగ్ర శిక్షణ, మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించారన్నారు. మనబడి మన భవిష్యత్తుకు 1500 కోట్లు కేటాయించి బడులను అభివృద్ధి చేయాలని మంత్రి నారా లోకేష్ నిర్ణయించారని, తద్వారా బడుగు బలహీన వర్గాల పిల్లలు అభివృద్ధి చెందేలా బడ్జెట్ లో విద్యాశాఖకు కేటాయింపులు పెంచారన్నారు. మంత్రి నారా లోకేష్ పట్టుదల, కృషి ఫలితంగానే విద్యాశాఖకు అధిక నిధులు కేటాయింపు సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. దేశానికి వెన్నెముక అయిన రైతులకు గత ప్రభుత్వం ఏమీ చేయకుండా నాశనం చేసిందని ఆరోపించిన బీటీ నాయుడు.. రైతును రాజుగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించిందన్నారు. వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో పెద్దపీట వేసిందని, సాగునీటి ప్రాజెక్టులకు 9960 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 6600 కోట్లు కేటాయించిందని వివరించారు. రైతుల కోసం ప్రత్యేక బడ్జెట్ రూపొందించి సమగ్రంగా అమలు చేస్తున్నది రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వమేనన్నారు. 3.32 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి 5 కోట్ల ప్రజలు అండగా ఉండాలని కోరారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి,ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని బీటీ నాయుడు కోరారు.



సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు

# నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ :ముఖ్యమంత్రి చంద్రబాబు

**- ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.9 వేలకోట్లు కేటాయింపు**

**- సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి -సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు**

**విజయవాడ, ఫిబ్రవరి 14.ప్రభాతవార్తప్రతినిధి:** నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుల్లో ముందుంటున్నారని, ఉన్నత కొలువులు సాధించాలనే పట్టుదల వారిలో పెరిగిందన్నారు. భవిష్యత్ లో ఉన్నత స్థానానికి చేరుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదని అభిప్రాయపడ్డారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. రూ.50 లక్షలు కేటాయించి సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రసంగించారు. సేవాలాల్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమే..ఉమ్మడి అనంతపురం జిల్లా, గుత్తి మండలం, రామ్‌జీ నాయక్ తండాలో భీమా నాయక్, ధర్మణి మాత దంపతులకు సంత్ శ్రీ సేవాలాల్ జన్మించారు. సేవాలాల్ దూరమై శతాబ్దాలు గడుస్తున్నా బంజారాల గుండెల్లో ఆరాధ్య దైవంగా నిలిచారు. బంజారాలంలో సేవాలాల్ చైతన్యాన్ని తీసుకొచ్చారు. ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శంగా ఉంటాయి. దేశమంతా తిరిగి బంజారాలను ఒకతాటిపైకి తీసుకొచ్చారు. సేవాలాల్ సేవలను నెమరువేసుకునే బాధ్యత మనందరిపై ఉంది. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టం. చిన్నతనం నుంచే సేవాలాల్ సామాజిక సేవతో మెలిగారు. ఎవరైనా ఆకలితో ఉంటే ఆయన వద్దున్న ఆహారాన్ని పక్కవారికి ఇచ్చి ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి. జంతుబలిని వ్యతిరేకించారు. జంతువులను బలివ్వాలనుంటే ముందు నన్ను బలి ఇవ్వండని చెప్పారు. కానీ ఈ రోజుల్లో ఫోటోలకు జంతువులను బలిఇచ్చి హింసను సమర్థించుకునంటున్నార్లు అని సీఎం చంద్రబాబు అన్నారు. గిరిజన బిడ్డల్లో పట్టుదల పెరిగింది..మహిళా సమానత్వం గురించి మనం ఇప్పుడు మాట్లాడుకుంటన్నాం. ఆనాడే స్త్రీ సమానత్వ ఆవశ్యకతను సేవాలాల్ చెప్పారు. తన జీవితాన్ని అరణ్యవాసులు, సంచార జాతులకోసం కేటయించారు. సంచార జీవనం కాకుండా తండాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించారు. సాయం చేయడం, ప్రకృతిని ప్రేమించడంతో పాటు ధర్మాన్ని పాటించాలని హిత బోధ చేశారు. ఆయన అందరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారు. అదే విధంగా పేదల కోసం పని చేసిన వ్యక్తి ఎన్టీఆర్. గిరిజన పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి ఉన్నత విద్య అందించాలని గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత తండాలను అభివృద్ధి చేయాలని ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాం. గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చేసేందుకు వారి ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నాం. అరకు కాఫీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించింది.

# రామతీర్థంలో శివరాత్రి జాతరకు సర్వం సిద్ధం :అధికారులు

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా ) ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానం వద్ద ఈ నెల 15వ తేదీన ఆదివారం శివరాత్రి జరుగునున్నది. ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఈ జాతర జరుగునున్నది. అందుకు అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక రుసుము క్యూలైన్ ఏర్పాటు చేశారు. రామతీర్థంలో ప్రతి ఏటా జరిగే ఉత్స వాలకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒరిస్సా రాష్ట్రం నుంచి సుమారు అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. శివరాత్రి పర్వదినం నాడు శ్రీరాముడికి పూజలు చేయడం ఇక్కడ సాంప్రదాయం. దేవస్థానం ఆవరణలోనే ఉన్న క్షేత్రపాలకుడు ఉమా సదాశివ స్వామి నీ భక్తులు తొలుత దర్శించుకొని అనంతరం సీతారాములను దర్శించుకుంటారు. మొక్కులు చెల్లించుకుంటారు. శివరాత్రి జాతర తొలిరోజే సుమారు రెండు లక్షల మంది వస్తారని అంచనా. వీరిలో అధిక శాతం భక్తులు రామతీర్థం ఆలయ పరిసరాల్లోనే శివరాత్రి రాత్రంతా జాగరణ చేసి మరుచటి రోజు తిరిగి రామకోనేరులో స్నానమాచరించి సీతారాములను ఉమా సదాశివ స్వామిని మరోసారి దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రధానంగా రామతీర్థం లో జరిగే శివరాత్రి జాతరలో జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన చెందిన మత్స్యకారులు ప్రధాన భూమిక పోషిస్తారు. రాత్రంతా దివిటీ వెలుగులను ఏర్పాటు చేసుకొని కోలలు అనే పేరుతో నృత్యం చేస్తు జాగరణ చేస్తారు. రెండవ రోజు సాయంత్రం భక్తులు తమ ఇళ్లకు వెను తిరుగుతారు. దీంతో జాతర ముగుస్తుంది. రామతీర్థం జాతరకు వచ్చే భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ అధికారులు 40 బస్సు లను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం రామతీర్థంలో రెండు బస్టాండ్లను కూడా ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛను ఈ సంఘటన గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు అయింది. విజయనగరం డిఎస్పి గోవిందరావు పర్యవేక్షణలో భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ ఐ బి గణేష్ ఆధ్వర్యంలో బందోబస్తు సిద్ధమైంది దేవా దాయ శాఖ పరంగా చీఫ్ ఫెస్టివల్ అధికారిగా నియమితులైన డిప్యూటీ కమిషనర్ శోభారాణి ఆదేశాల మేరకు దేవస్థానం ఈవో వై. శ్రీనివాసరావు ఏర్పాట్లను పకడ్బందీగా చేశారు. క్యూ లైన్ లో ఉన్న భక్తుల కోసం ఉచితంగా వాటర్ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేశారు. అమ్మకం కోసం లక్షలాది లడ్డూ ప్రసాదాన్ని కూడా సిద్ధం చేశారు. క్యూలైన్లో భక్తుల రద్దీన్ క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు సహకరించేందుకు వివిధ కళాశాలలకు చెందిన ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరు కానున్నారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పులిహారను, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు ఎంపీడీవో రామకృష్ణ రాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథం సిబ్బందిని సిద్ధం చేశారు. భక్తుల వైద్య సాయం కోసం సత్తివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, ఇప్పటికే సందర్శించారు.



# చీపురుపల్లిలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**చీపురుపల్లి (విజయనగరం జిల్లా ) ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీపురుపల్లిలో పర్యటించనున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో శనివారం నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం చీపురుపల్లిలో విస్తృత పరిశీలనను జరిపారు. ప్రత్యేకించి చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయపురం శివార్లలో గల మదర్ తెరిసా స్కూలు ప్రాంగణమునకు ఎదురుగా గతంలో ఏర్పాటు చేసిన హెలిఫ్యాడ్‌ను జేసీ సేతు మాధవన్ ముందస్తుగా పరిశీలించారు. అనంతరం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించిన కొరకు ఆసుపత్రి అధికారుల బృందంతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ సుధీర్‌తో మాట్లాడుతూ ఆసుపత్రి నుండి వెలువడుతున్న వ్యర్థాలను ఎలా పంపిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. వేస్ట్ మెటీరియల్ ను వాహనాలతో తరలిస్తున్నామంటూ సూపరిండెంట్ వివరించారు. చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలో చేపట్టనున్న కార్యక్రమాలకు దిశా నిర్దేశాలను ఆయన ఆసుపత్రి అధికారులకు సిబ్బందికి సూచించారు. అనంతరం చీపురుపల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పాఠశాలను సందర్శించే అవకాశాలు ఉన్నట్లు ఈ నేపథ్యంలో పాఠశాలను పరిశీలించినట్లు అధికారులు తెలియజేశారు. అనంతరం చీపురుపల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ను జెసి సేతు మాధవన్ పరిశీలన జరిపారు. అదేవిధంగా చీపురుపల్లి పట్టణ శివారులో గల గద్దె బాబురావు పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణాన్ని జేసి అధికారుల బృందంతో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆ ప్రాంగణంలో బహిరంగ సభను ఏర్పాటు చేయుటకు అవసరమైన ఏర్పాట్ల కోసం కోసం అధికారులతో పరిశీలన జరిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# వెదురు అక్రమ రవాణా

**మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా ) ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మండలంలో వెదురు అక్రమ రవాణా యదేచ్ఛగా కొనసాగుతోంది. వెదురు నరకడానికి గిరిజనులకు కొన్ని అనుమతులు ఉన్నప్పటికీ దళారులు ప్రభుత్వానికి చెల్లించాల్సి న రుసుము కూడా చెల్లించకుండా అర్ధ రాత్రులు రవాణాను సాగిస్తున్నారు. అయితే బేస్ క్యాంపు లలో ఉండవలసిన సిబ్బంది ఆ క్యాంపు ప్రాంతంలో సరిగా ఉండకపోవటం వలన కలప రవాణా అక్రమ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. అరటి పంటకు రైతులకు అవసరమని కొంతమంది చెప్పుకొని దళారులు ఇటు గిరిజనుల వద్ద అటు రైతుల వద్ద సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బేస్ క్యాంపు లలో సిబ్బందిని నిరంతరం ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అక్రమ తరలింపు లు జరగకుండా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

# బడ్జెట్ తిరోగమన స్థితిలో ఉంది :సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వి జ య వా డ . ఫి బ్ర వ రి 14,ప్రభాతవార్తప్రతినిధి:రాష్ట్ర బడ్జెట్ (2026 -27) తిరోగమన ఆర్థిక ప్రణాళిక అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనికి సంబంధించి శనివారం శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. 202627 రాష్ట్ర బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, సామాజిక న్యాయానికి తోడ్పడే విధంగా లేదని అన్నారు. ముఖ్యమంత్రి చెబుతున్న "వికసిత ఆంధ్రప్రదేశ్" మాటల్లో గొప్పచేతల్లో శూన్యంలాగా ఉందని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ అమల్లో మిగిలిపోయిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్ పట్టించుకోలేదని అన్నారు. రూ.75 వేల కోట్లు లోటు పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని చెప్పారు. మొత్తం మీద ఈ బడ్జెట్ తిరోగమనం దిశలో ఉందని స్పష్టం చేశారు. ఈ రెండు సంవత్స రాలలో క్రమంగా ఆదాయం పడిపోతున్నదని శ్రీనివాసరావు వివరించారు. అభివృద్ధి ఉంటే ఆదాయం పెరగాలి.. కానీ రాష్ట్ర స్వంత పన్ను ఆదాయం తగ్గిందంటే అర్థం ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయనే అని స్పష్టం చేశారు. కేంద్ర నుండి రావాల్సి న గ్రాంటు, పన్నుల వాటా (జిఎస్టీ) తగ్గిందని, డబుల్ ఇంజన్ సర్కారు భాగోతం దీనితో బట్టబయలవుతున్నదని అన్నారు. పెట్టుబడి వ్యయం బాగా తగ్గింది .. అంటే అభివృద్ధి తిరోగమనంలో ఉందనే అర్థం అని చెప్పారు. పెట్టుబడి పద్దు కింద రూ.98 వేల కోట్లు చూపించగా ఇందులో రూ.76 వేల కోట్లు బహిరంగ మార్కెట్‌లో తెచ్చే అప్పులేనన్నారు. స్థూల జాతీయోత్పత్తిలో 36 శాతం అప్పులే ఉన్నాయన్నారు. బడ్జెట్‌లో 18 శాతం వడ్డీలకే సరిపోతున్నదని చెప్పారు. ఈ భారం మొత్తం ప్రజల మీదే పడుతుంది.. కానీ పెట్టుబడి వ్యయం రూ.48,697 కోట్లు కేటాయించారు.. అంటే మిగతా అప్పు మొత్తం ఎక్కడకు పోతున్నదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి అని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అభివృద్ధి చేయడంలో విఫలమై ఆ బాధ్యత పిపిపి పేరుతో ప్రయివేటు రంగంపై నెట్టిందన్నారు. ప్రయివేటు పెట్టుబడులు దేశంలోనే తిరోగమనంలో ఉన్నాయన్నారు. విదేశీ పెట్టుబడులు వెనక్కిపోతున్నాయన్నారు. ఇంటికొక పారిశ్రామికవేత్త నినాదం ఆశాజనకంగా లేకపోగా చిన్న పరిశ్రమలకు ప్రోత్సా హం లేదు అని చెప్పారు. ప్రభుత్వ విధానాలు ఇంటికొక నిరుద్యోగిని సృష్టించాయని అన్నారు. ఆర్థిక మంత్రి ఉపన్యాసం ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా అరచేతిలో వైకుంఠం చూపించారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయానికి 4 శాతం మాత్రమే కేటాయించి రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి బడ్జెట్ 1 శాతం లోపే ఉందన్నారు. మిగతా అంతా యంత్రాంగం నిర్వహణకే పోతున్నదని చెప్పారు. ఒకవైపు చినీ చెట్లు, అరటి, ఇతర పండ్ల రైతులకు గిట్టుబాటు ధర రాక చెట్లు పీకేస్తుంటే ఉద్యానవన పంటలకు ప్రోత్స హిస్తున్నట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పంటల భీమాను రైతులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు అని తెలిపారు. ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్లు అవసరం కాగా రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడం వ్యవసాయం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నదని అన్నారు. ఇరిగేషన్‌కు దాదాపు పెరుగుదల లేదనీ, కౌలు రైతులను పట్టించుకోలేదు అని చెప్పారు. గ్రామీణాభివృద్ధికి 8.3 శాతం నుండి 7.4 శాతానికి అంటే దాదాపు 1 శాతం తగ్గిందన్నారు. వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు అదనపు నిధులు కేటాయించలేదని చెప్పారు. ఆ లెక్కన ప్రాజెక్టులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు అని అన్నారు. వెలిగొండ, హంద్రీనీవా, వంశధార తదితర ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడానికి నిధులు పెంచాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు ఎంత కేటాయించారో స్పష్టత లేదు అని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయిందని ఇప్పటిదాకా చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు 60 శాతం మాత్రమే పూర్తయిందని చెప్పడం వారి వాగాడంబరాన్ని బట్టబయలుచేసిందని శ్రీనివాసరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ రంగానికి రూ.15 వేల కోట్ల నుండి రూ.14 వేల కోట్లకు తగ్గించారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచడానికే బడ్జెట్‌లో నిధులు కోత పెట్టినట్లు కనిపిస్తున్నదన్నారు. విద్యారంగానికి పెద్ద పీట వేస్తామని ఘనంగా ప్రకటించినా మొత్తం బడ్జెట్‌లో విద్యకు 10.8 శాతం నుండి 10.5 శాతానికి తగ్గిందని.. ఇప్పటికే 1400 స్కూళ్ళు మూసివేశారని, కొత్తగా స్కూళ్ళు పెట్టలేదనీ, ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిల గురించి ప్రస్తావన లేదు

# త్రికోటేశ్వరుని జాతరకు సర్వం సిద్ధం

**నరసరావుపేట (పల్నాడుజిల్లా), ఫిబ్రవరి14, ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కోటప్పకొండ వద్ద జరగనున్న కోటయ్య జాతరకు సర్వం సిద్ధమైంది. హరహర చేదుకో కోటయ్యా.. చేదుకోవయ్యా అంటూ ఆర్తితో భక్తులు పిలవగానే కాళకుటంలాంటి పాపాలను హరించి భక్తులకు దీవెనలిచ్చే ప్రత్యక్ష దైవం దర్శనం కోసం ఇప్పటికే భక్తుల రాక ప్రారంభమైంది. మహాశివరాత్రి పర్వదినాన రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయా శాఖల జిల్లా అధికారులు కొండవద్ద మకాం వేసి పర్యవేక్షి స్తున్నారు. కొండ దిగువ భాగాన రోడ్లు, భవనాల శాఖ అధ్వర్యంలో యోగివేమారెడ్డి సత్రం వరకు బ్యారికేట్లు ఏర్పాటుచేశారు. దిగువన సాయిబాబా దేవాలయం ప్రక్కనే ఆర్టీసీ ప్రత్యేక విఐపి బస్సు స్టేషన్ను ఏర్పాటుచేసింది. భక్తులకు మంచినీటిని అందించేందుకు గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏర్పాట్లు పూర్తిచేసింది. విద్యుత్ సౌకర్యంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటుచేశారు. రెవెన్యూ శాఖ ప్రోటోకాల్ పాటిస్తూ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులకు, ప్రత్యేక శిబిరాలు, విడిది గదులు ఏర్పాటు చేసారు. స్టాల్స్ ఏర్పాటు.. పుణ్యస్నాలకు ప్రత్యేక ఏర్పాట్లు కొండ దిగువ భాగాన ప్రభుత్వ, ప్రైవేటు స్టాల్స్ అధిక సంఖ్యలో ఏర్పాటుచేశారు. తిరునాళ్ళకు తరలివచ్చే వారికోసం ప్రభుత్వ పథకాలు తెలియజేసే విధంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రచార స్టాల్స్ అధికారులు ఏర్పాటుచేశారు. అదేవిధంగా చెరుకుగడెలు, బొమ్మలు, వివిధ రకాల వస్తువులు. కోడె దూడలప్రదర్శనలు, వివిధ రకాల తిను బండారాలు, స్టాల్స్ నిర్వాహకులు ఏర్పాటుచేశారు. వీటితోపాటు జైయింట్ వీల్ వంటివి కొండ దిగువన ఉంచారు. ఇహ భక్తులకు కొండ దిగువన ఉన్న సాగర్ కాలువ వద్ద పుణ్యస్నాన లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేసారు. అగ్నిమాపకశాఖ ఫైరింజన్లు కాలువ వద్ద సిద్ధం చేసారు.అదే విధంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన లు చోటు చేసుకోకుండా తాత్కలిక నిఘా కేంద్రాలు,పలు ప్రాంతాలతో, కాలువ వద్ద ఏర్పాటు చేసారు. భక్తులను అలరించనున్న పర్యాటక కేంద్రం.. దేవాలయ జీర్ణోర్ధరణతో పాటు , ఘాట్ రోడ్ ఏర్పాటుతో అభివృద్ధి చెందిన త్రికోటేశ్వర దేవాలయంతోపాటు ఘాట్రోడ్డులోని పర్యాటక కేంద్రం భక్తులకు అలరిస్తుంది . స్వామి దేవాలయం వద్ద ఉన్న సాలంకయ్య పేరుతో నిర్మించబడ్డ అభిషేక మండపం, దేవాలయానికి ముందుభాగాన ఉన్న శాంతి యాగశాల, 26 అడుగుల ఎత్తులో ధ్యాన శివుడు, ప్రశాంత పేరుతో ఉన్న ధ్యాన మందిరం ఇక్కడ ప్రత్యేక ఆకర్షనీయం గా ఉన్నాయి.

# ఇంద్రకీలాద్రిపై బడ్జెట్ ప్రతులకు ప్రత్యేక పూజలు

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి పాదాలచెంత బడ్జెట్ ప్రతులను ఉంచి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలత శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ నిర్విఘ్నంగా అమలు కావాలని ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, తదితరులు అమ్మవారిని ప్రార్థించారు.



# పాకల సముద్రంలో బీచ్ ఫెస్టివల్

**ఒంగోలు,ప్రభాతవార్త** సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. ఈనెల 14, 15 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో సముద్ర తీరంలో శనివారం సందడి నెలకొంది. హెలీ టూరిజం, స్పీడ్ బోట్ రైడింగ్, ఫుడ్ స్టాల్స్, వివిధ రకాల ఉత్పత్తుల ఎగ్జిబిషన్ స్టాల్స్, శివరాత్రి కళ ఉట్టిపడేలా భారీ సైకత శిల్పాలు రూపొందించి సర్వహంగులతో, సర్వాంగ సుందరంగా చేసిన ఏర్పాట్లను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర, తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఎంపీ, రియాజ్, సత్య, సుచిత్ర, మేయర్ హెలికాప్టర్లో ప్రయాణించి సందర్శకులలో ఉత్సా హం నింపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా, సందర్శకులకు సరికొత్త అనుభూతి కలిగించేలా ఈ ఉత్స వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దామచర్ల సత్య మాట్లాడుతూ పాకల బీచ్ కు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేలా జాతీయ రహదారి నుంచి నేరుగా నాలుగు కిలో మీటర్లు డబల్ లైన్ రోడ్డు వేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఉన్న వనరులను సమర్ధంగా వినియోగించుకుంటూ మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ బీచ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఆహ్లాదం కోసం ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న పాకల బీచ్ ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

# ఘనంగా దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణ

**మడకశిర టౌన్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త.** మడకశిర పట్టణం ఆర్డీవో కార్యాలయం సర్కిల్ సమీపంలో భారతదేశంలో మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి సాహిత్య వేత్త దామోదరం సంజీవయ్య 105 వ జన్మదిన సందర్భంగా ఆ మహనీయుని విగ్రహావిష్కరణ మాల సోదరులు ప్రతిష్టించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ , కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ.మాల డైరెక్టర్ లు ఆంజనేయులు.కమలమ్మ, మాజీ ఎంపీ హర్షకుమార్. బసవ నాగి దేవరాయ గురువు.లతో కలిసి మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ పార్లమెంటు సభ్యుడు హర్ష కుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, మాల కార్పొరేషన్ డైరెక్ట్ కమలమ్మ. మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు లు మాట్లాడుతూ: రిజర్వేషన్ లేని ముఖ్యమంత్రి సీటులో అధిరోహించి ముఖ్యమంత్రి కావడం దళిత జాతి ముద్దుబిడ్డ , దామోదరం సంజీవయ్య గారు, ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించే సమయంలో అనేకమైన సంస్కరణలు తీసుకురావడం జరిగింది, కర్నూలు జిల్లాలో పెద్దపాడు గ్రామంలో జన్మించి అఖిలభారత కాంగ్రెస్ రెండుసార్లు అధ్యక్ష బాధ్యతలో నిర్వహించి తను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతి నిరోధక శాఖను ప్రవేశపెట్టి, కాపు సామాజిక వర్గం కోసం కాపు సమాజానికి రిజర్వేషన్ కల్పించిన మహా నాయకుడు అంబేద్కర్ ఆశయాలను ఆకాంక్షలను కొనసాగిస్తూ బలహీనవర్గాల కోసం కృషి చేసిన మహనీయులు దామోదరం సంజీవయ్య అలాంటి మహనీయుల జీవిత చరిత్రను రాబోవు తరానికి తెలిసే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేసి వారు అవలంబించినటువంటి మార్గదర్శకాలను రాబోవు తరాలకు తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంటరానితనం వివక్షత ఆణిచివేత వంటి సమయంలో మంచి విద్యావంతులుగా ఎదిగి ఉమ్మడి రాష్ట్ర మంత్రివర్గంలోనూ మరియు దేశ మంత్రివర్గంలోనూ పనిచేసి పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించారన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి మాట్లాడుతూ: ప్రతి మనిషిని ప్రేమించాలి.. ప్రతి మనిషిని గౌరవించాలని అన్నారు.

# సమష్టి కృషితో ప్రజల కలలు సాకారం

## బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ.ఫి బ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఏపీ బడ్జెట్ రూపొందించామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన విత్త పద్దులో పేర్కొన్నారు.అన్ని ప్రాంతాలకు.వర్గాల బడ్జెట్‌లో ప్రాధాన్యతను ఇచ్చినట్లు వివరించారు.ఎకనమిక్ రీజియన్ కారిడార్ల ద్వారా మూడుప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని ప్రకటించారు.సంపద సృష్టి కోసం రూ.వందకోట్ల కార్పస్‌తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.. ఆర్థిక క్రమశిక్షణతో, రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలుపుతామని హామీ ఇచ్చారు. రూ.3లక్షల 32వేల 205 కోట్ల రూపాయలతో 2026–27 వార్షిక పొద్దు పొడిచింది. రాష్ట్రంలో సంపద సృష్టించే క్రమంలో మూలధన వ్యయాన్ని గతం కంటే ప్రభుత్వం పెంచింది. అదేవిధంగా రాష్ట్ర ఆర్థిక రథం సరైన దశదిశలో వెళ్తోందని, రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. కేంద్రం నుంచి మరిన్ని నిధులు వస్తాయని ఆశిస్తున్నట్లు వివరించారు. క్రమశిక్షణ, సాహసోపేత నిర్ణయాలు, సమష్టి కృషితో ప్రజల కలలు సాకారం చేసేందుకు రేయింబవళ్లు శ్రమిస్తామని ప్రకటించారు. 15శాతం వృద్ధి రేటు సాధించేందుకు ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యం పెంచేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొత్తం మీద ఈ బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ.51వేల 21కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు కేశవ్ ప్రతిపాదించారు.

# ఎపిలో 4.78 లక్షల సికిల్‌సెల్ స్టేటస్ కార్డుల పంపిణీ

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పలు గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో సికిల్‌సెల్ వ్యాధి పరీక్షలు నిర్వహించి 4,78,188 మందికి జెనెటిక్ స్టేటస్‌కార్డులు పంపిణీ చేసినట్లు కేంద్ర వైద్యారోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. లోక్‌సభలో తేదెపా ఎంపీలు కేశినేని శివనాథ్, బీకే పార్థసారథిలు అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాత 26 జిల్లాల్లోని గిరిజన ప్రాబల్య ప్రాంతాల్లో 14.79 లక్షల మందిని పరీక్షించి అందులో 4.78 లక్షల మందికి కార్డులు అందించినట్లు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాల 1.70 లక్షల స్టేటస్‌కార్డులు పంపిణీ చేసినట్లు చెప్పారు. సికిల్‌సెల్ డిసీజ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ల కోసం విశాఖ కేజీహెచ్, మంగళగిరి ఎయిమ్స్‌లకు రూ.7.64 కోట్లు కేటాయించి, ఇప్పటివరకూ రూ.7.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. నమో డ్రోన్ దీదీ కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌లోని 108 మహిళా స్వయం సహాయక సంఘాలకు డ్రోన్లు అందజేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. అత్యధిక డ్రోన్లు పొందిన రాష్ట్రాల్లో మూడో స్థానంలో ఏపీ నిలిచినట్లు చెప్పారు. శుక్రవారం లోక్‌సభలో ఈ అంశంపై వివిధ పార్టీల సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 1,094 ఎస్‌హెచ్‌జీలకు డ్రోన్లు పంపిణీచేయగా అందులో కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తొలి మూడు స్థానాలను ఆక్రమించినట్లు చెప్పారు. జనవరి నాటికున్న పరిస్థితుల ప్రకారం రామాయపట్నం పోర్టు మొదటి దశ 76.40 %, మచిలీపట్నం పోర్టు మొదటి దశ 51.20 పూర్తయినట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. ఆయన శుక్రవారం రాజ్యసభలో భారాస సభ్యుడు పార్థసారథి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం రామాయపట్నం పోర్టు మొదటిదశను 2026 నవంబరు నాటికి పూర్తిచేసి 2027 మార్చినాటికి ప్రారంభించినున్నట్లు చెప్పారు. ఈ పోర్టు మొదటిదశ పనులకు తొలుత రూ.4,929.39 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇవ్వగా ఇప్పుడు దాన్ని రూ.5,115 కోట్లకు పెంచినట్లు చెప్పారు. అటవీ భూసేకరణ అనుమతులు, సహాయ, పునరావాసం కోసం అవసరమైన భూసేకరణ చేపట్టడం, తుపాన్లులాంటి కారణాలవల్ల రామాయపట్నం పోర్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురైనట్లు ఏపీ ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ పోర్టు మొదటిదశ పూర్తయితే 34 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర సరకు రవాణాకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మచిలీపట్నం పోర్టులో అయితే 35.12 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర రవాణా చేయొచ్చని చెప్పారు. ఈ రెండు పోర్టులతో ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున ఉపాధి కల్పించడానికి, రాష్ట్రవ్యాప్తంగా సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి వీలవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పెండింగ్ కేసులు 0.47 పెరిగినట్లు కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ తెలిపారు.

# సేవా తీర్థ్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోడీకి అభినందనలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** సేవా తీర్థ్ ప్రారంభోత్స వం సందర్భంగా ప్రధాని మోడీకి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. సేవా తీర్థ్ ప్రారంభోత్స వం సందర్భంగా ప్రధాని మోడీకి అభినందనలు అంటూ "ఎక్స్" వేదికగా చంద్రబాబు ట్వీట్ చేసారు. సేవా తీర్థ్.. దేశ పాలనా వ్యవస్థలో చారిత్రాత్మక మైలురాయి అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆధునిక దేశం నిర్మాణ దిశగా తీసుకున్న దృఢమైన అడుగు ఇది: చంద్రబాబు వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహత్తర సంకల్పానికి బలమైన పునాది అని చంద్రబాబు అన్నారు.

## బాధ్యతాయుత వ్యక్తులుగా
# తీర్చిదిద్దే విద్య

### కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

### కమనీయంగా ఆక్స్‌ఫర్డ్ కిల్కారీ భారత్ పండుగల వేడుక



ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ కిల్కారీ వేడుకల్లో ప్రసంగిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ (నాంపల్లి), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** విద్య విద్యార్థులను నాగరిక బాధ్యతాయుత వ్యక్తిగా తీర్చిదిద్దుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనుల, భూగర్భశాఖల మంత్రి డా. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో కన్నులపండువగా కిల్కారీ అనే రంగుల థీమ్‌తో నిర్వహించిన వార్షికోత్సవ భారత పండుగల ఆనందోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. జి.వివేక్ గౌరవ అతిథులు ఏవీఎస్.శిరీష, కౌసర్ సయిద్, పాఠశాల డీన్ రమాంజుల, డైరెక్టర్ ప్రార్థనా మణికొండ, ప్రిన్సిపాల్ రేఖారావు, ఫాతిమా కాజిమ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి కిల్కారీ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. కిల్కారీ పిల్లల్లో థీమ్ నవ్వులు, అమాయకత్వం, ఆనందాన్ని ప్రతిబింబించి మన సంస్కృతి, సృజనాత్మకతల సమ్మేళనంగా నిలిచిందన్నారు. విద్య విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంచి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా తయారు చేస్తుందన్నారు. అయితే పిల్లల్లో క్రమశిక్షణ చాలా అవసరమని విజయానికి అదే పునాదని, క్రమశిక్షణ లేనిదే జీవితంలో ముందుకుసాగలేరని, తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ 45 సంవత్సరాల విద్యాసేవలను ప్రశంసించారు. కిల్కారీ శీర్షిక కింద భారతీయ పండుగలను ప్రతిబింబింపజేస్తూ వివిధ ఋతువుల్లోని పండుగల నుండి దీపాల వెలుగుల వరకూ చిన్నారుల ప్రతీ నృత్యం ఒక సాంస్కృతిక వేడుకను తలపించింది.



మాజీ సిఎం దామోదరం సంజీవయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపి విహెచ్, చిత్రంలో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** నిజాయితీకి, విలువలకు మారుపేరుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నిలిచారని మాజీ ఎంపి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు అన్నారు. ఆయన జీవితాన్ని నేటితరం ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలని సూచిం చారు. దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా సంజీవయ్య పార్క్‌లోని ఆయన సమాధి వద్ద మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు మోతె రోహిత్ తదితరులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆనాడు కాంగ్రెస్ పార్టీ ఆయనకు అవకాశం కల్పించిందన్నారు. ఎపిలోని కర్నూలులో దామోదరం సంజీవయ్య పుట్టి పెరిగిన చోట స్మృతివనం నిర్మించాలని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విహెచ్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాలకు ఆయన పేరు గుర్తుండిపోయేలా కర్నూల్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో స్మృతివనం కోసం కోటి రూపాయలను పవన్‌కల్యాణ్ ప్రకటించారని.. ఇప్పుడు అధికారంలో కూటమి ప్రభుత్వం ఉన్నందున ఇచ్చిన హామీ మేరకు స్మృతివనం నిర్మించి కర్నూల్ జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని విహెచ్ కోరారు. కాగా, అంతకుముందు అసెంబ్లీ ఎదురుగా ఉన్న సంజీవయ్య విగ్రహానికి విహెచ్ నివాళులర్పించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో 53 శాతం విజయం సాధించిన బిసిలు

### ఇది వారి చైతన్యానికి నాంది: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బిసిలు భారీ సంఖ్యలో విజయం సాధించి రికార్డు సృష్టించారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ప్రభుత్వం చట్టబద్ధంగా 28 స్థానాలు కేటాయిస్తే బిసిలు అదనంగా మరో 25 జనరల్‌స్థానాల్లో పోటీ చేసి మొత్తం 53 శాతం మున్సిపల్ పదవులు సాధించారని ఆయన తెలిపారు. బిసిలకు అన్యాయం చేయాలని అడుగడుగున కుట్రలు చేశారని, కాని బిసిలు ఒక్కటై తిరిగబడి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారని ఆయన చెప్పారు. ఇకముందు జరిగే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు పెంచే వరకు వదిలిపెట్టెది లేదని హెచ్చరించారు. బిసిల రిజర్వేషన్‌లకు సంబంధించిన కేసు హైకోర్టులో కొనసాగుతున్నదని కేసు బలంగా ఉందని గెలుస్తామన్నారు. ఈ దఫా కేసు గెలవడానికి సిఎం సీనియర్ న్యాయవాదులను నియమించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్‌కు ఆదరణ: జావేద్ లతీఫ్



జావేద్ లతీఫ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌ను ఆదరించి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కృతజ్ఞతలు తెలిపింది. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు, కార్పొరేటర్ అభ్య ర్థులతో పాటు అన్ని పార్టీల అభ్యర్థులకు ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జావేద్ లతీఫ్ అభినందనలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని మున్సిపల్ పాలనలో భాగమవుతున్న ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు ఇది గొప్ప బాధ్యత అని గుర్తు చేసారు. దివంగత నేత సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక బాధ్యతతో తమ మున్సిపాలిటీలలో పరిశుభ్రమైన తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థ నిర్వహణ, కాలుష్య నియంత్రణ, వీధిదీపాలు, పేదలకు గృహాలు, మౌళిక వసతులు వంటి స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి ఉత్తమ ప్రజాప్రతి నిధులుగా గుర్తింపు పొందాలని జావేద్ లతీఫ్ ఆకాంక్షించారు.

# క్యాంపు రాజకీయాలకు కాంగ్రెస్ తెర

### బిఆర్ఎస్, స్వతంత్రులను లాక్కునేందుకు ఆఫర్లు
### కాంగ్రెస్.. బిఆర్ఎస్‌తో కార్పొరేషన్ కైవసం దిశగా
### ప్రస్తుత పరిణామాలతో మారుతున్న రాజకీయాలు

**కొత్తగూడెం ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ఎన్నిక మరింత ఉత్కంఠ భరితంగా మారింది. మిత్రులుగా శాసనసభ ఎన్నికల్లో పనిచేసిన కాంగ్రెస్ సిపిఐ మధ్య పొత్తు లేకపోవడంతో పంచాయతీ ఎన్నికల నుండి వేరువేరుగా బరిలో నిలుస్తున్నారు. దీంతో కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో కొట్టడం కార్పొరేషన్ మేయర్ ఏ పార్టీకి పరిస్థితి మరింత ఉత్కంఠ భరితంగా మారింది. దీంతో కచ్చితంగా తాము మేయర్ పదవిని చేజిక్కించుకోవాలని ఉద్దేశంతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు జోరుగా క్యాంపు రాజకీయాలకు జర లేపినట్లు తెలుస్తోంది అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీతోపాటు స్పందన అభ్యర్థులను కూడా తమ వైపు తిప్పుకొని తమ క్యాడర్ను పెంచుకొని ఖచ్చితంగా తొలి మేయర్ స్థానాన్ని అధికార పార్టీ చేజిక్కించుకునేలా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రస్తుత రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**క్యాంపు రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి కొత్తగూడెం కార్పొరేషన్ లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది సిపిఐ కి 22 స్థానాలు కాంగ్రెస్కు 22 స్థానాలు రావడంతో ఈ రెండు పార్టీల మధ్య సరైన సోదర భావం లోపించడంతో ఎవరికివారు మేయర్ స్థానాన్ని కైవసం చేస్తున్నందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. నేపథ్యంలోని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెలియలేరు ఆరు స్థానాల్లో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులతో పాటు నిర్మిస్తానాల్లో గెలిచిన టిఆర్ఎస్ అభ్యర్థులను తమ వైపు తిప్పికొనేందుకు భారీగా ఆఫర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా సరే విశ్వ ప్రయత్నాలు చేసే నా కచ్చితంగా కొత్తగూడెం మేయర్ స్థానాన్ని తామే దక్కించుకోవాలని ఉద్దేశంతో అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రస్తుత పరిణామాలతో మారుతున్న రాజకీయాలు**

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో చోటు చేసుకున్న పరిణామాలతో రాజకీయాలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి శాసనసభ ఎన్నికల్లో పొత్తులతో పనిచేస్తున్న కాంగ్రెస్ సిపిఐలు స్థానిక సంస్థల ఎన్నికల్లో విడిపోయాయి సిపిఐ అడిగినట్లు సీట్లు కేటాయించచపోవడంతో కాంగ్రెస్తో పొత్తు వద్దనుకున్న సిపిఐ ఒంటరిగా బరిలో నిలిచింది కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్కు సీపీఐ కు సమాన స్థానాలు రావడంతో ఈ రెండు పార్టీల మధ్య నువ్వా నేనా అనే వార్ మొదలైంది దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని కార్పొరేషన్ చేసుకునేదిశగా పావులు కదుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు కాంగ్రెస్ విసురుతున్న పాచికల్లో స్వర్ణ అభ్యర్థులు టిఆర్ఎస్ అభ్యర్థులను కైవసం చేసుకుని ఎలాగైనా మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తోంది దీంతో రాజకీయ సమీకరణాల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకుంటారో ఆ నిర్ణయం మేరకే తాము పని చేస్తామంటూ స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్తున్నారు. ఏది ఏమైనా సరే రాష్ట్రంలో అధికారంలో ఉన్న తామే కొత్తగూడం కార్పొరేషన్ మేయర్ స్టానాన్ని దక్కించుకోవాలని ఉద్దేశంతోనే నాయకులు పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది.

## జూనియర్ డాక్టర్ల పెండింగ్ స్టైపెండ్ బకాయిలు విడుదల

### రూ. 19 కోట్లు విడుదల చేసిన సర్కార్
### జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జూనియర్ డాక్టర్ల పెండింగ్ స్టైపెండ్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రూ. 19 కోట్ల స్టైపెండ్ బకాయిలను రాష్ట్ర సర్కార్ విడుదల చేసింది. స్టైపెండ్ బకాయిలను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (టిజెయుడిఎ) కృతజ్ఞతలు తెలిపింది. పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయి లను విడుదల చేసినందుకు జూడా అధ్యక్షుడు డాక్టర్ ఐజాక్ న్యూటన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ అజయ్ కుమార్ గౌడ్, ప్యానెల్ సభ్యులందరూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనరసింహకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. బకాయిలను విడుదల చేయించి నందుకు మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం జూడాలు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

బకాయిల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులకు ప్రస్తుతం పెండింగ్ స్టైపెండ్, బకాయి చెల్లింపులు లేవని ఐజాన్ న్యూటన్ తెలిపారు. జూనియర్ వైద్యుల ప్రయోజనాల కోసం, ప్రజారోగ్య సేవలను బలోపేతం చేయడానికి ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా పనిచేస్తూ, నిరంతర సహకారానికి అసోసియేషన్ కట్టుబడి ఉందని తెలిపారు. బకాయి బిల్లులను శుక్రవారం రాత్రి సమీక్షించి ఆమోదించడంతో శనివారం జూనియర్ డాక్టర్ల ఖాతాలకు వారి సాధారణ స్టైపెండ్‌లతోపాటు జమ చేశారని తెలిపారు. 2023, 2024 పోస్ట్ గ్రాడ్యుయేట్ బ్యాచ్‌లు సహా జూనియర్ డాక్టర్లకు రూ. 19కోట్ల పెండింగ్ బకాయిలు విడుదలైనట్టు తెలిపారు. సీనియర్ రెసిడెంట్లు కూడా వారి గౌరవవేతనాన్ని అందుకున్నారు. జనవరి 2025 నుండి జూన్ 2025 కాలానికి జీవో నం. 90 ప్రకారం స్టైపెండ్ సవరణకు అనుగుణంగా 2019, 2020 బ్యాచ్‌ల నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు, సీనియర్ రెసిడెంట్లు, హౌస్‌సర్జన్లు, సూపర్‌స్పెషాలిటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్లకు బకాయిలు జమ చేయబడ్డాయని ప్రకటించారు. స్టైపెండ్ బకాయిల కోసం జూన్ నుండి అనేకసార్లు జూడా తరపున ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం బకాయిలను విడుదల చేసిందన్నారు. 2021 బ్యాచ్ నుండి ఎండి పూర్తి చేసి ప్రస్తుతం సీనియర్ రెసిడెన్సీలుగా పని చేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు వారి బకాయిలను పొం దారని, ఇటీవల ఎండి పూర్తి చేసి సీనియర్ రెసిడెన్సీలో చేరిన 2022 బ్యాచ్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు కూడా వారి బకాయిలను పొందారన్నారు.



## మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. శివుడు బోధించిన తత్వం–త్యాగం, సహనం, సమతా భావం, సేవతో.. ఆ మహాదేవుని కృపతోమన రాష్ట్రం శాంతి, సౌఖ్యాలతో వికసించాలని, ప్రజల జీవితాల్లో వెలుగు నిండాలని ఆకాంక్షి స్తున్నానని శనివారం ప్రకటనలో తెలిపారు. ఉపవాసాలు, అభిషేకాలు, జాగరణలతో శివ భక్తులు ఈ పవిత్ర రాత్రిని గడుపుతున్న వేళ, ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, ఆర్థిక స్థిరత్వం, మానసిక ప్రశాంతత కలగాలని శివయ్యను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానన్నారు. ప్రత్యేకంగా ధర్మపురి ప్రజలకుశివుని ఆశీర్వాదంతో మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, యువతకు అవకాశాలు, రైతులకు సుభిక్షం లభించాలని కోరుకుంటున్నానని తెలిపారు.

## 17 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

### ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 10వ తరగతి విద్యార్థులకు ఎల్లుండి(మంగళవారం) నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24 వరకు పరీక్షలకు కొనసాగనున్నాయి. మార్చి 14 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగించనున్నారు. ఈ నెల 17న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 19న థర్డ్ లాంగ్వేజ్, 20న గణితం పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 21న ఫిజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, ఈ నెల 23న బయాలాజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 24న సోషల్ స్టడీస్ పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలకు సుమారు 5.06 లక్షల మంది విద్యార్థులు ఫీజును చెల్లించినట్టు అధికారులు తెలిపారు.

## రాష్ట్రంలో రాజకీయ పార్టీల రహస్య ప్రేమికులు ఎవరు?

### వాలంటైన్స్‌డే వేళ బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య మీమ్స్ వీడియోల వార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి14:** మున్సిపల్ ఎన్నికల వేళ విచిత్రమైన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సాధారణంగా వాల్లైన్స్ డే సందర్భంగా లవర్స్ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కానీ శనివారంనాడు తెలంగాణలో మాత్రం రాజకీయ పార్టీలు వాలంటైన్ విషెస్ చెప్పుకున్నాయి. మరో 48 గంటల్లో కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ తరహా పోస్టులు, వీడియోలు సోషల్ మీడియాను ముంచెత్తడం హాట్ టాపిగ్‌గా మారింది. శనివారం ఉదయం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు వాలంటైన్స్ డే శుభాకాంక్షలు అంటూ తన ప్రసంగం ప్రారంభించారు. కరీంనగర్‌లో బిఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లీస్ కలిసి మేయర్ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ సోషల్ మీడియా మరో అడుగు ముందుకేసి కమలం, గులాబీ పువ్వులు లవ్వాడుకుంటున్నట్లు వీడియోను క్రియేట్ చేసి హ్యాపీ వాలంటైన్స్‌డే అంటూ ఓ వీడియోను రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. బిఆర్ఎస్ సోషల్ మీడియా ఏకంగా కాంగ్రెస్, బిజెపి లవర్స్ అంటూ క్రియేట్ చేసే ప్రయత్నం చేసింది. తెలంగాణలో ఎన్నో సంవత్సరాలుగా రహస్య ప్రేమికులుగా ఉంటూ వస్తున్న బిజెపి, కాంగ్రెస్‌లకు వాలంటైన్స్ డే శుబాకాంక్షలు, 6 గ్యారంటీలు అమలు చేయకపోయినా కాంగ్రెస్‌ను బిజెపి ప్రశ్నించదు. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వకపోయినా బిజెపిని కాంగ్రెస్ నిలదీయదు. ఇది కదా అసలైన ఫెవికాల్ బంధం అంటూ రాసుకొచ్చింది.

## 18 నుంచి 20 వరకు నిజామాబాద్‌లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

### మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర మహాసభల గోడపత్రికను సంఘం నేతలు శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 18, 19, 20 తేదీలలో నిజామాబాదు పట్టణంలో జరగనున్నాయని తెలిపారు. విద్యను హక్కుగా సాధించేందుకు, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటాలకు దిశానిర్దేశం చేసే మహాసభలుగా ఇవి నిలవనున్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై చర్చించి, పోరాటాలకు సన్నద్ధమవ్వడానికి, రాష్ట్రంలో పెరుగుతున్న ఫీజులు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, నిరుద్యోగ సమస్య, హాస్టల్ సౌకర్యాల లోపాలు, ప్రభుత్వ విద్యా సంస్థల నిరక్ష్యం వంటి అంశాలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించనున్నట్టు తెలిపారు. విద్యను కార్పొరేట్ల చేతుల్లోకి అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా బలమైన పోరాట కార్యాచరణను ఈ మహాసభలు ప్రకటించనున్నాయన్నారు. 750మంది విద్యార్థి ప్రతినిధులు మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, వంశీ వర్ధన్ రెడ్డి, పవన్, అనిల్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి ఉదయ్, లెనిన్ పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో పాల్గొని ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్

### డిజిపి శివధర్‌రెడ్డి సంతాపం

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లాలో మున్సిపల్ ఎన్ని కల విధుల్లో పాల్గొని తిరిగివస్తున్న కానిస్టేబుల్ మరణించడంపై డిజిపి శివధర్‌రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. నల్లగొండ జిల్లా చందనపల్లి పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ షేక్ తయూబ్ మరణిం చడం తనను కలచి వేసిందని, పోలీసు శాఖ ఒక యువ కానిస్టేబుల్‌ను పోగొట్టుకోవడం బాధగా వుందని డిజిపి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి డిజిపి ప్రగాడ సానుభూతిని తెలిపారు. కానిస్టేబుల్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న బాలగోని బాల్‌రాజ్‌గౌడ్

## బిసిలకు 70 మున్సిపల్ చైర్మన్‌లు, 4 కార్పొరేషన్లకు మేయర్లను నియమించాలి

### బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** బిసిలకు 70 మున్సిపల్ చైర్మన్‌లు, 4 కార్పొరేషన్‌లకు మేయర్లుగా నియమించాలని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అగ్రవర్ణ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి బిసిలకు మోసం చేశాయని ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ బిసిల ద్రోహి పార్టీ అని ధ్వజమెత్తారు. బిసిలకు కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తే ఆ రిజర్వేషన్‌లు దక్కనీయకుండా బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోర్టుకు వెళ్లి బిసిలను అవమానించారని ఆరోపించారు. తమకు హక్కులను కాదంటే పోరాడతామని, ఇది ప్రజాస్వామ్య డిమాండ్ అన్నారు. మూడు పార్టీలు ఒక్కటై బిసిలను అణిచివేసేందుకు కుట్ర పన్నాయని, భవిష్యత్‌లో ఆ పార్టీలకు రాజకీయ మనుగడ లేకుండా చేస్తామన్నారు. మున్సి పల్ ఎన్నికల్లో బిసిలు 57 శాతం విజయంతో తమ రాజకీయ శక్తిని నిరూపించారని చెప్పారు. సమావేశంలో ఫ్రంట్ నాయకులు అంబాల నారాయణగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, బైరీ శేఖర్, నాగభూషణం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి, భయంతో ఐఐటి విద్యార్థుల ఆత్మహత్యలు

### ఐదేళ్లలో ఆత్మహత్యకు పాల్పడిన 65 మంది
### రెండేళ్లలోనే 28 మంది మృతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** విద్యార్థులు వార్షిక పరీక్షలు, పోటీ పరీక్షలతోపాటు ఉన్నత చదువులను చదవలేక ఒత్తిడి, భయంతో ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు ఎస్ఎస్‌సి నుంచి మొదలుకొంటునే ఇంజనీరింగ్, మెడిసిన్, ఐఐటీ వరకు ఉంటున్నాయి. ఈ మధ్య కాలంలో వైద్య విద్య, ఐఐటీల్లో చేరిన విద్యార్థులు పరీక్షల భయంతో, విద్యను కొనసాగించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు పెరుగుతున్నాయి. గత ఐదేళ్లల్లో కేవలం ఐఐటీల్లోని విద్యార్థులే 65 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వాటిల్లో గత రెండేళ్లల్లోనే 28 మంది మరణించడం మరీ ఆందోళనకలిగిస్తుంది. తమ పిల్లలు ఐఐటీ, మెడిసిన్ వంటి ఉన్నత విద్యలో చేరారు.. తమ పేరుతెచ్చిపెడతారని తల్లిదండ్రులు భావిస్తుంటే.. ఉన్నత విద్యలో చేరిన విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేకపోవడంతోపాటు ఇతర కారణాల రీత్యా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఐఐటీలు, మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం అటు తల్లిదండ్రుతోపాటు ప్రభుత్వాలను కలవరపెడుతున్నాయి. ఇంజనీరింగ్ విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఐఐటీకాన్పూర్‌లో ఎర్త్ సైన్సెస్ విభాగానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విద్యాసంస్థలో రెండేళ్ల కాలంలో 8వ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం కలవరానికి గురి చేస్తుంది.

దేశ వ్యాప్తంగా 2021 జనవరి నుంచి 2025 డిసెంబరు వరకు ఐదేళ్ల కాలంలో ఐఐటీల్లో ఏకంగా 65 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని గ్లోబల్ ఐఐటీ అలుమ్నీ సపోర్ట్ గ్రూప్ ప్రకటించింది. గత రెండేళ్లలోనే 28 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు రికార్డయిందని వెల్లడించింది. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో అండర్ గ్రాడ్యుయేట్(యుజి) విద్యార్థులతోపాటు పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ), పీహెచ్‌డి విద్యార్థులు కూడా ఉన్నారని ప్రకటించింది. విద్యార్థుల మరణాలకు వ్యక్తిగత సమస్యలు, చదువుల ఒత్తిడే కారణమని అధికారులు చెబుతుండగా.... విద్యార్థి సంఘాలు, ఐఐటీ పూర్వ విద్యార్థుల సంఘాలు మాత్రం అవే కారణాలు కావని ఇతర కారణాలు కూడా ఉన్నాయని వాదిస్తున్నాయి.

విద్యార్థుల ఆత్మ హత్యలకు ఉన్నత విద్యాసంస్థలు అవలంబిస్తున్న కఠిన మూల్యాంకన వ్యవస్థలు, తీవ్ర పోటీ, సామాజిక ఒంటరితనంతో పాటు కొన్ని సందర్భాల్లో కులం, భాష ఆధారంగా చూపే వివక్ష కూడా ఆత్మహత్యలకు కారణమవుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఐఐటీ, మెడిసిన్ చదివే విద్యార్థులే కాకుండా సాధారణంగా ఆత్మహత్యలకు పాల్పడే వారి మానసిక సమస్య లు పరిష్కరిస్తే కొంతమేరకు ఆత్మహత్యలను నివారించడానికి అవకాశం ఉంటుందని మానసిక వ్యాధి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం, ర్యాంకులు, మార్కులను ప్రోత్సహించకుండా ఉండేలాగా విధానాలు రూపొందిస్తే మరిన్ని ఆత్మహత్యలను నివారించడానికి అవకాశాలుంటాయని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

## మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో సామాజిక న్యాయం పాటించాలి

### కౌన్సిలర్‌గా బిసిలైతే.. చైర్మన్‌లుగా అగ్రకులాలకు ఇస్తే ఊరుకోం : బిసి జెఎసి చైర్మన్ జాజుల

**హైదరాబాద్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** రాష్ట్రంలో 16న జరగనున్న 116 మునిపల్ చైర్మన్‌లు, ఏడు కార్పొరేషన్ మేయర్ ఎన్నికలలో అన్ని పార్టీలు బీసీలకు జనాభా దామాషా ప్రకారం చైర్మన్‌లుగా అవకాశం కల్పించి సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బీసీలు పోటీచేసి మొత్తంగా 60 శాతం మంది కౌన్సిలర్లుగా విజయం సాధించారని ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ 85 మున్సిపాలిటీలలో, బిఆర్ఎస్ పార్టీ 15 మున్సిపాలిటీలలో, బిజెపి 2, ఎంఐఎం ఒకటి అందులో 14 విజయం సాధించారని, కాంగ్రెస్ బీసీలకు 60 మున్సిపల్ చైర్మన్‌లుగా, బిఆర్ఎస్ 10 చైర్మన్లుగా, బీసీలకు అవకాశం కల్పించాలని అలాగే 7 మేయర్ ఎంపికలలో బీసీలకు నాలుగు మేయర్ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా ప్రకారం మేయర్‌లుగా, మున్సిపల్ చైర్మన్‌లుగా, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ ఉన్నచోట బీసీలకు వైస్‌చైర్మన్, డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకొని సామాజిక న్యాయం పాటించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఉపవాసం చేసే విధానం..

మహాశివరాత్రి రోజున చాలామంది భక్తులు నిర్జల ఉపవాసం, ఫలాహారం ఉపవాసం, లేదా ఒకపూట భోజనం విధానాల్లో వ్రతం చేస్తారు. శివరాత్రి రోజున పండ్లు తినడం అంటే ఉపవాస నియమాన్ని ఉల్లంఘించడం కాదు. ఇది: శరీరానికి తేలికైన ఆహారం ఇవ్వడం. మనస్సు ధ్యానంలో నిలుపుకోవడం, శివతత్త్వంపై ఆలోచన చేయడం. ఈ రోజున ముఖ్యంగా జాగరణ, జపం, ధ్యానం ముఖ్య మైనవి. సులభంగా జీర్ణమయ్యే పండ్లు తీసుకోవాలి:అరటి పండు,ఆపిల్ సపోటా దానిమ్మ, కొబ్బరి నీరు ఎక్కువగా తినకుండా, తక్కువ మోతాదులో తీసుకోవాలి. పాలు, మజ్జిగ, తేనె కలిపిన గోరువెచ్చని నీరు, పంచామృతం తీసుకోవచ్చు.

శివరాత్రి మరుసటి రోజు .. మహాశివరాత్రి రోజున చాలామంది భక్తులు ఉపవాసం (వ్రతం) చేస్తారు. ఉపవాసాన్ని సరైన విధంగా ముగించడం (పారణ) కూడా అంతే ముఖ్యమైనది. శివరాత్రి రాత్రంతా జాగరణ చేసి, మరుసటి రోజు ఉదయం బ్రహ్మ ముహూర్తం తర్వాత లేదా చతుర్దశి తిథి ముగిసిన తరువాత, పంచాంగం ప్రకారం శుభ సమయాన్ని చూసి ఉపవాసం వదలాలి. ఉపవాసం తర్వాత ఒక్కసారిగా గట్టిగా తినకూడదు. మొదట: గోరువెచ్చని నీరు లేదా పాలుపండ్లు (బనానా, ఆపిల్ వంటి సులభంగా జీర్ణమయ్యేవి)తర్వాత అన్నం, సాధారణ సాత్వికాహారం ఉల్లిపాయ, వెల్లుల్లి లేని వంటకాలు తీసుకోవడం మంచిది.

పూర్తిగా నిరాహార దీక్ష చేస్తే, ఉపవాసం తర్వాత తేలికపాటి ఆహారం తీసుకోండి. మధుమేహం, బీపీ ఉన్నవారు వైద్యుల సలహాతో ఉపవాసం చేయాలి. అస్వస్థతగా అనిపిస్తే వెంటనే ఉపవాసం విరమించాలి. శివరాత్రి ఉపవాసం శరీర శుద్ధి మాత్రమే కాదు, మనస్సు, ఆత్మశుద్ధి కోసం కూడా.

భక్తి, నియమం, ధ్యానం ద్వారా శివుని అనుగ్రహం పొందడమే దీని ముఖ్య ఉద్దేశం. ◆

# చిలకడ దుంప హల్వా

**శివరాత్రి ఫలహారం కోసం చిలకడ దుంప(రత్నపురిగడ్డ)తో సులభమైన తీపి వంటకం**

చిలకడదుంపలను ఉడకబెట్టి, తొక్క తీసి, ముక్కలుగా చేసి, బెల్లంపాకం, యాలకుల పొడి, నెయ్యితో కలిపి చిలకడదుంప హల్వా లేదా బెల్లం అపానపలు చేసుకోవచ్చు. ఇవి శీఘ్ర శక్తిని ఇస్తాయి.

చిలకడదుంప స్వీట్/హల్వా

**తయారు చేసే విధానం**

కావలసిన పదార్థాలు

చిలకడదుంపలు-2; బెల్లం:1/2 కప్పు; నెయ్యి-2 టేబుల్ స్పూన్లు; యాలకుడి పొడి-కొద్దిగా.

తయారు చేసే విధానం

చిలకడదుంపలను బాగా కడిగి, ప్రెషర్ కుక్కర్‌లో మెత్తగా ఉడకబెట్టాలి. ఉడికిన దుంపల తొక్కతీసి, ముక్కలు చేసుకోవాలి లేదా



మెత్తగా మ్యాష్ చేసుకోవాలి. పాన్‌లో నెయ్యివేసి, మెత్తగా చేసిన దుంపలను రెండు నిమిషాలు వేయించాలి. తురిమిన బెల్లం వేసి కరిగి దుంపలకు పట్టే వరకు మంటపై ఉడికించాలి. చివరగా యాలకుడి పొడి చల్లుకుంటే రుచికరమైన హల్వా సిద్ధం. ✦

# మహాశివరాత్రి మహాత్యం

శివరాత్రినాడు అర్ధరాత్రి సమయంలో లింగరూపంలో ఆవిర్భవించిన శివుని దివ్య రూపం కోటి కాంతులతో ప్రజ్వప్రజ్వరిల్లు తుం ది. లింగోద్భవం సమయంలో శివారాధనకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరిగింది. శుభకరమైన శివరాత్రి రోజున శివపార్వతులు కైలాసంలో ఆనంద తాండవం చేసే శుభ సమయాన కోరిన కో రికలు నెరవేరతాయని భక్తులు నమ్ముతారు. ఈ రోజున పవిత్ర స్నానాలు, అభిషేకాలు, ఉపవాసం ఉంటూ జాగారం చేస్తే ఆ పరమేశ్వరుని అనుగ్రహం కలుగుతుందని భక్తుల నమ్మకం. శివరాత్రి రోజున అనుక్షణం 'ఓం నమశ్శివాయ' అనే శివపంచాక్షరి మంత్రాన్ని పటిస్తూ, మనసును పవిత్రంగా ప్రశాంప్రశాంతంగా ఉంచుకోవాలి. 'ఓం నమశ్శివాయ' ఈ పంచాక్షరీ మంత్రం పరబ్రహ్మబ్రహ్మమయం . ఈ మంత్ర మహిమ గురించి ఈశ్వరుడే స్వయంగా చెప్పాడని మన పురాణాలు చెబుతున్నాయి. ఈ మంత్రం పలికినవారికి ఎంత ఫలం కలుగుతుందో, విన్న వారికి కూడా అంతే ఫలితం కలుగుతుందని, తెలిసీతెలియక చేసిన పాపాలు, దోషాలు తొలగిపోయి సుఖాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.





పార్వ తీదేవి స్వేదం నుండి వుద్భవించిన బిల్వ వృక్షాలు శివునికి ఎంతో ప్రీతికరమైనవి. అను గ్రహగ్ర ప్రదాప్రదాత, మం గళ స్వరూపుడయిన పరమేశ్వరుడులో పురుషుడి శక్తి సగం, అయన సతీమణి పార్వతీదేవి స్త్రీ శక్తి సగం సమ్మేళతంగా ఉంటుంది. సమస్త చరాచర ప్రపంప్రపంచం శక్తిరూపంతోనే ఏర్పడింది కాబట్టి, శక్తి రూ పం లేకుండా శివుడు ఏమీ చేయలేడు. అందుకే స్త్రీ పురుషుడు కలిసి ఒకే రూపంగా ఏర్పడితేనే ఎదైనా సా ధ్య మవుతుందనే విషయాన్ని మనకు తెలియచేయడానికి శివుడు అర్ధనారీశ్వర రూపాన్ని ధరించాడు. ఒకరు ఎక్కు వ, మరొకరు తక్కువ కాదని స్త్రీ, పురుషులిద్దరూ సమా నమేనని తెలియజెప్పాడు. ఈ పర్వదినాన పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణం జరిపించడం ఆచారం. శివార్చన, ఉపవాసం, జాగారం శివరాత్రినాడు చేయాల్సి న ముఖ్యమైన మూడు విధులు. భక్తి శ్రద్ధశ్రద్ధలతో నిర్మలమైన మనస్సుతో శివతత్వా న్ని అర్థం చేసుకొంటే మనిషిలో మా నవత్వం పరిమళిస్తుంది. ఈ శివరాత్రి పర్వ దినాన ప్రజప్రలందరికి పరమేశ్వరుడు అనుగ్రహంగ్ర హం లభించాలని కోరుకుందాం .

**శివనామం**

రామకోటి కోటిసార్లు శ్రీరామ అని రాస్తే ఎంతో పుణ్యమని, మోక్షం లభిస్తుందని విష్ణు భక్తులు, శివకేశవులను సమానంగా చూసేవారు నమ్ముతారు. శైవులు కైవల్యాన్ని పొందడానికి రామకోటికి బదులుగా శివకోటిని రాస్తారు. రామనామం తరిం పజేసేదని, కాశీలో మరణించే వారి చెవిలో శివుడు ఆ తారక మంత్రాన్ని వినిపిస్తాడని చెబుతూ ఉంటారు. ఆ రామనామానికి ఎటువంటి శక్తి ఉందో శివ నామానికి కూ డా అంత మహిమ ఉందంటారు. శివనామం అంటే ఒక్క"శివ అనే నామం ఒక్కటే కాదు. శివునికి చాలా నామా లున్నాయి. వాటిల్లో దేనిని ఉచ్చరించినా పాపాలు నశిస్తా యని చెబుతారు. సామాన్య పాపాలేకాదు మహాపాపాలు కూడా నశిస్తాయంటారు. శివనామ మహిమ అంత గొప్ప ది. నిశ్చలమైన మనస్సుతో దేవదేవుడైన పరమేశ్వరుడిని స్తుతిస్తూ, స్మరించే వారికి ఎలాంటి ఆపదలు రావని, తన భక్తుల రక్షణ ఆయనే చూసుకుం టాడని భక్తుల విశ్వాసం.

- కాయల నాగేంద్ర

# జ్యోతిర్లింగాల్లో శ్రీశైలం విశిష్టత

తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ శైవక్షేత్రాల్లో నంద్యాల జిల్లాలోని శ్రీశైలం క్షేత్రం పరమపవిత్రంగా భావిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల కొండల మధ్య ఉన్న ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ఇక్కడ శివుడు మల్లికార్జునుడిగా, పార్వతి దేవి భ్రమరాంబికగా పూజలందుకుంటారు, ఇది 12 జ్యోతిర్లింగాలలో ఒకటి, 18 శక్తిపీఠాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది, దక్షి ణ కాశీగా పిలువబడే ఈ క్షేత్రం, నదీ తీరంలో, పులి సంరక్షణ కేంద్రంలో ఉంది, ఇక్కడ శ్రీశైల డ్యామ్, పాతాళగంగ, అక్కమహాదేవి గుహలు వంటివి ప్రధాన ఆకర్షణలు, భక్తులకు ఇక్కడ స్పర్శ దర్శనం లభిస్తుంది. శ్రీరాముడు, ఆదిశంకరాచార్యులు సందర్శించిన క్షేత్రం, నరసింహ సరస్వతీ స్వామివారు ఇక్కడ అవతారాన్ని ముగించారు.



నల్లమల కొండలలో, కృష్ణా నది ఒడ్డున పులుల సంరక్షణ కేంద్రం మధ్యలో ఉంది. కృష్ణా నదిపై నిర్మించిన పెద్ద డ్యామ్ శ్రీశైలం ప్రాజెక్ట్, పాతాళగంగ, అక్కమహాదేవి గుహలు, సాక్షి గణపతి వంటివి భక్తులకు కనువిందు కలిగిస్తాయి. ప్రస్తుతం శివరాత్రి ఉత్సవాలు జరుగుతుండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటారు. కనుచూపుమేరలో ఎక్కడ చూసినా మల్లయ్య నామస్మరణమే ప్రజ్వరిల్లుతుంది. హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తజనం సాగి వస్తుంది. అష్టాదశ శక్తి పీఠం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు సాంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. ప్రతిరోజు శ్రీ స్వామి అమ్మవార్లకు శాస్త్రంగా పూజలు నిర్వహించడం జరుగుతుంది. అదేవిధంగా వాహన సేవలలో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్లకు పుష్పాలతో ముస్తాబు చేసి ఆలయం వెలుపలకు తోడుకొని వచ్చి అంగరంగ వైభవంగా భక్త జన సందోహం నడుమ గ్రామోత్సవం జరపడం జరుగుతుంది.శ్రీ స్వామి అమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేస్తారు. మల్లన్న క్షేత్రం విద్యుత్ కాంతుల నడుమ శోభాయమానంగా ఉంది. శ్రీశైల క్షేత్రంలో యాగశాల ప్రవేశం చేసి రాత్రి వేళలో బేరీ పూజ, బేరీ తండానం, సకల దేవతా ఆహ్వాన పూర్వక ధ్వజారోహణ ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవలతో బ్రహ్మోత్సవాలు ముగియడం జరుగుతుంది. ఇలా కైలాసమైన శ్రీగిరి క్షేత్రం నడకదారి మార్గాలన్నీ భక్తుల కోలాహలంతో కనువిందు చేస్తాయి. ఈ నడక దారులు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు వైద్య శిబిరాలు, ఉచిత మంచినీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తాయి. భక్తులు నట్టడివి మెట్ల మార్గాన మల్లన్నను స్మరించుకుంటూ కైలాస ద్వారం వద్దకు చేరుకుంటారు. భక్తాదులకు సకల సౌకర్యాలను ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కల్పించడానికి దేవస్థానం అన్ని చర్యలు తీసుకుంది.

శివమాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకొని ఇరుముడిని సమర్పిస్తున్నారు. శివ స్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తూ ఉండడం జరుగుతుంది. ఈ క్రమంలోనే మరికొందరు భక్తులు పాతాళ గంగకు చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులను తీర్చుకుంటారు. దర్శనం క్యూలైన్‌లన్నీ భక్త జనసంద్రముతో కీటకిటలాడుతాయి. భక్తుల సౌకర్యార్థం క్షేత్రంలో ఉచితంగా బస్సులు ఉంటాయి. ప్రతిరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం నిర్వహిస్తుంది. ●

# అరవొద్దు.. అలగొద్దు..

పిల్లల మీద అజమాయిషీ చెల్లాయించాలనుకోవడం, తాము చెప్పింది చెప్పినట్లుగా చేయాలనుకోవడం కరెక్ట్ కాదు. ప్రస్తుతమున్న జీవనశైలిలో పిల్లలపై అరిచినా, కేకలు వేసినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇప్పటి తల్లిదండ్రులకు పిల్లల పెంపకం రేసులా మారింది. దీనికి కారణాలు చాలానే ఉన్నాయి. తమ పిల్లలు అందరికన్నా తెలివిగా ఉండాలని, సూపర్‌కిడ్‌గా ఎదగాలనే తాపత్రయంతో పేరెంటింగ్ పట్టాలు తప్పుతున్నది. ఈ క్రమంలో ప్రతి ఇంట్లోనూ అరిచే తల్లిదండ్రులు, అలిగే పిల్లలు కనిపిస్తున్నారు. ఈ తరహా పేరెంటింగ్ వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతుందని నిపుణుల మాట. దీనికి పరిష్కారమే 'మైండ్‌ఫుల్ పేరెంటింగ్'. ఈ విధానం ఒత్తిడిని దూరం చేసి, ప్రశాంతతను, అనుబంధాన్ని పెంచుతుంది. ఉన్నది ఉన్నట్టుగానే స్వీకరించడం అలవాటు చేయడమే ఇందులోని కిటుకు.



పిల్లలతో మాట్లాడే టప్పుడు, ఆడుకునేటప్పుడు పూర్తిగా అక్కడే ఉండటం, అంటే వారితో సింక్ అయిపోవాలి. ప్రతి చిన్న విషయానికీ జడ్జ్ చేయకుండా, వారి భావాలను అర్థం చేసుకోవడమే మైండ్ ఫుల్ పేరెంటింగ్. దీంతో పిల్లలు చెప్ప కుండానే తల్లిదండ్రుల దారిలోకి వస్తారు. పేరెంట్స్ కూడా ప్రశాంతంగా ఉంటారు. హోంవర్క్ విషయంలో కాని, తినడం విషయంలో కాని పడుకోవడం విషయంలో ఇలా ఏ విషయంలోనైనా పిల్లలను గట్టిగా అనడం తగ్గించుకోవాలి. చెప్పే పదతిలో చెబితేనే ఫలితం ఉంటుందని గ్రహించాలి. ◻

**చెలి చిట్కా**

జీలకర్ర, సోంపు, ధనియాలు సమపాళ్లలో కలిపి దోరగా వేయించి మెత్తగా పొడి చేసుకోవాలి. చిటికెడంత పొడిని భోజనం చేసిన తరువాత తీసుకుని నీళ్లు తాగితే గ్యాస్ సమస్య ఉండదు. ఉపవాసం ఉన్న వాళ్లు భోజనం చేసిన తరువాత ఈ విధంగా చేస్తే ఉబ్బరంగా అనిపించదు.

# 'ఏమో ఏమో ఇది' ఆకట్టుకుంటున్న గ్లింప్స్



**రోషన్** మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ సినిమా టైటిల్, గ్లింప్స్ విడుదల దర్శకుడు డా. శైలేష్ కొలను, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ సరికొత్త రొమాంటిక్ కామెడీ సినిమా కోసం చేతులు కలిపారు. రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను ఆవిష్కరించారు."ఏమో ఏమో ఇది" అనే టైటిల్ వినగానే ఉల్లాసమైన ప్రేమ భావనలు మనసులో మెదులుతున్నాయి. చిత్ర ప్రకటన సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్ తల్లి-కొడుకుల మధ్య సరదా సంభాషణ తో ప్రారంభమవుతుంది. గ్లింప్స్‌లో కథానాయిక తన ప్లేలిస్ట్‌లోని అలనాటి క్లాసిక్ పాటను ఆస్వాదిస్తూ కనిపిస్తుంది. ఆ సన్నివేశం ద్వారా ఆమె లోతైన భావోద్వేగ అనుబంధాన్ని, ప్రేమను ఎంతో అందంగా ఆవిష్కరించారు. బ్లాక్‌బస్టర్ హిట్ యూనివర్స్‌తో గుర్తింపు పొందిన దర్శకుడు శైలేష్ కొలను, ఏమో ఏమో ఇది ద్వారా పూర్తిగా కొత్త జానర్‌లో అడుగుపెడుతున్నారు. అభయ్ పాత్రలో రోషన్ మేకా నటిస్తున్నారు. తొలి చిత్రం 'పెళ్లి సందడి' ద్వారా ఆకట్టుకున్న ఆయన, ఇటీవల 'ఛాంపియన్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఈ 'ఏమో ఏమో ఇది' చిత్రంలో నేటిజెన్ తరం ప్రేమను ఆవిష్కరించే పక్కింటి అబ్బాయి తరహా ఆకర్షణీయమైన పాత్రలో రోషన్ కనిపించనున్నారు. అపూర్వ పాత్రలో ప్రీతి ముకుందన్ కనిపించనున్నారు. గ్లింప్స్‌లోనే ఆమె ఉత్సాహభరితమైన స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అపూర్వ పాత్రలో సరికొత్తగా కనిపిస్తూ తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండటం అదనపు ఆకర్షణ. అలాగే ఛాయాగ్రాహకుడు వంశీ పచ్చిపులుసు అందించిన అందమైన, హాయిగా కనిపించే విజువల్స్.. ఆహ్లాదకరమైన ప్రేమ వాతావరణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఈ సినిమా రూపొందు తోంది.

# 'హే భగవాన్' హృదయానికి హత్తుకుంటుంది

## -ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి



హేభగవాన్ ఎలాంటి సినిమా?ఖచ్చితంగా ఆయన కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్‌గానిలుస్తుంది. ఈసినిమా ఆయన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. హేభగవాన్.. ఎంటర్‌టైన్‌మెంట్ సినిమా.. స్టోరీ లెవల్ నుంచి ఈ ప్రాజెక్టులో ఉన్నాను. ప్రజెంటర్‌గా ఉన్నాను. ఈ సినిమా పాయింట్‌లో ఫన్ ఉంటుంది.

**ట్రైలర్, టీజర్‌లో బిజినెస్ అంటూ ఓ ఆసక్తికరమైన టాపిక్ పెట్టారు ఎందుకని?**

ఆసక్తి, బజ్ పెంచడానికి అలా పెట్టాం. అయితే ఆ బిజినెస్ ఏమిటనేది ఎవరూ ఊహించలేకపోతున్నారు.

**హేభగవాన్ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

సినిమాలో ఫాదర్‌పాత్రపేరు భగవాన్ అందుకే హేభగవాన్..టైటిల్‌పెట్టాం.

**సుహాస్‌కు ఈ సినిమా ఎంత వరకు ప్లస్ అవుతుంది?**

కొంతకాలంనుంచి సుహాస్ ఎదురుచూస్తున్న కమర్షియల్ సక్సెస్ ఈసినిమాతో సాధించబోతున్నాడు. సత్యదేవ్‌తో,శ్రీవిష్ణుతో కూడా సినిమాలు ఉన్నాయి.

**మీరు సినిమాలను మంచి బజ్ తీసుకొచ్చి విడుదల చేస్తున్నారు? మీరు పట్టిందల్లా బంగారం అవుతుంది? ప్రొడ్యూసర్‌గా మీ స్ట్రాటజీ ఏమిటి?**

మోర్‌దెన్ ప్రాపర్‌గా క్రియేటివ్ స్ట్రాటజీస్ట్‌గా అనేది కరెక్ట్ పదం. అన్నీ దగ్గరుండి అన్నీ చూసుకుంటాను. దర్శకుడికి ఎక్కడైనా అనిపించిన దగ్గర సలహా ఇస్తాం. వాళ్లు ఒకే అంటేనే మార్పులు చేశాం. దర్శకుడు హ్యాపీ అయితే సినిమా బాగుంటుందనేది నా నమ్మకం. మొత్తం వాళ్ల అనుమతి మేరకే జరుగుతుంది.

**మీరు చెప్పిన మార్పులకు దర్శకులు ఎలా కన్విన్స్ అవుతున్నారు?**

క్రియేటివి ఫ్రీడమ్ దర్శకులకే. కన్విన్సింగ్‌గా చెప్పినట్లయితే వాళ్లు కూడా ఒప్పుకుంటారు. లేదా మాకు ముందు ఉన్న సక్సెస్‌లను కావొచ్చు. అయితే దర్శకుడికే పూర్తి ఫ్రీడమ్ ఇవ్వాలి. కంటెంట్‌లో బలం ఉంటేనే మనం కూడా ఏమైనా చేయగలం.

**ఇప్పుడు చిన్న సినిమాల నిర్మాణం బాగా తగ్గిందనుకోవచ్చా?**

లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయ్ తరువాత చిన్న సినిమాలు పెరిగాయి. ఇటీవల ఛాంబర్‌లో ఒక నెలలోనే 300 సినిమాల టైటిల్స్ రిజిష్టర్ అయ్యాయి. ఓటీటీ బిజినెస్‌లు కావడం లేదని ఓ క్లారిటీ వచ్చింది. అయితే కేవలం ఓటీటీ కోసం కూడా చేసే సినిమాలు పెరిగాయి.

**మీరు భవిష్యత్‌లో దర్శకత్వం చేస్తారా?**

దర్శకత్వంచేయను. నిర్మాతగా మంచి చిత్రాలు అందించాలనేది నా లక్ష్యం.

**బన్నీ వాసు గారితో మీ అనుబంధం?**

బన్నీ వాసుగారు నాకు బ్రదర్‌లాంటి వాడు. ఆయనతో మొదట్నుంచీ కలిసి ట్రావెల్ అవుతున్నాం. ఆయన ఒకే చేసిన నేను ఒకే చేసినట్లే..

**శివాజీ సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని థియేటర్‌లో విడుదల చేస్తున్నారా?**

మార్చి 6న ఆ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ చిత్రానికి సంబంధించి డిస్ట్రిబ్యూటర్‌గా సినిమాను విడుదల చేస్తున్నాను.

# తెర



## 'విష్ణు విన్యాసం' నుంచి 'మొదలే మొదలే' సాంగ్ రిలీజ్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు విష్ణు విన్యాసం అనే యూనిక్ ప్రాజెక్ట్‌తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు యదునాథ్ మారుతి రావు ఈ చిత్రానికి దర్శకత్వం. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు నిర్మించిన ఈ చిత్రాన్ని హేమ, షాలిని సమర్పిస్తున్నారు, సుబ్రహ్మణ్యం నాయుడు జి, రామచారి ఎం సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ దేఖో విష్ణు విన్యాసంకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ సెకండ్ సింగిల్ మొదలే మొదలే సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు రధన్ ఈ సాంగ్ ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యం లవ్ ఫీలింగ్‌ని అందంగా ప్రజెంట్ చేసింది. మధుశ్రీ, నరేశ్ అయ్యర్ వోకల్స్ మరింత మెలోడీని యాడ్ చేశాయి. ఈ సాంగ్‌లో శ్రీవిష్ణు, నయన సారిక కెమిస్ట్రీ లవ్లీగా ఆకట్టుకుంది. వాలెంటైన్‌డేకి పర్ఫెక్ట్‌గా నిలిచే ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా అలరిస్తోంది. ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, సతనయం రాజేష్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'అమరావతికి ఆహ్వానం' సక్సెస్ సెలబ్రేషన్స్

శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రల్లో నటించిన 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి13న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రాన్ని డైరెక్టర్ జీవీకే తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించారు. 'అమరావతికి ఆహ్వానం'కు ప్రేక్షకుల నుంచి సూపర్ హిట్ టాక్ వస్తున్న నేపథ్యంలో ఈ సినిమా సక్సెస్ మీట్‌ను



మూవీ టీమ్ కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంతోషంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరోయిన్ ఎస్తేర్ మాట్లాడుతూ మా అమరావతికి ఆహ్వానం సినిమా గురించి ఇన్ని రోజులు మేము చెబుతూ వచ్చాం. ఈరోజు మా సినిమా రిలీజైంది. ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమా చూశాం. చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. హీరోయిన్ ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమాకు ప్రతి ఒక్కరూ తమ పూర్తి ఎఫర్ట్స్ పెట్టారు. సినిమాలో నేను చాలా బాగా కనిపించానంటూ ప్రశంసలు వస్తున్నాయి. డైరెక్టర్ జీవీకే మాట్లాడుతూ మా 'అమరావతికి ఆహ్వానం' సినిమాకు ప్రతి ఒక్కరి దగ్గర నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. మేము ఊహించినదాని కంటే బాగా రెస్పాన్స్ ఉంది. మా మూవీని సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. హీరో శివ కంఠంనేని మాట్లాడుతూ సినిమాకు వస్తున్న రెస్పాన్స్ తో మేమంతా పాజిటివ్ వైబ్‌లో ఉన్నాం. ఈ వైబ్ ఇలాగే కొనసాగాలి. అన్ని సెంటర్స్ నుంచి మంచి ఫీడ్ బ్యాక్ ఉంది.

# 'సోల్ ట్రిప్' టాక్ షో పెద్ద సక్సెస్ అవ్వాలి:

## -ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీకాంత్

రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పి.యు.ఎన్.వర్మ సమర్పణలో గండభేరుండ ఆర్ట్స్ బ్యానర్ మీద విజయ్ దాట్ల తెరకెక్కించిన ట్రావెల్ అడ్వెంచరస్ టాక్ షో"సోల్ ట్రిప్". త్వరలోనే ఈ టాక్ షో మొదటి సీజన్ స్ట్రీమింగ్ కాబోతోంది. జగపతి బాబు, శ్రీకాంత్, కమెడియన్ అలీ వంటి ఆర్టిస్టులని ప్రకృతితో మమేకం చేస్తూ విజయ్ దాట్ల ప్రత్యేకంగా ముచ్చట్లు పెట్టారు. ఈ ఇంటర్వ్యూలకు సంబంధించిన ఆరు ఎపిసోడ్స్‌ని ప్రస్తుతం ఫినిష్ చేశారు. ఈ క్రమంలో 'సోల్ ట్రిప్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. నాకు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. నాకు ఎప్పుడు టైం



దొరికినా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి ట్రిప్‌కు వెళ్తుంటాను. వేరే ఊరికి వెళ్లి అక్కడి కల్చర్‌కు తగ్గట్టుగా బతకడం అనే ఈ కాన్సెప్ట్ నాకు చాలా నచ్చింది. శ్యామలా దేవీ మాట్లాడుతూ.. 'సోల్ ట్రిప్' నాకు ఎంతో సహజంగా అనిపించింది. నటుడు అలీ మాట్లాడుతూ.. 'సోల్ ట్రిప్' కోసం విజయ్ మీద నిర్మాతలు చాలా నమ్మకంతో ఉన్నారు. విజయ్ దాట్ల మాట్లాడుతూ.. "మనం ప్రకృతితో మమేకం అయినప్పుడు ఎంతో నేర్చుకుంటాం. సతీష్ వేగేశ్న మాట్లాడుతూ.. ప్రకృతిలో ఇంటర్వ్యూ చేయడం, ప్రకృతితో మమేకం అయ్యే ఇలాంటి కాన్సెప్ట్‌ను తీసుకు వచ్చిన విజయ్‌కి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. పి.యు.ఎన్.వర్మ మాట్లాడుతూ.."సోల్ ట్రిప్" అనే పేరులోనే ఓ వైబ్ ఉంది. పాటలు, ట్రైలర్ చూసిన తరువాత అందరూ ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు.

ఆట




## సచిన్ శివతాండవం

*2003 వన్డే ప్రపంచకప్*
*సరిగ్గా శివరాత్రి రోజే*
*దాయాది పాకిస్థాన్‌తో మ్యాచ్*
*మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్*
*టీమిండియా ముందు 274 రన్స్ టార్గెట్*

టీమిండియాలోనూ, భారత్‌లోనూ ఒకటే టెన్షన్. కారణం అంతకుముందు నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మ్యాచ్‌ల్లో విఫలమైన టిమిండియా బ్యాటింగ్. మరో కారణం ఎదురుగా వకార్ యూనిస్, వసీం అక్రమ్,షోయబ్ అక్తర్, రజాక్‌లతో కూడిన భీకర పేస్ దళం.

వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి క్రీజ్‌లోకి వచ్చిన మాస్టర్ బ్లాస్టర్ పిచ్‌పై శివతాండవం చేశాడు. రెండో ఓవర్ నుంచి పాక్ బౌలర్లకు చుక్కలు చూపాడు.అక్తర్ తొలిఓవర్లోనే థర్డ్ మ్యాన్ దిశగా భారీ సిక్స్‌తో ఆరంభించిన సచిన్ తాండవం అలా అలా కొనసాగింది.ఆఓవర్లో మరో రెండు బౌండరీలు మొత్తం 18 రన్స్ వచ్చాయి. బీరాలు పలికిన రావల్పిండి ఎక్స్‌ప్రెస్ అక్తర్.. సచిన్ దెబ్బకు బీరుపోయాడు.

53 పరుగులకే సెహ్వాగ్, గంగూలీ వికెట్లను కోల్పోయినా సచిన్ తగ్గలేదు. శివుడే ఆవహించాడా అన్న తీరుగా పాక్ బౌలర్లపై తాండవ నృత్యం చేశాడు. 75 బంతుల్లోనే 12 ఫోర్లు, ఒసిక్స్‌తో 98రన్స్ సాధించాడు.బ్యాటింగ్ మాస్ట్రో ఇచ్చిన ధైర్యంతో ద్రావిడ్, యువరాజ్ కూడా ధాటిగా ఆడి మరో 5ఓవర్లు ఉండగానే దాయాదిపై విక్టరీ అందించారు.

### సరిహద్దు వేడి పిచ్ పైకి..
### భారత్-పాక్ క్రికెట్ సంగ్రామం

# కోట్లాది హృదయాల ధడక్! ధడక్!!

*భారత్-పాక్ మ్యాచ్ అంటే ఇరు దేశాల్లోనూ ఓ ఉత్కంఠ*
*ఆపరేషన్ సింధూర్ తర్వాత ఓ రకమైన ఉద్విగ్న వాతావరణం*
*షేక్‌హ్యాండ్స్ ఇచ్చుకోవడం కూడా మానేసిన భారత్-పాక్ ఆటగాళ్లు*
*సంబంధంలేని బంగ్లా వివాదంలో తలదూర్చి పాక్ మరింత అజ్ఞం*
*మొదట భారత్‌తో ఆడేది లేదని పాకిస్థాన్ మొండిపట్టు*
*ఐసీసీ ఒత్తిడితో వెనక్కి తగ్గడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠ*

**కొలంబో:** ఎట్టకేలకు టోర్నీ ఆఫ్ ది మ్యాచ్‌కు రూట్ క్లియర్ అయింది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్ జట్లు కొలంబో వేదికగా ఆదివారం మ్యాచ్ ఆడబోతున్నాయి. అసలు ఈ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్న ఎపిసోడ్‌తో మ్యాచ్‌కు మరింత హైప్ వచ్చింది. ఈ మ్యాచ్ కోసం భారత్, పాకిస్థాన్ దేశాల్లోని కోట్లాది మంది ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.తమ జట్టే గెలవాలని ఇరు దేశాల అభిమానులు బలంగా కోరుకుంటుండడంతో ఆటగాళ్లలోనూ ఒత్తిడి నెలకొంది. రెండేసి విజయాలతో ఉన్న భారత్, పాకిస్థాన్ జట్లు ఈ మ్యాచ్ కు రెడీ అయ్యాయి. 2003 శివరాత్రి నాటి ఫలితమే ఇపుడూ పునరావృతం కావాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సూర్యసేన మంచి ఊపులో ఉంది. అదే జోరును దాయాది జట్టుపై కూడా కొనసాగించాలని భావిస్తోంది.రెండు మ్యాచ్‌లు కూడా అమెరికా, నమీబియావంటి క్రికెట్ కూనలపై కావడంతో ఇపుడు టీమిండియా అసలుసిసలు పరీక్ష ఎదుర్కోబోతోంది.

**వచ్చేస్తున్న విధ్వంసకర ఓపెనర్**

నమీబియాతో మ్యాచ్‌కు దూరమైన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్.. హైవోల్టేజ్ మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం టీమిండియా అభిమానులకు శుభవార్తే. భారత బ్యాటింగ్ మరింత బలోపేతం కానుంది.శాంమ్సన్‌ను పక్కనపెట్టే అవకాశం ఉంది. ఇషాన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ,హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్‌లతో భారత్ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఇటీవలికాలంలో ఈ ఆటగాళ్లందరూ చక్కగా రాణిస్తూ భారత్‌కు అద్భుతవిజయాలు అందిస్తున్నారు.

**ఫ్లయింగ్ స్టార్ట్ అదరాల్సిందే...**

తొలి బంతినుంచే ఎదురుదాడికి దిగే అభిషేక్ శర్మకు ఇషాన్ కిషన్ కూడా తోడై భారత్‌కు ఫ్లయింగ్ స్టార్ట్ అందిస్తున్నారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్.. న్యూజిలాండ్ సిరీస్ నుంచి సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. నమీబియాపై కూడా మెరుపులు మెరిపించాడు. ఇద్దరూ పాకిస్థాన్‌పై జోరు చూపితే భారీ స్కోరు ఖాయం. తరువాత వచ్చే హైదరాబాదీ లయన్ తిలక్ వర్మ చక్కని స్కోర్లు సాధిస్తున్నాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. చక్కని ఫామ్‌లోకి వచ్చాడు. అమెరికాపై భారత్




ఇన్నింగ్స్‌ను ఒంటిచేత్తే నిలబెట్టాడు.ఇక ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్ పటేల్ బ్యాటింగ్‌లో మెరుపు మెరిపించగలవారే. నమీబియాపై లాగే పాక్‌పై విరుచుకుపడడానికి హార్దిక్ ఎదురుచూస్తున్నాడు. బ్యాటింగ్ మరింత పటిష్టంగా ఉండాలనుకుంటే రింకూ సింగ్‌ను తుది జట్టులో కొనసాగించే అవకాశం ఉంటుంది. అమెరికాపై మ్యాచ్‌లో లాగా నిర్లక్ష్యం చూపకుండా పాక్‌తో మ్యాచ్‌లో అప్రమత్తతతో ఆడితే భారత బ్యాటింగ్‌కు తిరుగుండదు.

**వికెట్ల వేటలో...**

భారత బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా పాకిస్థాన్‌ను కట్టడి చేసే స్థాయిలోనే ఉంది. అర్షదీప్ సింగ్ స్థానంలో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అమెరికా మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. పేస్ త్రయం యార్కర్ కింగ్ జస్‌ప్రీత్ బుమ్రా- సిరాజ్- హార్దిక్ పాండ్య కాంబినేషన్ చక్కగా వర్కవుట్ అవుతోంది. ఇక ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి తోడుగా అక్షర్ పటేల్ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్లను హడలెత్తిస్తున్నారు.పాక్‌పై చక్కని ట్రాక్ రికార్డు ఉన్న కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకుంటే ఎవరిని పక్కన పెడతారన్నది ఆసక్తిగా మారింది.

**దాయాదిని లైట్ తీసుకోలేం..**

సల్మాన్ అఘా కెప్టెన్సీలోని పాకిస్థాన్ జట్టును తక్కువ అంచనా వేయలేం. ముఖ్యంగా భారత్‌పై మ్యాచ్ అంటే గెలవాలన్న కసితో పాక్ ఆటగాళ్లు ఆడాలనుకోవడమే ఆ జట్టు బలం. అయితే ఐసీసీ టోర్నీల్లో భారత్‌పై వారికి ఉన్న బ్యాడ్ రికార్డే మైనస్. పాకిస్థాన్ జట్టు ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో పటిష్టంగానే ఉంది. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్... అమెరికాపై 73 పరుగులు సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. మరో ఓపెనర్ సయిమ్ అయుబ్ చక్కని స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడు. ఆ తర్వాత వచ్చే సల్మాన్ ఆఘా, బాబర్ ఆజమ్, నవాజ్, ఫహీమ్ అశ్రమ్ బ్యాటింగ్‌లో రాణిస్తే దాయదికి తిరుగుండదు. బౌలింగ్‌లో షహీన్ అఫ్రిది తురుపుముక్కగా ఉన్నాడు. భారత్‌పై అతనికి చక్కని రికార్డు ఉండడం కూడా కలిసివచ్చే అంశం. విభిన్న బౌలర్ ఉస్మాన్ తారిక్‌పై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. అబ్రార్ అహ్మద్, అయూబ్, షాదాబ్ ఖాన్... భారత్ బ్యాటింగ్‌ను ఎంతవరకు కట్టడి చేస్తారన్న అంశంపైనే పాక్ గెలుపు ఆధారపడి ఉంది.

**తొంగిచూస్తున్న వరుణుడు**

కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా జరగనున్న హైటెన్షన్ మ్యాచ్‌కు వరుణుడు కూడా తొంగి చూస్తున్నాడు. కొలంబోలో ఆదివారం వర్షం కురిసే అవకాశం 90 శాతం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఒకవేళ మ్యాచ్ రద్దయితే పరిస్థితి ఏంటి? ఇది గ్రూప్ స్టేజ్ మ్యాచ్ కావడంతో రిజర్వ్ డే ఉండదు.మరో రోజు మ్యాచ్ నిర్వహించే అవకాశం ఉండదు. ఓవర్లు తగ్గించి అయినా ఆడించేందుకు అంపైర్లు ప్రయత్నిస్తారు. సాధ్యంకాకపోతే ఇరు జట్లకు చెరో పాయింట్ లభిస్తుంది.

**జట్లు అంచనా : భారత జట్టు:** ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, రింకూసింగ్/సిరాజ్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా

**పాకిస్థాన్ జట్టు:** షాహిబ్జాదా ఫర్హాన్, సయిమ్ అయూబ్, సల్మాన్ ఆఘా(కెప్టెన్), బాబర్ ఆజమ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్/ఫకర్ జమాన్, మహ్మద్ నవాజ్, ఫహీం అశ్రఫ్, షాహీన్ అఫ్రిది, ఉస్మాన్ తారిక్, అబ్రార్ అహ్మద్




## సూపర్-8కి గట్టెక్కిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో ఇంగండ్ మళ్లీ పుంజుకుంది. వెస్టిండీస్ చేతిలో కంగుతిన్న బ్రూక్ సేన శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై విజయంతో సూపర్ 8 రేసులోకి దూసుకొచ్చింది. హిట్టర్లతో నిండిన ఇంగ్లండ్‌ను స్కాట్లాండ్ బౌలర్లు బెంబేలెత్తించి సవాల్ విసిరారు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా టామ్ బ్యాంటన్(63 నాటౌట్) సమయోచితంగా ఆడాడు.19వ ఓవర్లో విల్ జాక్స్(16 నాటౌట్) 4, 6 బాదడంతో 5 వికెట్ల తేడాతో గెలిచింది. స్కాట్లాండ్ సైతం రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిచ్చేలా కనిపించింది. కానీ, టామ్ బ్యాంటన్(63 నాటౌట్) ఒంటరి సైనికుడులా పోరాడి జట్టుకు ఓటమి తప్పించాడు. 153పరుగుల ఛేదనలో తొలి ఓవర్లోనే మెక్‌ముల్లెన్(123).. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(2)ను ఔట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు.రెండో ఓవర్లో జోస్ బట్లర్(3) సైతం డగౌట్ చేరగా, బ్యాంటన్, జాకబ్ బెథెల్(32) మూడోవికెట్‌కు 66పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ ద్వయాన్ని డేవిడ్‌సన్ విడదీశాడు. బెథెల్ ఔటయ్యాక హ్యారీ బ్రూక్(4), సామ్ కరన్(28) సాయంతో బ్యాంటన్ పోరాడి స్కాట్లాండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. 17 బంతుల్లో 15 పరుగులు అవసరమైన దశలో విల్ జాక్స్(16 నాటౌట్) ధనాధన్ ఓడించడం గ్లండ్ ఓటమిని తప్పించుకుంది. అంతకుముందు ఆదిల్ రషీద్(3/36) స్పిన్ ధాటికి స్కాట్లాండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. మైఖేల్ జోన్స్(33), రిచీ బెరింగ్టన్(49)ల మెరుపులతో ఆ జట్టు152 పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్(2/24), లియాం డాసన్(2/34)లు రెండేసి వికెట్లతో రాణించారు.

## నిత్య, స్నేహిత్ రికార్డు విజయాలు
## మానవ్-ఠక్కర్, మనుష్-దియా నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ చెన్నై 2026లో భారత్ ప్లేయర్లు సురవాజ్జుల స్నేహిత్, నిత్య మణి రికార్డు స్థాయిలో భారీ విజయాలు నమోదు చేసి పురుషుల, మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మానవ్-ఠక్కర్, మనుష్ షా-దియా చితాలే ఓటమితో నిష్క్రమించారు. స్నేహిత్ మొదట 0-2 తేడాతో పోరాడి మ్యాచ్‌ను నిర్ణయాత్మక రౌండ్‌లోకి తీసుకున్నాడు. మూడవ మ్యాచ్ పాయింట్‌ను 52 నిమిషాల్లో 3-2 (9-11, 15-17, 11-4, 11-6, 18-16) తేడాతో గెలుచుకుని టాప్ సీడ్ ఓహ్ జున్‌సంగ్‌తో రౌండ్ ఆఫ్ 16 పోరుకు సిద్ధమయ్యాడు.ప్రపంచ 481వ ర్యాంకర్ నిత్యా, రెండో రౌండ్ పోరులో 14వ సీడ్ ఆస్ట్రేలియాకు చెందిన జీని 3-2 (10-12, 12-10, 8-11, 11-7, 11-7) తేడాతో ఓడించింది. నాల్గవ సీడ్ చైనీస్ తైపీకి చెందిన చెంగ్ ఐచింగ్‌ను 3-1 (11-9, 11-5, 11-13, 11-5) తేడాతో ఐహికా ముఖర్జీని ఓడించింది. పురుషుల ప్రీక్వార్టర్స్‌కు 10వ సీడ్ జి. సత్యన్, 15వ సీడ్ మనుష్ షా కూడా చేరుకున్నారు. సత్యన్ కొరియా రిపబ్లిక్‌కు చెందిన లిమ్ జోంగ్‌హూన్‌ను 3-1 (11-7, 9-11, 11-9, 13-11) తేడాతో ఓడించగా, మనుష్ మరో కొరియాకు చెందిన పార్క్ గ్యుహ్యోన్‌ను 11-6, 11-7, 11-9 తేడాతో ఓడించాడు. ఇక పయాస్-సింద్రెలా దాస్ 3-1 తేడాతో మనుష్-దియా చిటాలేలను ఓడించి మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

## ఒమన్‌పై ఐర్లాండ్ ఘనవిజయం

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్‌లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చింది. ఒమన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. కొలంబో వేదికగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించి 96 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేశారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్‌కు ఒమన్ బౌలర్లు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు.ప్రారంభం నుంచే ఐర్లాండ్ బ్యాటర్లు ధాటిగా ఆడారు. కెప్టెన్ లోర్కాన్ టక్కర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. టక్కర్ సెంచరీ మిస్ చేసుకున్నప్పటికీ (94) నాటౌట్‌గా భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడు గెరెత్ డెలానీ (56) అద్భుత అర్థ శతకంతో అలరించగా, ఇన్నింగ్స్ చివరలో జార్జ్ డాక్రెల్ విధ్వంసం సృష్టించడంతో ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. ఐర్లాండ్ సాధించిన ఈ స్కోరు వారి టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా రికార్డులకు ఎక్కింది. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇక 236 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్‌కు ఆరంభం ఆశాజనకంగా ఉన్నా అది ఎక్కువ సేపు నిలవలేదు. ఓపెనర్ అమీర్ కలీమ్(50), హమ్మద్ మీర్జా(46) పోరాడినప్పటికీ మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐర్లాండ్ పేసర్ జోషువా లిటిల్ 3 వికెట్లు పడగొట్టి ఒమన్ పతనాన్ని శాసించగా, మాథ్యూ హంఫ్రీస్, బారీ మెకార్తీ చెరో 2 వికెట్లతో రాణించారు.

## టాప్ 40 టెక్ సిఇఒలతో ప్రధాని మోడీ భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** కృత్రిమమేధ ప్రభావసదస్సు 2026ను ప్రారంభించనున్న ప్రధానిమోడీ సదస్సులో పాల్గొంటున్న 40 మంది టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్‌లతో భేటీ కానున్నారు. ఈనెల 19వ తేదీ ఈ భేటీ ఉంటుందని అంచనా. మోడీ ప్రభుత్వం ఇప్పటికే ఎఐ సదస్సుద్వారా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఉంది. మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ సంస్థలు సమిష్టిగా ఇప్పటికే 67.5 బిలియన్ డాలర్లు ఎఐడేటా సెంటర్ మౌలికవసరులపై పెట్టుబడులు పెడతామని చెపుతున్నారు. మొత్తం 100కిపైగా టాప్ గ్లోబల్ టెక్‌సంస్థలు, 800 మందికిపైగా భాగస్వామ్య కంపెనీలు, ప్రభుత్వ అధికారులు విఐపిలు ఎందరో హాజరుకానున్నారు. వారంతా గతంలో ఇచ్చిన హామీలకు మించి పెట్టుబడుల హామీ ఇస్తారని చెపుతున్నారు. మేజర్‌గ్లోబల్‌కంపెనీలు నెట్‌ఫ్లిక్స్, జూమ్, అమెజాన్ వంటివికూడా ఈ చర్చల్లో పాల్గొంటాయి. కేవలం ఎన్వీడియా సంస్థ సిఇఒ హుంఆగ్‌జెనెసన్‌మాత్రం హాజరుకావడంలేదని ప్రకటించారు. అయితే ఉన్నతస్థాయి ప్రతినిధిని పంపిస్తారని చెపుతున్నారు. ప్రధానమంత్రి సిఇఒలమధ్య జరిగే కీలక చర్చల్లో పెట్టుబడులు,వాణిజ్యం, ఎఐ అమలుద్వారా భారీస్థాయిలో ఉపాధి సృష్టి వంటి వాటిపై ఉంటాయని కేంద్రం చెపుతోంది.




## ఎయిరిండియాకు డిజిసిఎ కోటి జరిమానా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఎయిర్‌వర్దీనెస్ అనుమతులు లేకుండా ఎయిరిండియా ఎయిర్‌బస్ విమానం ఎనిమిదిసార్లు పర్యటించడంతో డిజిసిఎ ఎయిర్‌ఇండియాపై ఒక కోటి రూపాయలు జరిమానా విధించింది. ఇలాంటి లోపాలు సంస్థపట్ల ప్రజల్లో నమ్మకం తగ్గిపోతుందని వెల్లడించింది. ఎయిర్‌బస్ ఎ320 ఎనిమిదిసార్లు ఇలాప్రయాణించి విభిన్నరంగాలకు సేవలందించింది. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్‌నగరాలకు గత ఏడాది నవంబరు 24,25 తేదీల్లో ఎలాంటి అనుమతులు క్లియరెన్సులు లేకుండాసేవలు అందించినట్లు డిజిసిఎ గుర్తించింది. ఎయిర్‌వర్దినెస్ రివ్యూ సర్టిఫికేట్ అనేది భద్రత, సెక్యూరిటీలపరంగా విమానాలు నడిపేందుకు ఇచ్చే క్లియరెన్సులుగా భావిస్తారు. అయితే ఎయిరిండియా మాత్రం వెంటనే స్పందించింది. డిజిసిఎ ఉత్తర్వులు అందాయి, 2025లో వెంటనే స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. గుర్తించిన సాంకేతిక లోపాలన్నీ పరిష్కరించామని, డిజిసిఎకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. ఈనెల ఐదవ తేదీతో వచ్చిన ఈ రహస్య జరిమానా ఉత్తర్వులు భారతీయ పౌరవిమానయాన అధికారులు, ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్‌లకు నివేదిక ఇస్తూ ఇలాంటి సంఘటనలవల్ల సంస్థభద్రతపై సందేహాలు పెరుగుతాయని అన్నారు. ఎయిర్‌లైన్స్ 30 రోజుల్లోపు రూ.1 కోటి చెల్లించాలని ఆజాయింట్ డైరెక్టర్ డిజిసిఎ మనీష్‌కుమార్ తెలిపారు.




## స్పెయిన్ స్టార్టప్ ట్రెనెస్‌ను కొనుగోలుచేసిన ఇక్సిగో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఆన్‌లైన్‌ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో స్పెయిన్‌లోని రెండో అతిపెద్ద ఆన్‌లైన్‌ట్రైన్ బుకింగ్‌యాప్ ట్రెనెస్‌ను కొనుగోలుచేసింది. ఈ సంస్థలో 60శాతం వాటాను ఆన్‌లైన్‌ట్రెవెల్ సొల్యూషన్స్ ఎస్‌ఎల్‌ను సుమారు రూ.125 కోట్ల వాటాలను దక్కించుకున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజికి తెలిపింది. అదనంగా ఒపెనీ స్పానిష్ స్టార్టప్ స్క్వాష్‌ను కూడా 45శాతం వాటాలు కొనుగోలుచేసింది. ఈ సంస్థ టెక్నాలజి ఆధారిత పరిష్కారాల సేవలు అందిస్తోంది. ఈ స్టార్టప్‌లో 45శాతం వాటా ఐదు కోట్లుగా ఉంది. గత ఏడాది అక్టోబరులోనే ఇక్సిగో పదిశాతం వాటాల విక్రయంతో రూ.1296 కోట్లు ఆర్జించింది. ప్రొసస్ కంపెనీ కొనుగోలుచేసింది. ఈ కొనుగోలు సింగపూర్ అనుబంధ ఇక్సిగో సంస్థ ద్వారా జరిపింది. మొత్తం డీల్‌మార్చినెలాఖరుకే పూర్తి అవుతుందని వెల్లడించింది. ట్రెనెస్‌లో మిగిలిన వాటా కొనుగోలుకు కూడా ఇక్సిగో హక్కులు కలిగి ఉంది. 2013లో స్థాపించిన ట్రెనెస్ శరవేగంగా వృద్ధితో ఉన్న లాభదాయకత ఫౌండర్ సొంత ఆన్‌లైన్‌ట్రైన్‌టికెట్ ప్లాట్‌ఫామ్‌గా నిలిచింది. స్పెయిన్, దక్షణి యూరోప్ ప్లాట్‌ఫామ్‌లలో భారీ స్థాయిలోకస్టమర్లను కలిగి ఉంది. అలాగే స్పానిష్, యూరోపియన్‌రైల్ ఆపరేటర్లతో పరస్పర ఒప్పందాలతో నడుస్తోంది. సుమారు 5.5 మిలియన్ యూరోలు అంటే 60 కోట్లు రాబడులు రూ.15 కోట్ల నికరలాభం ఆర్జించింది.

## వారంలో ఎఫ్‌పిఐ పెట్టుబడులు రూ.14,160 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 14:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత్‌మార్కెట్లలో ఈ వారాంతానికి రూ.14,159.82 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఎన్‌ఎస్‌డిఎల్ డేటాను పరిశీలిస్తే ఒక్క మంగళశారంరోజునే 4069 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. సోమవారం కూడా 3094.88 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. గురువారం కూడా 3113.09 కోట్లు రాగా శుక్రవారం, బుధశారాల్లో స్వల్పంగా ఉన్నాయి. 2408.18 కోట్లు, 1473.68 కోట్లుగా ఈ రెండురోజుల్లోని పెట్టుబడులు నిలిచాయి. ఈక్విటీ మార్కెట్లు ఈ పెట్టుబడులతో మరింత దూసుకుపోయాయి. ఎఫ్‌పిఐలు 11,545.81 కోట్లు ఈక్విటీల్లో ఐదురోజుల్లో పెట్టుబడులుపెట్టారు. ఇక డెట్‌మార్కెట్లుకూడా 2896.21కోట్లు పెట్టుబడులు అందుకున్నాయి. ఒక్క శుక్రవారం రోజే 1511.86కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. డెబ్ట్ జనరల్, డెట్ విఆర్ఆర్; డిట్ ఎఫ్‌ఎఆర్ సెగ్మెంట్లలో ఈ పెట్టుబడులున్నాయి. గురువారం30.58 కోట్లు రాగా బుధవారం 1133.86 కోట్లు, వచ్చాయి. మంగళవారం 435.70 కోట్లు, సోమవారం 448.91 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇక హైబ్రిడ్ స్కీంలలో మాత్రం 1146.75కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. ఒక్క వారం ప్రారంభంలోనే 1012.12కోట్లు విత్‌డ్రా అయ్యాయి అయితే మ్యూచ్వల్‌ఫండ్ స్కీంలలో మాత్రం 199.95 కోట్లు పెట్టుబడులు వచ్చాయి.





## ఇండామర్ టెక్నిక్ కంపెనీ కొనుగోలుచేసిన అదానీ

**ముంబయి, ఫిబ్రవరి 14:** ఆదానిగ్రూప్ ఇప్పటికే తన ఏరోస్పేస్ కార్యకలాపాలకోసం వివిధ కంపెనీలను కొనుగోలుచేస్తోంది. ఇందామర్ టెక్నిక్స్ కంపెనీని కొనుగోలుచేసి ఎంఆర్ఒ విభాగం, ఎయిర్‌క్రాఫ్ట్ సేవలు అందించేందుకు సిద్ధం అవుతోంది. ఆదాని ఎంటర్‌ప్రైజెస్‌నుంచి అనుబంధంగా ఉన్నహారిజన్ ఏరోసొల్యూషన్స్ కంపెనీ 100శాతం ఐటిపిఎల్ వాటాలను షేర్ పర్చేజ్ ఒప్పందంతో కొనుగోలుచేసింది. వారాంతంలోనే స్టాక్ ఎక్ఛేంజిలకు కూడా తెలియజేసింది. ఐందామర్ టెక్నిక్స్ విలువలు రూ.330 కోట్లుగా ఉన్నాయి. ఈ డీల్‌ను గత ఏడాది ఆగస్టులోనే వెల్లడించారు. ఐటిపిఎల్‌కంపెనీ ప్రైవేటు ఎంఆర్ఒ కంపెనీల్లో లీడింగ్ సంస్థగా నిలుస్తోంది. అధునాతన 30 ఎకరాల వైశాల్యం ఉన్న మిహాన్‌సెజ్ నాగ్‌పూర్‌లో ప్రత్యేక ఫెసిలిటీని ఏర్పాటుచేసుకుంది. హారిజాన్ ఏరో ప్రైవేటురంగ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ నిర్వహణ సంస్థగా ఉంది. ఈ సంస్థ ఆదాని డిఫెన్స్, ప్రైమ్ ఏరో రెండింటా 50:50వాటాతో నడుస్తున్నది. ప్రజాయ్‌పటేల్ ఇండామర్ టెక్నిక్స్ డైరెక్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కంపెనీ కొనుగోలును డిజిసిఎ ఆమోదించింది. ఫెడరల్ ఏవియేషన్ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇతర గ్లోబల్ సివిల్ ఏరో రెగ్యులేటర్లు కూడా తమ సమ్మతి తెలిపాయి. నాగ్‌పూర్ కేంద్రంలో మొత్తం 15 ఎయిర్‌క్రాఫ్ట్ బేలు, పది హ్యాంగార్లమధ్యలోఏర్పాటయ్యాయి. ఆదానిగ్రూప్ ఇండియా ప్రైవేటు ఎయిర్‌ఫోర్టు ఆపరేటర్‌గా నిలిచింది. మొత్తం ఎనిమిది దేశీయ ఎయిర్‌పోర్టులు పర్యవేక్షిస్తోంది. ఇండియా ఎంఆర్ఒ పరిశ్రమ రానున్నరోజుల్లో మరింతగా వృద్ధిలోకి వస్తోంది. మౌలికవసరుల విస్తరణతో మరింతగా భారతీయులు ఎయిర్‌ట్రావెల్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

## ఆర్‌ఎంజడ్‌తో సిగ్నేచర్ గ్లోబల్ జాయింట్ వెంచర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** న్యూఢిల్లీ కేంద్రంగాపనిచేస్తున్న రియల్ ఎస్టేట్‌సంస్థ సిగ్నేచర్‌గ్లోబల్ బెంగళూరు ఆర్‌ఎంజడ్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకువచ్చింది. ఇందుకోసం 50శాతం జాయింట్‌వెంచర్ నడుపుతోంది. ఆర్‌ఎంజడ్‌తో కలిసి పనిచేయడంతోపాటు సిగ్నేచర్‌గ్లోబల్ రూ.1283 కోట్లు పెట్టుబడులకు కూడా ముందుకువచ్చిది. సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్‌ప్రదీప్ అగర్వాల్‌మాట్లాడుతూ ఆర్‌ఎంజడ్‌తో సంపూర్ణ భాగస్వామ్యంతో 55 లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో మిశ్రమ వినియోగ వాణిజ్య ఆస్తులు రూపొందిస్తామని ప్రకటించింది. ఈ అప్రాజెక్టు ఒక్కటే రూ.7500 కోట్లు ప్రణాళికతో ఉంది. మొత్తం మూలధన విలువలు ప్రాజెక్టుపూర్తయేనాటికి సుమారు 14 నుంచి 16 వేలకోట్లవరకూ ఉంటుందని అంచనా. వీటితోపాటే సిగ్నేచర్ బ్రాండెడ్ నివాసిత యూనిట్లను వాణిజ్య కాంప్లెక్స్‌లకు చేరువలోనే నిర్మిస్తోంది. ఈలావాదేవీతోపాటు కంపెనీ గురుగ్రామ్ కామర్సిటీ, మిల్లీనియా రియాల్టర్స్ రెండూ కూడా ఎస్‌ఎస్‌పిఎ ఒప్పందానికి వచ్చాయి.ఈ ఒప్పందం కింద ఆర్‌ఎంజడ్ 50శాతం వాటాను జిసిఎల్‌లో కొనుగోలుచేస్తుంది. వాటాలకొనుగోళ్లు, లావాదేవీలతో సుమారు 1283 కోట్లమేర నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంతో వచ్చే మొత్తాల ద్వారా సిగ్నేచర్‌గ్లోబల్ రుణభారం లేని కంపెనీగా మారుతుందని ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.